

'ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలు ఎవరినీ క్షమించవు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 15 సంచిక: 255

మంగళవారం 6-12-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLIGUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



క్రొయేషియా.. కేక

మూటౌట్‌లో జపాన్‌పై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశం - 12లో



35 బేసిస్ పాయింట్ల వరకూ..!

ఆర్బీఐ ఎంపీసీ సమావేశం ప్రారంభం వడ్డీ రెపో రేటును పెంచే ఛాన్స్ - 13లో



జనవరిలో 'మహిళా మార్చ్'

ప్రియాంకా గాంధీ నేతృత్వంలో జనవరి 26 నుంచి మార్చి 26 వరకు 'మహిళా మార్చ్' చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది.

వివరాలు 6లో



లాలూ కిడ్నీ మార్పిడి సక్సెస్

ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్‌యాదవ్‌కు సింగపూర్‌లోని ఆస్పత్రిలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా జరిగింది.


వివరాలు 6లో



కరోనా వైరస్.. మానవ సృష్టే

కరోనా వైరస్ మానవ సృష్టేనని చైనాలోని వూహాన్ ల్యాబ్‌లో పని చేసిన అమెరికా శాస్త్రవేత్త ఆండ్రూ హఫ్ చెప్పారు.

వివరాలు 6లో



రాజ్యాంగ విరుద్ధం

బలవంతంగా మతం మార్చడం మున్ముందు తీవ్రమైన అంశమని.. ఇది రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది.

వివరాలు 6లో

న్యూస్‌రీల్

వాయుగుండం కాదు.. వచ్చేది తుపానే



కొద్దిరోజులుగా బంగాళాఖాతంలో ఏర్పడుతుందనుకుంటున్న వాయుగుండం అంచనా తప్పి బలపడనుంది. తుపానుగా మారి తమిళనాడు, దక్షిణ కోస్తాంధ్ర వైపు పయనించనుంది. దీని ప్రభావం మన రాష్ట్రంపై కూడా పడనుంది. కాగా, సోమవారం 'అండమాన్'లో అల్పపీడనం ఏర్పడింది.

వివరాలు 3లో ▸

పర్యాటక కేంద్రాలుగా పక్షుల విడిది క్షేత్రాలు



శ్రీకాకుళం జిల్లాలోని వలస పక్షుల విడిది ప్రాంతాలైన ఇచ్ఛాపురం మండలం తేలుకుంచి, టెక్కలి మండలం తేలినీలాపురాన్ని పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతామని అటవీ జంతు సంరక్షణాధికారి శాంతిప్రియ పాండే చెప్పారు. వలస పక్షుల సంరక్షణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వివరాలు 14లో ▸

ఆ 'స్కిల్' ఎవరిది?



చంద్రబాబు ప్రభుత్వ హయాంలో జరిగిన 'ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్' కుంభకోణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ లోతుగా విచారణ మొదలుపెట్టింది. షెల్ కంపెనీల ప్రతినిధులను ఈడీ విచారించింది. చంద్రబాబు సన్నిహితులు మాత్రం విచారణకు హాజరుకాలేదు.

వివరాలు 3లో ▸



కర్నూలులో జరిగిన 'రాయలసీమ గర్జన'కు భారీగా హాజరైన జనసందోహంలోని ఓ భాగం

గర్జించిన కర్నూలు

హైకోర్టు సాధనకు రాయలసీమవాసుల సింహనాదం

- 'న్యాయం' కోసం తలపెట్టిన 'రాయలసీమ గర్జన' సక్సెస్
- భారీగా తరలివచ్చిన ప్రజలు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు
- ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం: జేఏసీ నేతలు
- సీమకు న్యాయం చేసేది జగన్ మాత్రమే: మంత్రి పెద్దిరెడ్డి
- హైకోర్టు నిర్మించి తీరుతాం: ఆర్థిక మంత్రి బుగ్గన

సాక్షి ప్రతినిధి, కర్నూలు: రాయలసీమ గర్జన పేరుతో 'సీమ'వాసులు సోమవారం కర్నూలులో సింహనాదం చేశారు. 'సీమవాసుల న్యాయమైన' ఆకాంక్షను యావత్ రాష్ట్రానికి తెలిసేలా గర్జించారు. హైకోర్టు సాధించేవరకు విశ్రమించేది లేదని, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని శపథం చేశారు. 'జై రాయలసీమ.. ఉయ్ వాంట్ జ్యుడీషియల్ క్యాపిటల్' అంటూ కర్నూలు నగరం హోరెత్తేలా..

మిగతా 2వ పేజీలో ▶

గుజరాత్ బీజేపీదే!

అన్ని ఎగ్జిట్ పోల్స్‌దీ అదే మాట

- రికార్డుస్థాయిలో ఏడోసారీ విజయం
- కాంగ్రెస్‌కు ఓటమే.. ఉనికి చాటనున్న ఆప్
- హిమాచల్‌లో బీజేపీ, కాంగ్రెస్ హోరాహోరీ
- పలు సర్వేల్లో బీజేపీకి మొగ్గు
- కాంగ్రెస్‌కు ఒకటి, రెండు సర్వేలు జై
- ఢిల్లీ కార్పొరేషన్‌పై ఎగరనున్న ఆప్ జెండా
- గురువారం ఫలితాల వెల్లడి

6లో



గుజరాత్‌లో ఓటు వేసిన ప్రధాని నరేంద్ర మోదీ

మెడికో గొంతు కోసి చంపిన టెకీ

- బీడీఎస్ విద్యార్థినిని హతమార్చిన యువకుడు
- ప్రేమను తిరస్కరించిందన్న అక్కసుతో ఘాతుకం
- గుంటూరు జిల్లా తక్కెళ్లపాడులో ఘటన



నిందితుడు జ్ఞానేశ్వర్

14లో

ఏపీలో మహిళా సాధికారత భేష్

స్వయం సహాయక సంఘాల మహిళల ఎదుగుదల అద్భుతం

- మీ విజయగాథలు విని పులకించిపోయా
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో మహిళలతో ముఖాముఖి
- అంతకుముందు శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్రపతి

- వివరాలు 14లో



శ్రీవారి ఆలయంలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

నలుగురు అయ్యప్ప భక్తుల దుర్మరణం

బాపట్ల జిల్లా జంపని గ్రామ సమీపంలో సోమవారం ఘోర ప్రమాదం జరిగింది. వాహనం బోల్తా పడటంతో నలుగురు అయ్యప్ప మాలధారులు మృతి చెందారు. ఈ ఘటనలో డ్రైవర్ సహా 20 మంది గాయపడ్డారు. ఈ ప్రమాదంపై సీఎం వైఎస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

14లో



బోల్తాపడిన వాహనం



జీ-20 సన్నాహక సదస్సు సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌తో ముచ్చటిస్తున్న ప్రధాని మోదీ

ఎలాంటి బాధ్యతైనా సిద్ధమే

జీ-20 దేశాల సన్నాహక సదస్సులో ముఖ్యమంత్రి జగన్

అంతర్జాతీయ సమాజం దృష్టంతా మనవైపే..

పార్టీలకతీతంగా ఏకతాటిపై నిలుద్దాం.. ఎన్ని విభేదాలున్నా ఈ సమయంలో రాజకీయ వ్యాఖ్యలు సరికాదు

2లో

పైసా తగ్గకుండా 'మద్దతు' ధర

ప్రతి రైతుకు సంపూర్ణ మద్దతు ధర కల్పించడమే లక్ష్యం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- డీబీటీతో పారదర్శకంగా నేరుగా ఖాతాల్లోకి ధాన్యం సొమ్ము జమ
- రవాణా, హమాలీ ఖర్చులను ప్రభుత్వం అదనంగా ఇస్తోంది
- ధాన్యం సేకరణలో కొత్త విధానంపై ఆర్బీకేల్లో పోస్టర్లు ప్రదర్శించాలి
- యాప్‌లో సిగ్నల్ సమస్యలొస్తే ఆఫ్‌లైన్‌లో వివరాల నమోదు
- రైతుల ఫోన్లకు ఆడియో, వీడియో సందేశాలు పంపాలి
- క్షేత్ర స్థాయిలో ఎక్కడా గోనె సంచులకు కొరత రానివ్వొద్దు.. వచ్చే ఖరీఫ్ నుంచి సీఎంఆర్ మిల్లుల్లో డ్రయర్ల ఏర్పాటు
- జిల్లా పౌరసరఫరాల అధికారుల్లో జవాబుదారీతనం పెంచేలా ఎస్‌వోపీలు
- ప్రజలు కోరితే పీడీఎస్ ద్వారా చిరుధాన్యాలను సరఫరా చేయాలి
- పౌరసరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలపై సమీక్షలో సీఎం

2లో

రేపే 'జయహో బీసీ' మహాసభ

- విజయవాడలో ఏర్పాట్లను పరిశీలించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి, మంత్రులు
- గడిచిన మూడున్నరేళ్లలోనే బీసీలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ లబ్ధి
- బీసీల సంక్షేమం కోసం ఏడాదికి రూ. 1.37 లక్షల కోట్లు మంజూరు
- జనాభాలో 50 శాతం మంది ఉన్న బీసీలకు 50 శాతం నామినేటెడ్ పదవులు
- బీసీలకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు వైఎస్సార్‌సీపీ సిద్ధం

3లో

క్లుప్తంగా

రాజ్యసభ వైస్ చైర్మన్‌గా విజయసాయిరెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: రాజ్యసభ వైస్ చైర్మన్‌గా వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డిని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్ నియమించారు. విజయసాయిరెడ్డితో పాటు మరో ఏడుగురికి వైస్ చైర్మన్ ప్యానల్‌లో అవకాశం కల్పించారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. తనకు వైస్ చైర్మన్‌గా అవకాశమిచ్చిన ఉప రాష్ట్రపతికి విజయసాయిరెడ్డి ట్విట్టర్ వేదికగా ధన్యవాదాలు తెలిపారు.

1,458 'సీనియర్ రెసిడెంట్'ల నియామకానికి నోటిఫికేషన్

- 10 వరకు దరఖాస్తులకు గడువు



సాక్షి, అమరావతి: ప్రభుత్వ మెడికల్, డెంటల్ బోధనాస్పత్రుల్లో 1,458 సీనియర్ రెసిడెంట్(ఎస్ఆర్) డాక్టర్ల నియామకానికి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) నోటిఫికేషన్ ఇచ్చింది. గత నెలలోనే ఎస్ఆర్‌ల నియామకానికి డీఎంఈ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే ఆ నోటిఫికేషన్‌లో కేవలం ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పీజీ చదివిన వారికి అవకాశం కల్పించారు. ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేసి ప్రైవేట్ వైద్య కళాశాలల్లో చదివిన వారికీ అవకాశం కల్పిస్తూ మరో నోటిఫికేషన్ ఇచ్చారు. శనివారం నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. ఈ నెల 10వ తేదీ రాత్రి 12 గంటల వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వీలుంది. 45 ఏళ్ల లోపు వయసుండి, ఏపీ స్థానికత కలిగి ఉండి పీజీ/డెంటల్ డిగ్రీ చదివి ఏపీ మెడికల్/డెంటల్ కౌన్సిల్‌లో రిజిస్టర్ వైద్యులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. http://dme.ap.nic.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఎంపికైన అభ్యర్థులు ఏడాది పాటు ఎస్ఆర్‌లుగా సేవలు అందించాల్సి ఉంటుంది. సూపర్ స్పెషాలిటీ సీనియర్ రెసిడెంట్‌కు రూ.85 వేలు, స్పెషాల్టీ సీనియర్ రెసిడెంట్‌కు రూ.70 వేలు, సీనియర్ రెసిడెంట్(పీజీ)కు రూ.65 వేల చొప్పున గౌరవ వేతనం ఉంటుంది. పీజీ తుది పరీక్షల్లో వచ్చిన(థియరీ, ప్రాక్టికల్స్)మార్కుల్లో మెరిట్ ప్రామాణికంగా, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఎంపికలు చేపడతారు. అత్యధికంగా ఎమర్జెన్సీ మెడిసిన్‌లో 144, జనరల్ మెడిసిన్‌లో 101, జనరల్ సర్జరీ విభాగంలో 101 ఖాళీలున్నాయి. పాథాలజీలో 88, అనాటమీలో 85, ఫార్మకాలజీలో 80, గైనకాలజీలో 69, అనస్థీషియాలో 56, పీడియాట్రిక్స్‌లో 56, ఆప్తమాలజీలో 56 ఖాళీలున్నాయి. ఇలా మొత్తంగా 49 విభాగాల్లో 1,458 ఎస్ఆర్ పోస్టులు భర్తీ కానున్నాయి.

జీ-20పై అఖిలపక్ష భేటీకి హాజరైన చంద్రబాబు

సాక్షి, న్యూఢిల్లీ: జీ-20 దేశాల సదస్సు సన్నాహాల్లో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సోమవారం రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన అఖిలపక్ష భేటీకి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు హాజరయ్యారు. టీడీపీ ఎంపీలు గల్లా జయదేవ్, కేశినేని నాని, రామ్మోహన్ నాయుడు, కనకమేడల రవీంద్ర కుమార్‌తో కలసి చంద్రబాబు రాష్ట్రపతి భవన్‌కు వచ్చారు. అఖిలపక్ష భేటీ సందర్భంగా ప్రధాని మోదీతో చంద్రబాబు కొద్దిసేపు ముచ్చటించారు. భేటీకి ముందు ఎంపీ గల్లా జయదేవ్ ఇంట్లో పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహించారు. బుధవారం నుంచి ఆరంభమయ్యే శీతాకాల సమావేశాల్లో చర్చించాల్సిన అంశాలపై చర్చించారు. అంతకుముందు నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు చంద్రబాబును కలిశారు.



రాష్ట్రపతి భవన్‌లో అఖిలపక్ష భేటీలో ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా, సీఎం వైఎస్ జగన్, తదితరులు





సీఎం జగన్, మమతా బెనర్జీతో మాట్లాడుతున్న మోదీ. ప్రధానికి నమస్కరిస్తున్న చంద్రబాబు

ఎలాంటి బాధ్యతైనా సిద్ధమే

సాక్షి, న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక జీ-20 దేశాల సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇస్తున్న నేపథ్యంలో నిర్వహణ, సన్నాహాలకు సంబంధించి ఎలాంటి బాధ్యతలు అప్పగించినా చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. సదస్సు విజయవంతానికి రాష్ట్రం తరఫున అన్నివిధాలా సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. జీ-20 దేశాల సదస్సు సన్నాహకాలు, వ్యూహాల ఖరారులో భాగంగా ప్రధాని మోదీ అధ్యక్షతన సోమవారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన సమావేశానికి ముఖ్యమంత్రి జగన్ హాజరయ్యారు. జీ-20 దేశాధినేతల ప్రతిష్టాత్మక సదస్సుకు భారత్ వేదిక కావడం పట్ల ఈ సందర్భంగా సీఎం సంతోషం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ సమాజం మన దేశం వైపు చూస్తున్న తరుణంలో పార్టీలకతీతంగా అందరూ ఒకేతాటిపైకి రావాల్సి ఉందని స్పష్టం చేశారు. ఈ సమయంలో రాజకీయ కోణాల్లో వ్యాఖ్యలు చేయడం సరి కాదన్నారు. రాజకీయ పార్టీల మధ్య విభేదాలు సహజమని, వాటిని మనవరకే పరిమితం చేసి జీ-20 సదస్సును విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. అనంతరం సీఎం జగన్ రాష్ట్రపతి భవన్ నుంచి నేరుగా విమానాశ్రయానికి చేరుకొని విజయవాడ బయల్దేరారు. అంతకుముందు ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో ముఖ్యమంత్రి జగన్‌కు వైఎస్సార్‌సీపీ ఎంపీ అయోధ్య రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

పైసా తగ్గకుండా 'మద్దతు'ధర

సాక్షి, అమరావతి: ధాన్యం రైతులకు ఒక్క పైసా కూడా తగ్గకుండా మద్దతు ధర కల్పించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. కళ్లాల నుంచి ధాన్యం తరలించేందుకు అయ్యే రవాణా, హమాలీ చార్జీలను ప్రభుత్వం అదనంగా ఇస్తోందన్న విషయాన్ని రైతులకు అర్థమయ్యేలా చెప్పాలన్నారు. ధాన్యం సేకరణలో మిల్లర్ల ప్రమేయాన్ని పూర్తిగా తొలగిస్తూ సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టామన్నారు. ధాన్యం సేకరణలో కొత్త విధానాలపై ఆర్బీకేల్లో పోస్టర్లను ప్రదర్శిస్తూ రైతులకు అవగాహన కల్పించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. దీంతో పాటు రైతుల ఫోన్లకు ఆడియో, వీడియోల రూపంలో సందేశాలను పంపాలని సూచించారు. రైతులకు జరిపే చెల్లింపులన్నీ అత్యంత పారదర్శకంగా ఉండాలని, పౌరసరఫరాల కార్పొరేషన్ నుంచి ప్రత్యక్ష నగదు బదిలీ పద్ధతి(డీబీటీ)లో పూర్తి మద్దతు ధరను జమ చేయాలని నిర్దేశించారు. ధాన్యం సేకరణ, ప్రత్యామ్నాయ పంటల సాగుపై పౌరసరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్, రవాణా శాఖల అధికారులతో సోమవారం క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు. ఆ వివరాలివీ..

ప్రతి రైతుకి సంపూర్ణ మద్దతు ధర కల్పించడమే లక్ష్యం: సీఎం జగన్



ధాన్యం సేకరణ, ప్రత్యామ్నాయ పంటల సాగుపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహిస్తున్న సీఎం వైఎస్ జగన్

ధాన్యం సేకరణ యాప్..

ధాన్యం సేకరణలో కొత్త విధానం అమలు తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. చిన్నచిన్న సమస్యలు ఎదురైతే అక్కడికక్కడే పరిష్కరిస్తూ రైతులకు మరింత మెరుగ్గా సేవలందించేలా చర్యలు తీసుకోవాలి. కొనుగోళ్ల లక్ష్యానికి అనుగుణంగా గోనె సంచులను సమకూర్చుకోవాలి. పంట ఉత్పత్తులను తరలించుకునేందుకు రైతులు ఎక్కడా ఇబ్బంది పడకూడదు. ధాన్యం సేకరణ యాప్‌లో సిగ్నల్స్ సమస్యలు తలెత్తితే ఆఫ్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలి. సిగ్నల్స్ ఉన్న ప్రదేశాల్లోకి వెళ్లగానే ఆ వివరాలు ఆటోమేటిక్‌గా యాప్‌లో అప్‌లోడ్ అయ్యేలా మార్పులు చేసుకోవాలి. ఇప్పటికే వివిధ ప్రభుత్వ శాఖల్లో ఇలాంటి పద్ధతులు పాటిస్తున్నారు. అవసరమైతే వారి నుంచి సాంకేతిక సహకారాన్ని పొందాలి. ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి రైతులు ఇబ్బంది పడుతున్నారు. దీనికి పరిష్కారంగా వచ్చే ఖరీఫ్ నుంచి సీఎంఆర్ రైస్ మిల్లుల్లో డ్రయర్లు ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టాలి. కొనుగోళ్ల సమయంలో ఇబ్బంది లేకుండా ఇతర శాఖల నుంచి అవసరమైన మేరకు సిబ్బందిని డిప్యుటేషన్‌పై నియమించుకోవాలి.

జవాబుదారీతనం పెరిగేలా..

పౌరసరఫరాల శాఖలో ఎక్కడా అవినీతి, అవకతవకలకు ఆస్కారం లేకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలి. జిల్లా పౌరసరఫరా అధికారుల్లో జవాబుదారీతనం పెంపొందించేలా వారి విధివిధానాలపై స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్ఓపీ) రూపొందించాలి. వీటిని కచ్చితంగా పాటించేలా సమర్థంగా పర్యవేక్షించాలి.

ప్రత్యామ్నాయ పంటలపై ప్రత్యేక దృష్టి

ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి. ఆసక్తి ఉన్న వారిని గుర్తించి అన్ని విధాలా తోడ్పాటు అందించాలి. మన ప్రభుత్వం వచ్చాక చిరుధాన్యాల (మిల్లెట్స్) సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నాం. పుష్కలమైన పోషకాలను అందించే చిరుధాన్యాలు కావాలని ప్రజలు కోరితే ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్)ద్వారా సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలి.

హాజరైన మంత్రులు, అధికారులు..

సమీక్షలో వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఏపీ వ్యవసాయ మిషన్ వైస్‌చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి, సీఎస్ డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్, మార్కెటింగ్ శాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి, ఆర్థికశాఖ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, రవాణా శాఖ కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న, వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ సి.హరికిరణ్, మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ విజయ సునీత, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బీసీల రిజర్వేషన్లు మింగేసిన టీడీపీ


- ఆ పార్టీ నేత కోర్టుకు వెళ్లడంతో స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లకు కోత
- బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ 2019 డిసెంబరు 28న జగన్ సర్కార్ జీఓ
- ఆ వెంటనే సుప్రీంకోర్టుకు వెళ్లిన టీడీపీ నేత బిర్రు ప్రతాప్‌రెడ్డి
- జగన్ సర్కార్ ఇచ్చిన జీఓను నిలుపుదల చేసిన సుప్రీంకోర్టు
- దీంతో మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికే పరిమితం

సాక్షి, అమరావతి : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు దక్కాల్సిన దాదాపు పది శాతం రిజర్వేషన్లకు తెలుగుదేశం పార్టీ గండికొట్టింది. గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసినా కూడా 2014–19 మధ్య చంద్రబాబు తన ఐదేళ్ల పాలనలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించక పోగా.. ఆ తర్వాత వైఎస్ జగన్ సీఎం అయ్యాక బీసీలకు 34 శాతం రిజర్వేషన్లతో పాటు మొత్తం 58.95 శాతం రిజర్వేషన్లు కల్పించి అన్ని రకాల స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పూనుకున్నారు. కానీ, టీడీపీ నేత కోర్టుకెళ్లి బీసీల రిజర్వేషన్లకు కోత పెట్టించారు. దీంతో.. జెడ్పీ చైర్మన్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు సహా దాదాపు 15 వేలకు పైగా పదవులను ఆ వర్గాలు కోల్పోవాల్సి వచ్చింది. నిజానికి.. 2013లో ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన స్థానిక ఎన్నికల్లో అమలుచేసిన రిజర్వేషన్లతో పోలిస్తే బీసీలకు ఏ మాత్రం రిజర్వేషన్లు తగ్గించకుండా.. అదే సమయంలో ఎస్సీ, జనరల్ కేటగిరి రిజర్వేషన్లు పెరిగేలా.. పంచాయతీరాజ్ ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కలిపి 59.85 శాతం రిజర్వేషన్ల అమలుకు సీఎం వైఎస్ జగన్ సర్కారు 2019 డిసెంబరులో జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయించింది.



GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలుచేస్తూ వైఎస్ జగన్ ప్రభుత్వం జారీ చేసిన జీఓ



SUPREME COURT OF INDIA
RECORD OF PROCEEDINGS

టీడీపీ నేత బిర్రు ప్రతాప్‌రెడ్డి వేసిన కేసులో 'సుప్రీం' తీర్పు



ప్రతాప్‌రెడ్డికి నామినేటెడ్ పదవిని కేటాయిస్తూ చంద్రబాబు ప్రభుత్వం జారీ చేసిన జీఓ

బీసీలకు 34 శాతం రిజర్వేషన్లతో జీఓ..

- రాష్ట్ర విభజన తర్వాత కొత్తగా ఏర్పడిన ఏపీలో ఎస్టీల జనాభా తగ్గిపోయి, ఎస్సీల జనాభా పెరిగిపోవడంతో నిబంధనల ప్రకారమే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల మార్పులు చోటుచేసుకున్నాయి. బీసీల రిజర్వేషన్లు 34 శాతం కొనసాగిస్తూ.. ఎస్టీలకు తగ్గిపోయిన రిజర్వేషన్ల స్థానంలో ఎస్సీలకు 2013లో ఉన్న 18.30 శాతం నుంచి 19.08 శాతానికి.. జనరల్ కేటగిరి అభ్యర్థులకు కూడా 2013లో అమలుచేసిన 39.44 శాతం రిజర్వేషన్లు 40.15 శాతానికి పెరిగాయి.
- ఈ మేరకు జగన్ ప్రభుత్వం 2019 డిసెంబరు 28న జీఓ–176 జారీచేసింది.
- పంచాయతీరాజ్ శాఖాధికారులు కూడా జెడ్పీ చైర్మన్, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచి, వార్డు సభ్యుల పదవుల్లో బీసీలకు 34 శాతం చొప్పున రిజర్వేషను ఖరారుచేసి 2020 జనవరిలో రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు సమర్పించింది.

ఆ జీవోపై 'సుప్రీం'లో టీడీపీ కేసు

అయితే, జగన్ సర్కారు తీసుకున్న ఈ నిర్ణయంపై చంద్రబాబు హయాంలో రెండుసార్లు నామినేటెడ్ పదవిని అనుభవించిన కర్నూలు జిల్లాకు చెందిన బిర్రు ప్రతాప్‌రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల్లో మొత్తం రిజర్వేషన్లు 50 శాతం దాటాయంటూ సుప్రీంకోర్టుకు వెళ్లారు. ఈయన టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బాబు రాజేంద్రప్రసాద్ గౌరవాధ్యక్షుడిగా కొనసాగుతున్న ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ సంఘం (ఇది ప్రైవేట్ సంఘం) ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ప్రతాప్‌రెడ్డి పిటిషన్‌తో.. కోర్టు 176 జీవోను కొట్టేసింది. ఆ తర్వాత కూడా ప్రతాప్‌రెడ్డి మరోసారి స్థానిక సంస్థల రిజర్వేషన్లపై హైకోర్టును కూడా ఆశ్రయించారు. దీంతో ప్రభుత్వం మొత్తం 59.85 శాతంగా నిర్ణయించిన రిజర్వేషన్లను 50 శాతానికి పరిమితం చేస్తూ ఆదేశాలిచ్చింది. నిజానికి.. రాజ్యాంగం ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు మార్పులు చేయకూడదు. ఈ ఆదేశాలతో బీసీలే 9.82 శాతం రిజర్వేషన్లు కోల్పోవాల్సి వచ్చింది. కానీ, చంద్రబాబు ఈ తీర్పుతో కొత్త నాటకానికి తెరతీశారు. రిజర్వేషన్లను తగ్గించడానికి వీల్లేదని, దీనిపై సుప్రీంకోర్టుకు వెళ్లాలని బాబే ప్రభుత్వాన్ని డిమాండ్ చేసి తన ద్వంద్వ వైఖరిని చాటుకున్నారు.

రిజర్వేషన్లపై ఎప్పుడేం జరిగిందంటే..

2019 డిసెంబరు 28	2020 జనవరి 8:	2020 జనవరి 10:	2020 జనవరి 15:	2020 మార్చి 2 :
పంచాయతీరాజ్ ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మొత్తం 59.85 శాతం రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సీఎం జగన్ ప్రభుత్వం జీఓ 176 జారీ.	ప్రభుత్వం ప్రకటించిన మొత్తం 59.85 శాతం రిజర్వేషన్లకు అనుగుణంగా తక్షణమే ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర హైకోర్టు తీర్పు.	స్థానిక ఎన్నికల్లో మొత్తం రిజర్వేషన్లు 50 శాతం దాటాయంటూ సుప్రీంకోర్టులో కేసు వేసిన టీడీపీ నేత బిర్రు ప్రతాప్‌రెడ్డి	59.85 శాతం రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికల నిర్వహణకు సుప్రీంకోర్టు స్టే. రిజర్వేషన్లు 50 శాతం దాటడంపై హైకోర్టులోనే తిరిగి విచారణ జరిపి నిర్ణయం వెలువరించాలని ఆదేశం.	సుప్రీంకోర్టు సూచనతో తిరిగి హైకోర్టులో టీడీపీ నేత వేసిన కేసుపై స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు మొత్తం 50 శాతం దాటకూడదంటూ హైకోర్టు ఉత్తర్వులు.

66 డిప్యూటీ కలెక్టర్ పోస్టులపై కసరత్తు!

- 198 మంది తహసీల్దార్ల పేర్లతో అడ్‌హక్ ప్యానల్
- త్వరలో పదోన్నతుల కమిటీ సమావేశం

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన 66 డిప్యూటీ కలెక్టర్ పోస్టుల నియామకంపై రెవెన్యూ శాఖ కసరత్తు చేస్తోంది. తమ శాఖలకు డిప్యూటీ కలెక్టర్ క్యాడర్ అధికారులు కావాలని వివిధ శాఖలు కోరడం, కొత్తగా 24 రెవెన్యూ డివిజన్ కేంద్రాలు ఏర్పాటవడంతో వారి అవసరం పెరిగింది. ఈ నేపథ్యంలో నెల కిందట ప్రభుత్వం రెవెన్యూ శాఖలో 66 కొత్త డిప్యూటీ కలెక్టర్ పోస్టులను మంజూరు చేసింది. ప్రస్తుతం పనిచేస్తున్న తహసీల్దార్లకు పదోన్నతులు ఇవ్వడం ద్వారా ఈ పోస్టులను భర్తీ చేయనుంది. ఇందుకోసం 2022-23 సంవత్సరం అడ్‌హక్ ప్యానల్‌ను సిద్ధం చేశారు. ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున 198 మందితో ప్యానల్‌ను రెడీ చేసి పరిశీలిస్తున్నారు. అంటే ఒక్కో పోస్టుకు ముగ్గురు తహసీల్దార్ల పేర్లను పరిశీలిస్తూ వారి పని తీరు, వారిపై ఉన్న కేసులు, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకుంటున్నారు. ఇందుకు అవసరమైన సమాచారాన్ని ఇప్పటికే రెవెన్యూ శాఖ సేకరించింది. త్వరలో జరిగే డిపార్టుమెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) సమావేశంలో ఈ 198 మంది నుంచి 66 మందిని ఎంపిక చేయనున్నారు. డీపీసీ సమావేశం ఎప్పుడు జరుగుతుందా అని ప్యానల్‌లో ఉన్న అధికారులు ఎదురు చూస్తున్నారు. తహసీల్దార్ల పదోన్నతులు కావడంతో రెవెన్యూ శాఖ మొత్తంలో దీనిపై ఉత్కంఠ నెలకొంది.

'న్యాయం' కోసం గర్జించిన కర్నూలు

రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ప్రాంతం.. రాయలసీమ. రాజధాని కోసం కర్నూలును, శ్రీశైలం ప్రాజెక్టు కోసం 55 వేల ఎకరాల భూములను ఈ ప్రాంతం త్యాగం చేసింది. శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాజధాని కర్నూలులో ఉండాలి. కనీసం హైకోర్టునైనా కర్నూలులో పెట్టండని అడిగితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ముందుకొచ్చి హైకోర్టు ఏర్పాటుపై నిర్ణయం తీసుకున్నారు. చంద్రబాబు, కొన్ని ప్రతిపక్షాలు దాన్ని అడ్డుకుంటున్నాయి. ఏం చేస్తున్నార్రా అని మా పిల్లలను అడిగితే హైదరాబాద్‌లో ఉద్యోగం, బెంగళూరులో చదువు, చెన్నైలో శిక్షణ తీసుకుంటున్నామంటున్నారు. ఎన్నేళ్లయినా మా ప్రాంతం నుంచి ఇంకో ప్రాంతానికి వెళ్తే తప్ప బతకలేమా? వాటికి సమానంగా ఒక నగరాన్ని నిర్మించుకోలేమా? త్యాగాలకు కూడా ఒక హద్దు ఉంటుంది. ఇప్పుడు ఉద్యమాలు చేయాలి.. కచ్చితంగా హైకోర్టు ఏర్పాటు చేసుకోవాలి.

– రాయలసీమ గర్జనలో జేఏసీ నేతలు, ప్రజాప్రతినిధులు

▶ మొదటి పేజీ తరువాయి

దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు. 'రాయలసీమ గర్జన' పేరుతో పొలిటికల్, నాన్ పొలిటికల్ జేఏసీలు నగరంలోని ఎస్టీబీసీ మైదానంలో నిర్వహించిన భారీ బహిరంగసభ ప్రజలతో పోటెత్తింది. ఉదయం 10 గంటలకే 'సీమ' జిల్లాల నుంచి ప్రజలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు భారీగా తరలివచ్చారు. సభా ప్రాంగణం నిండిపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు రోడ్డు బయటే నిలుచుండిపోయారు. కర్నూలులోని అన్ని రహదారులు జనసంద్రమయ్యాయి. మధ్యాహ్నం 1.30 గంటల వరకూ సభ జరుగుతున్నంతసేపు 'న్యాయ రాజధాని' కావాలని నినాదాలు చేశారు. ఫ్లెక్సీలపై 'న్యాయ రాజధాని మా హక్కు' అని రాసి వాటిని బెలూన్లకు జత చేసి గాలిలోకి వదిలారు. ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. అందరి నోట 'న్యాయ రాజధాని' మాటే పలికింది. కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బీవై రామయ్య అధ్యక్షతన జరిగిన సభలో ప్రజాప్రతినిధులు, జేఏసీ నేతలు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎవరేమన్నారంటే..



కర్నూలులో రాయలసీమ గర్జనకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం

'న్యాయ రాజధాని' నిర్మించేది జగన్ ప్రభుత్వమే..

రాయలసీమకు న్యాయం చేసేది.. న్యాయ రాజధానిని నిర్మించేది జగన్ ప్రభుత్వం మాత్రమే. ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కువగా సీమ ముఖ్యమంత్రులే ఉన్నారు. చంద్రబాబు ఎక్కువ కాలం సీఎంగా పనిచేశారు. అయితే అందరూ హైదరాబాద్‌నే అభివృద్ధి చేశారు. మన రాష్ట్రంలో ఏ నగరాన్నీ అభివృద్ధి చేయలేదు. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మూడు ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలని వికేంద్రీకరణ తీసుకొచ్చారు. అమరావతిలో రాజధాని వద్దనలేదు. అక్కడ శాసన వ్యవహారాలు, విశాఖపట్నంలో పాలన రాజధాని ఉంటూనే కర్నూలులో న్యాయరాజధాని నిర్మించాలనుకున్నారు. ప్రజల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోకుండా చంద్రబాబు అమరావతిని రాజధాని చేయాలనుకున్నారు. అమరావతిపై కూడా ఆయనకు ప్రేమలేదు. ఆయన బంధు, అనుచరగణం రూ.వేల కోట్లు దోచుకునేందుకు మాత్రమే అక్కడ రాజధాని నిర్మించాలనుకున్నారు.

– పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గనులు, ఇంధన శాఖ మంత్రి

కర్నూలు జగన్నాథగట్టుపై హైకోర్టు..

ఎన్ని శక్తులు అడ్డుపడినా, చంద్రబాబులాంటోళ్లు ఎన్ని కుట్రలు చేసినా కర్నూలు జగన్నాథగట్టుపై హైకోర్టు నిర్మిస్తాం. కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయడం చంద్రబాబుకు ఇష్టం ఉందో.. లేదో చెప్పాలి. శతాబ్దాల నుంచి అనేక కరువు కాటకాలను 'సీమ' చవిచూసింది. విజయనగర సామ్రాజ్యంలో భరత ఖండంలోనే అత్యంత సంపన్న ప్రాంతంగా ఉన్న సీమ ఇలా తయారైంది. ఇన్ని దశాబ్దాల తర్వాత బాధ్యత గల వ్యక్తి సీమకు హైకోర్టు ఇస్తా అంటే ఎందుకు అడ్డుపడుతున్నారు. మూడు ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలని మా సీఎం తపన పడుతున్నారు. చంద్రబాబుకు కృష్ణా, గుంటూరుతో పాటు రాష్ట్రంలో ఏ ప్రాంతంపైనా ప్రేమ లేదు. చంద్రబాబుకు, ఆయన రియల్ ఎస్టేట్ బ్యాచ్‌కు ఉన్న ప్రేమ రాజధాని కోసం సేకరించిన 30 చదరపు కిలోమీటర్ల భూమిపైనే. శ్రీబాగ్ ఒప్పందం, ఆరు సూత్రాలు, 8 సూత్రాల ఒప్పందాలు కర్నూలుకు అనుకూలంగా ఉన్నాయి. శ్రీకృష్ణ, శివరామకృష్ణ కమిటీలు సైతం సమతుల్య అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలని చెప్పాయి.

– బుగ్గన రాజేంద్రనాథ్, ఆర్థిక శాఖ మంత్రి

26 జిల్లాల అభివృద్ధి సీఎం సంకల్పం

దశాబ్దాలుగా సీమ వాసులకు అన్యాయం జరుగుతోంది. చంద్రబాబు కర్నూలుకు వచ్చి ఇక్కడి టీడీపీ నేతలతో అమరావతికి అనుకూలంగా, సీమకు వ్యతిరేకంగా నినాదాలు చేయించి మన ప్రాంతాన్ని హేళన చేశారు. 29 గ్రామాల అభివృద్ధి చంద్రబాబు ఆలోచన కాగా 26 జిల్లాల అభివృద్ధి ముఖ్యమంత్రి సంకల్పం. – అంజాద్‌బాషా, డిప్యూటీ సీఎం

'సీమ'కు న్యాయం చేసింది నాడు వైఎస్సార్.. నేడు జగన్

ఎందరో ముఖ్యమంత్రులు రాష్ట్రాన్ని పాలించారు. సీమకు మేలు చేసింది ఇద్దరే. సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి వైఎస్సార్ కరువు పోగొడితే.. న్యాయ రాజధానిని నిర్మించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని జగన్ భావించారు.

– ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్

త్యాగానికి కూడా హద్దు ఉంటుంది..

1956లో అప్పటికి రాజధానిగా ఉన్న కర్నూలును త్యాగం చేశాం. అలాగే శ్రీశైలం ప్రాజెక్టుకు 80 వేల ఎకరాల భూములిచ్చాం. త్యాగానికి, ధర్మానికి కూడా హద్దుంటుంది. లేదంటే అన్యాయమవుతాం.

– కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, నంద్యాల జిల్లా

మాది త్యాగం కాదా?

రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం భూములిచ్చిన అమరావతి వాసులది త్యాగమైతే, శ్రీశైలం ప్రాజెక్టుకు భూములు ఇచ్చిన మనది త్యాగం కాదా? భూములు కోల్పోయినవారు ఇప్పటికీ 98 జీవో ప్రకారం ఉద్యోగాలు ఇవ్వాలని పోరాటం చేస్తున్నారు. చంద్రబాబు జీవో 69 తీసుకొచ్చి సీమ రైతులు, జీవో 120 తీసుకొచ్చి విద్యార్థుల పొట్ట కొట్టారు. 'అనంత'కు మంజూరైన ఎయిమ్స్‌ను మంగళగిరికి తరలించి మోసం చేశారు. – బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, శాప్ చైర్మన్

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం..

సీఎం జగన్ న్యాయ రాజధానికి సుముఖంగా ఉన్నారు. కానీ కొన్ని శక్తులు అడ్డుపడుతున్నాయి. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి వారిపై ఒత్తిడి తెస్తాం.

– విజయ్‌కుమార్‌రెడ్డి, జేఏసీ చైర్మన్

క్లుప్తంగా

జయహో బీసీ మహాసభకు మద్దతు

పోస్టర్ ఆవిష్కరించిన బీసీ సంఘం నేతలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మారేష్ తదితరులు

సాక్షి, అమరావతి: బీసీలే వెన్నెముక అనే నినాదంతో ఈ నెల 7న విజయవాడలో జరుగనున్న జయహో బీసీ మహాసభకు ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. విజయవాడలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో జయహో బీసీ మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మారేష్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు దాటుతున్నా దేశంలో బీసీ ముఖ్యమంత్రులుగా ఉన్న రాష్ట్రాల్లో సైతం బీసీలకు జరగని మేలు ఏపీలో సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలో జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలో మరే రాష్ట్రంలోనూ అమలు కావడం లేదని చెప్పారు. ఏపీలో బీసీల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా సీఎం వైఎస్ జగన్ అనేక కార్యక్రమాలను చేపడుతున్నారని కొనియాడారు. బడుగు బలహీనవర్గాలంతా జగన్‌కు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వేముల బేబీ రాణి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మోర్ల మహీధర్ తదితర బీసీ సంఘం నేతలు మాట్లాడారు.

నేనూ బీసీ ఇంటి కోడలినే..

పర్యాటక, క్రీడా శాఖ మంత్రి రోజా



మాట్లాడుతున్న మంత్రి ఆర్కేరోజా

నగరి(చిత్తూరు): నేనూ బీసీ ఇంటి కోడలినే అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. సోమవారం ఆమె నగరిలోని క్యాంపు కార్యాలయంలో జయహో బీసీ మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ బీసీలను వెనుకబడిన వారిగా కాకుండా, వారే రాష్ట్రానికి వెన్నెముక అని గుర్తించిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. విజయవాడలో నిర్వహించే జయహో బీసీ మహాసభను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఇప్పటివరకూ ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా 139 బీసీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లను ఏర్పాటు చేసి జగనన్న బీసీల పక్షపాతిగా నిరూపించుకున్నారని చెప్పారు. నామినేటెడ్ పదవులు, నామినేషన్ పనుల్లోనూ 50% రిజర్వేషన్లు కల్పించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. బీసీ వర్గాలు అంటే కేవలం ఓటు బ్యాంకుగా భావించి, ఎన్నికలప్పుడు మాత్రమే గుర్తు తెచ్చుకునే చంద్రబాబుకు ఈ సారి గట్టిగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

మారుమోగుతున్న జయహో బీసీ నినాదం

గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్

సాక్షి, అమరావతి: దేశచరిత్రలో ఎవరూ చేయలేని సామాజిక విప్లవాన్ని, జ్యోతిరావు పూలే ఆశయాలను నిజంచేసి చూపించిన సీఎం వైఎస్ జగన్ వెంటే బీసీలంతా నడుస్తున్నారని గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ చెప్పారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశచరిత్రలో 82 వేలమంది బీసీలను ప్రజాప్రతినిధులుగా తీర్చిదిద్దిన ఒకే ఒక్కడు సీఎం జగన్ అని తెలిపారు. జయహో బీసీ నినాదం రాష్ట్రమంతా మారుమోగుతోందని ఆయన చెప్పారు.

రేపే 'జయహో బీసీ' మహాసభ

విజయవాడలో ఏర్పాట్లను పరిశీలించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి, మంత్రులు

- గడిచిన మూడున్నరేళ్లలోనే బీసీలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ లబ్ధి
- బీసీల సంక్షేమం కోసం ఏడాదికి రూ.1.37 లక్షల కోట్లు మంజూరు
- జనాభాలో 50 శాతం మంది ఉన్న బీసీలకు 50 శాతం నామినేటెడ్ పదవులు
- బీసీలకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు వైఎస్సార్‌సీపీ సిద్ధం
- చంద్రబాబు హయాంలో బీసీల అభివృద్ధి శూన్యం
- బీసీల సమస్యలు తెలుసుకునేందుకే సభ నిర్వహణ
- ఎంపీ విజయసాయిరెడ్డి, మంత్రి బొత్స వెల్లడి



జయహో బీసీ మహాసభ కార్యక్రమ వివరాలను మీడియాకు తెలుపుతున్న విజయసాయిరెడ్డి. చిత్రంలో కృష్ణమూర్తి, కారుమూరి నాగేశ్వరరావు, బొత్స సత్యనారాయణ, బూడి ముత్యాలనాయుడు, వేణుగోపాలకృష్ణ తదితరులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: బీసీలు మరింత అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో వారి సమస్యలను తెలుసుకునేందుకే 'వెనుకబడిన కులాలే వెన్నెముక' అనే నినాదంతో 'జయహో బీసీ మహాసభ' కార్యక్రమాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బుధవారం భారీఎత్తున నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల ఇన్‌చార్జి, పార్లమెంటరీ పార్టీ నేత ఎంపీ విజయసాయిరెడ్డి తెలిపారు. ఈ నెల ఏడో తేదీన విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగే ఈ కార్యక్రమ ఏర్పాట్లను విజయసాయిరెడ్డితో పాటు మంత్రులు బొత్స సత్యనారాయణ, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, జంగా కృష్ణమూర్తి, లేళ్ల అప్పిరెడ్డి సోమవారం పరిశీలించారు. అనంతరం విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. 'జయహో బీసీ' నినాదం చంద్రబాబు సొత్తుకాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని.. జనాభాలో 50 శాతం ఉన్న ఆ వర్గాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గడచిన మూడున్నరేళ్లలో 50 శాతం నామినేటెడ్ పదవులు ఇచ్చి రాజకీయంగా, సంక్షేమం కింద రూ.1.37 లక్షల కోట్లను మంజూరు చేసి ఆర్థికంగా, విద్యా, ఉద్యోగ అవకాశాలు కల్పించి సామాజికంగా తలెత్తుకు తిరిగేలా చేసిందన్నారు. బీసీలు ముఖ్యమంత్రులుగా ఉన్న రాష్ట్రాల్లో కంటే ఏపీలో బీసీలు ఎక్కువ అభివృద్ధి సాధించడం సీఎం వైఎస్ జగన్ ఘనతగా విజయసాయిరెడ్డి అభివర్ణించారు.

రాష్ట్రవ్యాప్తంగా సభల నిర్వహణ

ఇక సామాజిక, ఆర్థిక, రాజకీయంగా బీసీలు అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతోనే 139 బీసీ కులాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఈ సభను నిర్వహిస్తామని ఆయన చెప్పారు. క్షేత్రస్థాయిలో బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సభ ద్వారా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సభ అనంతరం జోనల్, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో ఇదే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా సభలు నిర్వహిస్తామని విజయసాయిరెడ్డి వెల్లడించారు. అలాగే, రాబోయే రోజుల్లో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల మహాసభలను కూడా నిర్వహిస్తామన్నారు. మరోవైపు.. సభలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ టీకే రాణా, డీసీపీలు విశాల్ గున్ని, శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్‌కు ఎంపీ సూచించారు. ఈ సందర్భంగా భోజనశాల, వాహనాల పార్కింగ్, స్టేజ్, ప్రజలు వచ్చి వెళ్లే మార్గాలను ఎంపీ పరిశీలించారు.

చంద్రబాబు బీసీల ద్రోహి: బొత్స

బొత్స మాట్లాడుతూ.. బీసీలను ఓటు బ్యాంకుగానే వాడుకుని టీడీపీ రాజకీయ లబ్ధిపొందిందని మండిపడ్డారు. 14 ఏళ్ల తన పాలనలో చంద్రబాబు బీసీలను అణగదొక్కారన్నారు. ఆ కాలంలో బీసీ ఉపకులాలకు చెందిన వ్యక్తులకు మొక్కుబడిగా ఇస్త్రీ పెట్టెలు, మోకులు, కత్తెర్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. అదే ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీల మేరకు ఏడాదికి రూ.80 వేల కోట్లను బీసీల బ్యాంకు ఖాతాల్లో జమచేశారని గుర్తుచేశారు. టీడీపీలోని బీసీ నాయకులే చంద్రబాబును చూసి 'ఇదేం ఖర్మరా బాబూ!' అని అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

82 వేల మందికి ఆహ్వాన పత్రాలు

ఇక వార్డు మెంబర్లు, పంచాయతీ సర్పంచ్‌లు, పీఏసీఎస్ అధ్యక్షులు, సభ్యులు, ఇతర నామినేటెడ్ పదవుల్లో ఉన్న 82,432 మంది బీసీలకు జయహో బీసీ మహాసభ ఆహ్వాన పత్రాలను పంపించినట్లు విజయసాయిరెడ్డి చెప్పారు. సభకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఇక సభకు వచ్చే వారికోసం 24 రకాల వంటకాలను సిద్ధంచేయిస్తున్నట్లు విజయసాయిరెడ్డి వెల్లడించారు.



మహాసభ ఏర్పాట్లను విజయసాయిరెడ్డికి వివరిస్తున్న విజయవాడ సీపీ టీకే రాణా



బీసీ మహాసభకు ముస్తాబవుతున్న స్టేడియం

షెడ్యూల్ ఇదీ..

ఉదయం జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం అనంతరం 10 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభను ప్రారంభిస్తారని విజయసాయిరెడ్డి చెప్పారు. 10 నుంచి 12 గంటల వరకు బీసీ మంత్రులు, నాయకులు ప్రసంగిస్తారు. 12 నుంచి ఒంటి గంట వరకు సీఎం ప్రసంగిస్తారు.

వాయుగుండం కాదు.. వచ్చేది తుపానే

- నేడు వాయుగుండంగా అల్పపీడనం
- రేపటి నుంచి రాష్ట్రంలో వానలు

సాక్షి, విశాఖపట్నం/సాక్షి, అమరావతి: కొద్దిరోజులుగా బంగాళాఖాతంలో ఏర్పడుతుందనుకుంటున్న వాయుగుండం అంచనా తప్పి బలపడనుంది. తుపానుగా మారి తమిళనాడు–దక్షిణ కోస్తాంధ్ర వైపు పయనించనుంది. దీని ప్రభావం మన రాష్ట్రంపై కూడా పడనుంది. కాగా.. దక్షిణ అండమాన్ సముద్రం పరిసరాల్లో సోమవారం ఉదయం అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ మంగళవారం సాయంత్రానికి ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడనుంది. అదే దిశలో పయనిస్తూ తుపానుగా బలపడి నైరుతి బంగాళాఖాతంలోకి ప్రవేశించనుంది. ఈ నెల 8న ఉదయానికి ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి–దక్షిణ కోస్తాంధ్ర సమీపంలో తీరానికి చేరుతుందని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) సోమవారం తెలిపింది.

దక్షిణ కోస్తా.. రాయలసీమపై అధిక ప్రభావం

ఈ తుపాను ప్రభావం దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో ఎక్కువగానూ.. ఉత్తర కోస్తాలో స్వల్పంగానూ ఉంటుందని తెలిపింది. బుధవారం దక్షిణ కోస్తాలో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, నెల్లూరు జిల్లాలో అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది. గురువారం దక్షిణ కోస్తాలో పలుచోట్ల, ఉత్తర కోస్తాలో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయి. అదే రోజున ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. శుక్రవారం దక్షిణ కోస్తాలో అనేకచోట్ల, ఉత్తర కోస్తాలో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, నెల్లూరు, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో ఒకట్రెండు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవవచ్చని ఐఎండీ వివరించింది. వాయుగుండం, తుపాను ప్రభావంతో ఈ నెల 8, 9 తేదీల్లో కోస్తాలో తీరం వెంబడి గంటకు 40నుంచి 50 కిలోమీటర్లు, గరిష్టంగా 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దని విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం తెలిపింది.

దీని పేరు 'మాండూస్'

ఈ తుపానుకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) సూచించిన 'మాండూస్' అనే పేరు పెట్టనున్నారు. ఈ పేరును వాయుగుండం తుపానుగా మారిన తర్వాత అధికారికంగా ప్రకటించనున్నారు.

15న మరో అల్పపీడనం

ఈ నెల 15వ తేదీన అండమాన్ సముద్రం లేదా దక్షిణ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశముంది. దీని ప్రభావం 20వ తేదీ వరకు ఉండే అవకాశం ఉంది. ఏపీ తీరంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటంతో అల్పపీడనాలు ఏపీ తీరంవైపు కదలడం లేదని అంచనా వేస్తున్నారు.

'స్కిల్' అక్రమాలపై చంద్రబాబు నోరు మెదపరేం..?: బీజేపీ ప్రశ్న

సాక్షి, అమరావతి: తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో జరిగిన వందల కోట్ల స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అవకతవకలపై ఈడీ విచారణ జరుగుతుంటే చంద్రబాబు ఎందుకు స్పందించడం లేదని బీజేపీ ప్రశ్నించింది. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర శాఖ అధికార ట్విట్టర్ ఖాతాలో ట్వీట్‌ను పోస్టు చేసింది. అవినీతిపై మాట్లాడే హక్కు టీడీపీ, వైఎస్సార్‌సీపీలకు లేదని ట్వీట్‌లో పేర్కొంది.

ఆ 'స్కిల్' ఎవరిది?

- చంద్రబాబు హయాంలో 'స్కిల్' కుంభకోణంపై ఈడీ విచారణ షురూ
- షెల్ కంపెనీల ప్రతినిధులను విచారించిన ఈడీ
- విచారణకు హాజరుకాని చంద్రబాబు సన్నిహితులు
- నిధులు ఇక్కడి నుంచి సింగపూర్‌కు, అక్కడి నుంచి తిరిగి ఏ ఖాతాలకు వచ్చాయో దర్యాప్తు

సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వ హయాంలో జరిగిన 'ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ)' కుంభకోణంలో సూత్రధారులెవరన్న విషయంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) లోతుగా విచారణ మొదలు పెట్టింది. ఈ కేసులో నిందితులైన అప్పటి సీఎం చంద్రబాబుకు సన్నిహితులు, ఆ కుంభకోణంతో ప్రమేయమున్న షెల్ కంపెనీల ప్రతినిధులకు ఈడీ ఇప్పటికే నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో నకిలీ ఇన్వాయిస్‌లతో ఏపీఎస్ఎస్‌డీసీ నిధులు రూ. 241 కోట్లు కొల్లగొట్టడంలో కీలకంగా వ్యవహరించిన షెల్ కంపెనీల ప్రతినిధులను ఈడీ అధికారులు హైదరాబాద్‌లో సోమవారం విచారించారు. సీమెన్స్ కంపెనీ డిజైన్‌టెక్, స్కిల్లర్ తదితర షెల్ కంపెనీల ప్రతినిధులను అధికారులు వివిధ కోణాల్లో విచారించినట్టు తెలిసింది. అసలు ప్రాజెక్టు మొదలు పెట్టకుండానే సీమెన్స్ కంపెనీ పేరిట నిధులు విడుదల చేయడం, వాటిని కొన్ని షెల్ కంపెనీల బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించి సింగపూర్‌లోని మరో కంపెనీకి తరలించడంపై లోతుగా ప్రశ్నించినట్టు సమాచారం. సింగపూర్ కంపెనీ నుంచి భారత్‌లో ఎవరి ఖాతాకు నిధులు బదిలీ చేశారనే గుట్టును ఛేదించేందుకు ఈడీ అధికారులు ప్రాధాన్యమిచ్చినట్టు తెలుస్తోంది. నిధులు ఏఏ ఖాతాల్లోంచి సింగపూర్‌కు వెళ్లాయి, తిరిగి దేశంలోని ఏ ఖాతాలకు తిరిగి వచ్చాయన్న విషయంపై విచారణలో ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. ఈ కుంభకోణంలో పాత్రధారులైన అప్పటి ఎండీ లక్ష్మీనారాయణ, ప్రత్యేక కార్యదర్శి గంటా సుబ్బారావు, ఓఎస్డీ నిమ్మగడ్డ వెంకటకృష్ణప్రసాద్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ కె.ప్రతాప్‌కుమార్ తదితరులు ఈడీ విచారణకు హాజరుకాలేదు.

నూతన వైద్య కళాశాలల నిర్మాణానికి సహకరించండి

- కేంద్ర మంత్రి మాండవీయను కోరిన ఏపీ వైద్య, ఆరోగ్య మంత్రి రజిని
- సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి



మాండవీయకు వినతిపత్రం ఇస్తున్న మంత్రి రజిని

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా నిర్మిస్తున్న మెడికల్ కళాశాలలకు కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా కావాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ మాన్సూక్ మాండవీయను కోరారు. న్యూఢిల్లీలో బుధవారం కేంద్ర మంత్రితో భేటీ అయ్యి ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ పాడేరు, మచిలీపట్నం, పిడుగురాళ్లలో మెడికల్ కళాశాలల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులొచ్చాయని, నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ప్రతి జిల్లాలోనూ కనీసం ఒక ప్రభుత్వ మెడికల్ కళాశాల ఉండేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని, ఇప్పటికే అన్ని చోట్లా మెడికల్ కళాశాలల నిర్మాణం ప్రారంభమైందన్నారు. రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న 17 మెడికల్ కళాశాలలకు కేంద్ర ప్రభుత్వ సహకారం కావాలని, తగిన ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. వైద్య ఆరోగ్య రంగంలో ఏపీలో కీలకమైన మార్పులు తీసుకొస్తున్నట్టు చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానాన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్నామని తెలిపారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల గురించి కేంద్ర మంత్రికి రజిని వివరించారు. ఎక్కడా కనీవినీ ఎరుగని రీతిలో ఏకంగా 46 వేల నియామకాలను ఒక్క వైద్య, ఆరోగ్య రంగంలోనే సీఎం జగన్ చేపట్టారని వివరించారు. ఏకంగా రూ.16 వేల కోట్లకు పైగా నిధులతో రాష్ట్రంలోని ఆస్పత్రుల స్వరూపాన్ని పూర్తిగా మార్చేస్తున్నారని వివరించారు. ఇదిలా ఉండగా, మంత్రి రజిని వినతిపై కేంద్రమంత్రి మాండవీయ సానుకూలంగా స్పందించారు. ఆంధ్రప్రదేశ్‌లో వైద్య ఆరోగ్య రంగంలో తీసుకొస్తున్న మార్పులు తమ దృష్టిలోనూ ఉన్నాయన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నాలకు తమ వంతు సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఏపీలో వైద్య కళాశాలల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని చెప్పారు.

'స్కిల్' స్కామ్‌లో బాబు, లోకేశ్

- వారిద్దరి స్పష్టమైన పాత్రను ఈడీ గుర్తించింది: సజ్జల
- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు పూర్తిగా అవాస్తవం
- కింది స్థాయిలో కమ్యూనికేషన్ గ్యాప్‌పై సీఎం సీరియస్
- రాయలసీమ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించిన గర్జన



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో మాజీ సీఎం చంద్రబాబు, మాజీ మంత్రి లోకేష్ పాత్ర స్పష్టంగా కనిపిస్తోందని ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు), వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి వెల్లడించారు. వారి నిర్వాకాలను కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఇప్పటికే గుర్తించిందన్నారు. ఈడీ తన పని తాను చేసుకుపోతుందన్నారు. ఈ వ్యవహారంలో తమ ప్రమేయం ఏమీ లేదన్నారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రూ.241 కోట్ల స్కిల్ డెవలప్‌మెంట్ నిధులను షెల్ కంపెనీలకు మళ్లించి కాజేశారని, చంద్రబాబు, లోకేష్ పాత్ర లేకుండా అంత భారీ ఎత్తున నిధులను మళ్లించడం సాధ్యం కాదన్నారు. ఈ కుంభకోణంలో వారి ప్రమేయం బట్టబయలు కావడం వల్లే కిక్కురుమనడం లేదని వ్యాఖ్యానించారు. మార్గదర్శి చిట్‌ఫండ్ కుంభకోణంపై ఈనాడు రామోజీరావు ఇచ్చిన ప్రకటనపై విస్మయం వ్యక్తం చేశారు. తాము చట్టానికి అతీతం అన్నట్లుగా ఆ ప్రకటన ఉందన్నారు.

కర్నూలు గర్జన గ్రాండ్ సక్సెస్..

కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు చేయాలని ఆకాంక్షిస్తూ జేఏసీ నిర్వహించిన రాయలసీమ గర్జన గ్రాండ్ సక్సెస్ అయ్యిందని సజ్జల తెలిపారు. రాయలసీమ ప్రజల ఆకాంక్షలను గర్జన ప్రతిబింబించిందన్నారు. కర్నూలు ప్రజలు అమరావతినే రాజధానిగా కోరుకుంటున్నారని చంద్రబాబు వ్యాఖ్యానించడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు.

సీమ ద్రోహి చంద్రబాబే..

రాయలసీమలో ఒక్క ప్రాజెక్టు కూడా చేపట్టని చంద్రబాబు ఎల్లోమీడియా ద్వారా ప్రభుత్వంపై బురద చల్లుతున్నారని ధ్వజమెత్తారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం పెంచి గాలేరునగరి, హంద్రీనీవాలను చేపట్టి దివంగత వైఎస్సార్ రాయలసీమకు మేలుచేస్తే ఇప్పుడు హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యాన్ని మరింతపెంచి, కాలువలను వెడల్పుచేసి శ్రీశైలానికి వరద వచ్చే 30 నుంచి 40 రోజుల్లోనే రాయలసీమ ప్రాజెక్టులను నింపేలా సీఎం జగన్ పనులు చేపట్టారని గుర్తు చేశారు. శ్రీశైలంలో 854 అడుగుల కంటే దిగువన నీటిమట్టం ఉన్నా రాయలసీమకు కృష్ణాజలాలను తరలించేలా ఎత్తిపోతల చేపట్టామన్నారు. చిత్రావతిలో 10 టీఎంసీలు, గండికోటలో 27, బ్రహ్మంసాగర్‌లో 15 టీఎంసీలు నిల్వ ఉన్నాయని చెప్పారు. రాయలసీమలో కొత్తగా 5 మెడికల్ కాలేజీలను, కర్నూలు, కడపలో క్యాన్సర్ ఆస్పత్రులను నెలకొల్పుతున్నామని, ఈ స్థాయిలో సీమకు గతంలో ఎవరూ మేలు చేయలేదన్నారు. చివరకు కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను కూడా చంద్రబాబు పూర్తిచేయలేదన్నారు. ఇప్పుడు సీఎం జగన్ దాన్ని పూర్తి చేసి ఆ ప్రాంతానికి నీళ్లందించేలా చర్యలు చేపట్టారన్నారు. చంద్రబాబు రాయలసీమకు మేలు చేయకపోగా ప్రాజెక్టులపై ఎన్జీటీలో కేసులు వేయించి ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. పోలవరం పనుల్లో జాప్యానికి చంద్రబాబు పాపాలే కారణమని చెప్పారు. కమీషన్ల కోసం పోలవరాన్ని బాబు ఏటీఎం మాదిరిగా మార్చుకున్నారని ప్రధాని మోదీనే వెల్లడించారని గుర్తుచేశారు. వైఎస్సార్ ప్రారంభించిన పోలవరాన్ని సీఎం జగన్ పూర్తి చేసి జాతికి అంకితం చేస్తారన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు అవాస్తవం

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగిస్తున్నారనడం పూర్తిగా అవాస్తవమని, ఆ వార్త చూసి తాము కూడా ఆశ్చర్యానికి గురయ్యామని సజ్జల ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సమాచారం లోపం వల్ల కింది స్థాయిలో ఎవరో ఇలా చేశారని, ఈ అంశంపై సీఎం జగన్ సీరియస్ అయ్యారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక గతంలో ఎన్నడూ లేనిరీతిలో రెండు లక్షలకుపైగా ఉద్యోగాలిచ్చి భారీ ఎత్తున ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ఇప్పుడు పోలీసు రిక్రూట్‌మెంట్ కూడా జరుగుతోందన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి భద్రత చేకూర్చామన్నారు.



అన్నిట్లోనూ గొప్పదాహం కళాదాహం.
ఏ ఉద్దేశ్యమూ లేని గొప్పకళ ఇచ్చే విశాలత్వం.
జ్ఞానం, ఏ సందేశమూ, ఏ ప్రచారమూ ఇవ్వలేవు.
– చలం

సాక్షి

మంగళవారం, డిసెంబర్, 6

మన నిర్లక్ష్యానికి మూల్యమెంత?

కొన్ని సంఘటనలు అంతే... పెనునిద్దర నుంచి పెద్ద మేలుకొలుపుగా పనిచేస్తాయి. దేశ రాజధాని ఢిల్లీలోని అఖిల భారత వైద్యవిజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)లోని సర్వర్లపై జరిగిన సైబర్‌దాడి అలాంటిదే. నవంబర్ 23న ఆగంతకులు భారీమొత్తం డిమాండ్ చేస్తూ జరిపిన రాన్సమ్‌వేర్ దాడితో కుప్పకూలిన సర్వర్లు పన్నెండు రోజులైనా ఇప్పటికీ బాగు కాలేదు. దేశంలోని అత్యంత ప్రతిష్ఠాత్మక ఆరోగ్యరక్షణ సంస్థలోని ఈ ఘటన మన దేశ సైబర్ భద్రతా మార్గదర్శకాలను సమగ్రంగా పునః సమీక్షించుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది. డిజిటల్ ఇండియా పేరిట అన్ని రకాల ప్రభుత్వ విధులనూ, ప్రజా సేవలనూ, నగదు చెల్లింపులనూ ఆన్‌లైన్‌లో జరపాలని ప్రోత్సహిస్తున్నవేళ అత్యవసరం వచ్చిపడింది. సైబర్ దాడులు అంటువ్యాధిలా వ్యాపించి, ఎయిమ్స్ ఘటన లాంటివి మరిన్ని జరగక ముందే సురక్షిత వ్యవస్థనూ, ఆపత్సమయంలో సమాచారాన్ని వెనక్కి రప్పించే పద్ధతులనూ సృష్టించుకోవడం తక్షణ కర్తవ్యమని తెలిసివచ్చింది.

వీవీఐపీలు సహా లక్షలాది రోగుల వైద్య రికార్డుల సమాచారం గాలికి పోయిన ఎయిమ్స్ ఘటన దేశంలోనే అతి పెద్ద సైబర్ దాడి. ఒక భారతీయ సంస్థపై ఇంత తీవ్రమైన దాడి మునుపెన్నడూ జరగలేదు అని దేశ తొలి సైబర్ సెక్యూరిటీ హెడ్ మాట. డిసెంబర్ 1న జలశక్తి శాఖ ట్విట్టర్ ఖాతా హ్యాకింగ్‌కు గురైంది. ఇటీవల ఓ ప్రభుత్వ శాఖపై జరిగిన రెండో పెద్ద సైబర్ దాడి ఇది. నవంబర్‌లో ఢిల్లీలోనే సఫ్దర్‌జంగ్ హాస్పిటల్‌పైనా సైబర్ దాడి జరిగింది. నిజానికి, ఆరోగ్య రంగంపై సైబర్ దాడుల్లో ప్రపంచంలోనే రెండో స్థానంలో భారత్ ఉందని సైబర్ భద్రతా నిఘా సంస్థ క్లౌడ్‌సెక్ లెక్క. ఒక్క 2021లోనే దేశంలోని సైబర్ దాడుల్లో 7.7 శాతం ఆరోగ్య రంగంపై జరిగినవే.

గత మూడేళ్ళలో భారత్‌లో సైబర్ దాడులు 3 రెట్లు పెరిగాయి. సైబర్ ముప్పును ఎదుర్కోవడానికి ఉద్దేశించిన ప్రధాన సంస్థ 'ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్' (సీఈఆర్టీ–ఇన్) డేటా ప్రకారం 2019లో జరిగిన ఉల్లంఘనలు 3.94 లక్షల చిల్లర. 2020లో అది 11.58 లక్షల పైకి, 2021లో 14.02 లక్షలకూ ఎగబాకింది. ఈ ఏడాదిలో జూన్ నాటికే 6.74 లక్షలయ్యాయి. వెరసి మూడున్నరేళ్ళలో 30 లక్షలకు పైగా కేసులొచ్చాయి. కానీ, సైబర్ భద్రతా నిధుల వినియోగం అరకొరగా సాగింది. రూ. 213 కోట్లు మంజూరైతే, రూ. 98.31 కోట్లే ఖర్చు పెట్టడం నిర్లక్ష్యానికి నిలువుటద్దం. అంతకన్నా దారుణం ఎయిమ్స్‌లో 30–40 ఏళ్ళుగా కంప్యూటర్లు, సాఫ్ట్‌వేర్లను మార్చక పోవడం. ఈ ఇక్ష్వాకుల కాలపు సామగ్రి పట్ల ఆందోళన వ్యక్తమైనా పట్టించుకున్న నాథుడు లేడు. పైగా ఐటీ ఓనమాలు తెలీని డాక్టర్ గారే ఇప్పటికీ అక్కడ కంప్యూటర్ విభాగాధిపతి అంటే ఏమనాలి!

2004లో తొలి డిజిటల్ దాడి రికార్డయిన నాటి నుంచి ఇప్పటి దాకా సైబర్ నేరాలు అంతకంతకూ పెరుగుతూ వస్తున్నాయి. విస్తరించిన ఇంటర్నెట్‌కు విపరిణామం – ప్రపంచవ్యాప్త సైబర్ భద్రతా ఉల్లంఘనలు. నిజానికి, ప్రపంచంలో అత్యధికంగా డేటా చౌర్యం జరుగుతున్న దేశాల్లో భారత్‌ది 6వ స్థానం. ప్రతి వంద మంది భారతీయుల్లో 18 మంది డేటా చోరీ అయిందని నెదర్లాండ్స్ సంస్థ సర్ఫ్‌షార్క్ మాట. మన పార్లమెంటరీ స్థాయీ సంఘం సైతం ఈ ఏటి నివేదికలో పొంచివున్న ప్రమాదాలను ఎదుర్కోవడానికి మన దేశ సామర్థ్యాన్ని పెంచుకోవడం తప్పనిసరి అంది. ప్రభుత్వాలు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నాయన్నది ప్రశ్న. సైబర్ ముప్పుపై తగిన నియంత్రణ వ్యవస్థకు ఎలక్ట్రానిక్స్–ఐటీ శాఖ కింద 'సైబర్ భద్రతా విభాగా'న్ని కేంద్రం నెలకొల్పింది. అది ఎంత సమర్థంగా పనిచేస్తోందో తెలీదు. ఎయిమ్స్ సంక్షోభ పరిష్కారానికి కేంద్రం ఎన్ఐఏ, డీఆర్‌డీఓ, గూఢచారి విభాగం, సీబీఐ నిపుణులను బరిలోకి దింపాల్సి వచ్చింది.

రక్తం చిందని ఈ అభౌతిక, ఆధునిక యుద్ధంతో ఉక్రెయిన్ – ఆస్ట్రేలియాల్లో పవర్ గ్రిడ్లు, నిరుడు మన దేశంలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్, ఇరాన్‌లో అణు సదుపాయాలు, జార్జియాలో టెలికామ్ సేవలు, వివిధ దేశాల్లో ఎయిర్‌లైన్స్, ప్రభుత్వ సేవలకు తీవ్ర విఘాతం కలిగింది. అవన్నీ వాటి పొరుగు శత్రుదేశాల పనే. ఇక, మేధాసంపత్తి హక్కులు, వ్యక్తిగత డేటా చౌర్యాలు లెక్కలేనన్ని. ఐటీ సిస్టమ్స్‌పై దాడితో డేటాను ఎన్‌క్రిప్ట్ చేసేసి, సమాచారాన్ని తిరిగి అందుబాటులో ఉంచాలంటే డబ్బులివ్వాలని డిమాండ్ చేసే రాన్సమ్‌వేర్ దాడులు ప్రధానంగా మున్సిపల్, ఆరోగ్య సంరక్షణ, బ్యాంకులు సహా ఆర్థిక సేవలపై విరుచుకుపడుతున్నాయి. ఇవాళ మన బ్యాంక్ సేవల నుంచి టోల్‌గేట్ల వద్ద ఫాస్టాగ్‌లు, పాస్‌పోర్ట్ సమాచారం, పౌర విమాన యానం దాకా అంతా డిజిటలే! స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా అంటున్న పాలకులు డిజిటల్ ఆర్థిక వ్యవస్థతో పాటు పెరిగే సైబర్ ముప్పుపై దృష్టి పెట్టకుంటే ప్రాథమిక వసతులకూ పెను ప్రమాదమే!

వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకొనే సమగ్ర సైబర్ భద్రతా విధానం కావాలి. ఘటన జరిగాక హడావిడి కాక ముందుగానే వాటిని నివారించేందుకు సీఈఆర్టీ–ఇన్ ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలను సంసిద్ధం చేయాలి. డిజిటల్ సేవలు కావాల్సిందే గనక సమాచార నిల్వ, ఆపత్కాలంలో తిరిగి తీసుకొనేలా సమర్థ విధానాలు పెట్టుకోవాలి. ఎప్పటికప్పుడు ఆధునికీకరించాలి. సైబర్ రక్షణ రంగానికి నిధులిచ్చి, అత్యాధునిక కృత్రిమ మేధ, మిషన్ లెర్నింగ్ (ఎంఎల్) పరిష్కారాలతో సత్తా సమకూర్చుకోవాలి. అప్పుడే డిజిటల్ ప్రపంచం సురక్షితమవుతుంది. ఈ కృషిలో నూతన ఆవిష్కరణలం దేలా ఉత్ప్రేరణ కలిగించాల్సింది విధాన రూపకర్తలే. అప్పుడే డిజిటల్ ఇండియా విజయం సాధ్యం!

సామాజిక బందీల విముక్తి ప్రదాత!

సందర్భం



డా॥ కత్తి పద్మారావు

ప్రపంచంలోని వివిధ సమాజాలు తమకు నచ్చిన తాత్త్విక మార్గాల్లో ప్రయాణిస్తూ మనుగడ సాగించడం అనాదిగా వస్తున్నదే. అయితే కొన్ని సమాజాల్లో అనేక సమూహాలు తమ ఇష్టానికి వ్యతిరేకంగా బందీలై కనీస మానవ హక్కులకూ దూరమయ్యాయి. భారతీయ సమాజంలోని అస్పృశ్యులూ, ఆదివాసులూ, మహిళలూ, ఇతర అణగారిన సమూహాల వారు అటువంటి వారిలో కొందరు. తత్త్వశాస్త్రానికి మూల జీవం మానవ దుఃఖ నివారణ. ఇందుకోసం బుద్ధుడు, సోక్రటీస్, మార్క్స్ వంటి వారు ఎంతగానో ప్రయత్నించారు. ఇటువంటి తాత్త్వికులను అధ్యయనం చేసి అంబేడ్కర్ తన ఉపన్యాసాలు, రచనల ద్వారా పీడిత, తాడిత జనుల ఉద్ధరణకు ప్రయత్నించారు. ఆయన ఫిలాసఫీ భారత రాజ్యాంగంలో స్పష్టంగా కనిపిస్తుంది.

అంబేడ్కర్ ప్రాసంగికత నానాటికీ పెరుగుతుందనడానికి నవంబర్ 26వ తేది రాజ్యాంగ అవతరణ దినోత్సవం భారతదేశ వ్యాప్తంగా జరగడం వల్ల మనకు అర్థమౌతోంది. అంబేడ్కర్ సిద్ధాంతాలు ప్రపంచ తాత్త్వికులకు సమతుల్యమైనవి, తులనాత్మకమైనవి కూడా. అంబేడ్కర్ రచనా వైవిధ్యంలో సోక్రటీస్, ప్లేటో, బుద్ధుడు, అరిస్టాటిల్ ఉన్నారు. 'జ్ఞానవంతుడైనవాడు తాను తెలుసుకున్నది ఇతరులకు చెప్పకపోతే మూర్ఖుడవుతాడు' అనే సత్యాన్ని సోక్రటీస్ చెప్పాడు. అందుకు రాజ్యానికి, దేశానికి భయపడని నిర్భీతి తత్త్వాన్ని ఆయన ప్రదర్శించాడు. అదే తత్త్వం అంబేడ్కర్‌లో మనకు కనిపిస్తుంది. అందుకు సత్యాన్వేషణ, ధీశక్తి, శాస్త్రీయ దృక్పథం, హేతుబద్ధత అవసరం. వాటిని సోక్రటీస్ స్థాయిలో ఆధునిక యుగంలో వ్యక్తీకరించిన వాడు అంబేడ్కర్. ఆయన ముఖ్యంగా వేదాలకూ, స్మృతులకూ ప్రత్యామ్నాయంగా భారత రాజ్యాంగ దర్శనాన్ని రూపొందించాడు. అందుకు బుద్ధుని తత్త్వం ఆయనకు వాహిక. ఆయన సమాజంలో మానవతా స్ఫూర్తిని నింపడానికి ప్రయత్నం చేశాడు. అందుకు కారణం ఆయన హృదయ భావం, ఆయన చాలా సున్నిత హృదయుడు. ఆయన సున్నితత్వంలో కరుణ వుంది, ప్రేమ వుంది, ఆత్మీయత వుంది. అంకిత భావం వుంది. ఈ గుణాలు నాయకుణ్ణి ప్రవక్తగా తీర్చిదిద్దాయి. అందుకే ఆయన అణగారిన ప్రజల తరఫున మాట్లాడాడు.

ఈ దేశంలో కోట్లాదిమంది ప్రజలు అస్పృశ్యత అనే శాపంతో క్రుంగిపోయారు. ప్రపంచంలో మరెక్కడా కనిపించని ఉపద్రవం ఇది. ప్రతి మానవుడికీ ఉండవలసిన ప్రాథమిక హక్కులు వారికి తిరస్కరించబడ్డాయి. నాగరికత, సంస్కృతి ఫలాల లబ్ధిని వారికి అందనివ్వలేదు. అస్పృశ్యులే కాకుండా ఈ దేశంలో అంతే పెద్ద సంఖ్యలో ఆదిమ జాతులు, గిరిజన తెగలు ఉన్నాయి. నాగరిక, సాంస్కృతిక స్రవంతిలోకి తీసుకు వచ్చే ప్రయత్నం చేయకుండా వారిని ఆటవిక, సంచార జాతులలా తిరిగేలా వదిలి పెట్టారు కులీనులు. ఈ పరిస్థితిని మార్చడానికి ఆయన తన వాదాన్ని తాత్త్వికంగా మలిచాడు. కుల నిర్మూలనా వాదాన్ని ఇలా ప్రతిపాదించాడు.

''కుల వ్యవస్థను సమర్థించడానికి వారసత్వం గురించీ, నరసంతతి శుద్ధి శాస్త్రం గురించీ చెత్తవాదన ఎంతో లేవనెత్తబడింది. నరవంశ శుద్ధిశాస్త్రం (యూజెనిక్స్) ప్రాథమిక సూత్రానికి కుల వ్యవస్థ అనుగుణంగా ఉంటే దానికి ఎవ్వరూ అభ్యంతరం చెప్పరు. ఎందుకంటే స్త్రీ పురుషులను వివేకంతో జత కలపడం ద్వారా జాతి అభివృద్ధిని సాధించడానికి ఎవరూ అభ్యంతరం చెప్పరు. అయితే వివేకవంతమైన స్త్రీ, పురుష సంయోగాన్ని కుల వ్యవస్థ ఏ విధంగా సాధిస్తున్నదో అర్థం కావడం లేదు. కుల వ్యవస్థ ప్రకృతి విరుద్ధమైన ఒక కృత్రిమ వ్యవస్థ. అది చేస్తున్నదల్లా వివిధ కులాల స్త్రీ పురుషులు కులాంతర వివాహాలను చేసుకోకుండా నిషేధించడం. ప్రకృతి సిద్ధమైనది కాదది, ఒక కులంలో ఏ ఇద్దరు కలసి వివాహం చేసుకోవాలని



ఉన్నదో నిర్ణయించే పద్ధతి కాదది. జాతి శుద్ధి శాస్త్రం దృష్ట్యా ఒక కులమే ఒక ప్రత్యేక మూల జాతి అయితే... ఉపకులాల పుట్టుక కూడా అదే విధంగా అయి వుండాలి. అయితే ఉప కులాల మూలం కూడా యూజినిక్సే అని నిజంగా ఎవరైనా వాదించగలరా? అలాంటి వాదన పూర్తిగా అసంగతం.''

ఇకపోతే ఈ కులనిర్మూలన సిద్ధాంత ఆచరణకు మహాత్మాగాంధీ రాజకీయంగా మతవాద ధోరణితో అడ్డు వచ్చారు. అంబేడ్కర్ సాంఘికంగా కుల నిర్మూలనా వాది. ఆర్థికంగా స్టేట్ సోషలిజం ప్రతిపాదకుడు. రాజకీయంగా బహుజన రాజ్య నిర్మాణ దక్షుడు. ఈ మూడింటినీ సాధించడానికి ఆయన బుద్ధునిలో సంఘ వాదాన్నీ, మహాత్మా పూలేలోని సాంస్కృతిక విప్లవ వాదాన్నీ పోరాట ఆయుధాలుగా మలచుకున్నాడు. అందువల్ల ఆయన కుల నిర్మూలనా పునాదులపై పునర్నిర్మించే తత్త్వశాస్త్ర నిర్మాతగా ముందుకొచ్చాడు. జ్యోతిబా పూలే స్త్రీల కోసం చేసిన ఉద్యమం అంబేడ్కర్‌ను ఎంతగానో ప్రభావితం చేసింది. స్త్రీని విముక్తి చేయడం భారత పునరుజ్జీవనోద్యమంలో ప్రధానాంశంగా ఆయన భావించాడు. హిందూ సంస్కరణవాదులు ప్రతిపాదించే పద్ధతిలో విధవా వివాహాలు, సతీసహగమన నిర్మూలన వంటి సంస్కరణల వలే కాక స్త్రీల హక్కులకు సంబంధించిన అంశం మీద ఆయన ఎక్కు పెట్టాడు. స్త్రీని భావ దాస్యం నుండి విముక్తి చేయడం, సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ భాగస్వామ్యాన్ని పురుషులతో సమానంగా స్త్రీలకు కల్గించడానికి ఆయన తీవ్రమైన కృషి చేశాడు. అంబేడ్కర్ తనకు ముందున్న భారతీయ పాశ్చాత్య తత్త్వశాస్త్రాలన్నింటినీ చదివి భారత దేశ పునర్నిర్మాణానికి పూనుకున్నాడు.

అంబేడ్కర్‌లోని మరొక కోణం సామాజిక వ్యక్తిత్వ మనో విశ్లేషణ. ఈ ప్రత్యేకతను ప్లేటోలోని రచనా వైవిధ్యం, జ్ఞానతృష్ణ, సంభాషణా ప్రావీణ్యత, అంతరాంతర పరిశీలనల నుండి ఆయన సంతరించుకున్నారు. తత్త్వశాస్త్రానికి మూల జీవమైన మానవ దుఃఖ నివారణ పట్ల సోక్రటీస్ ఎంత వేదన పడ్డాడో, అంబేడ్కరూ అంత వేదన పడ్డాడు. వ్యక్తిగతమైన దుఃఖాన్ని అధిగమించి, సామాజిక దుఃఖాన్ని గుర్తించి, దాని నివారణ కోసం సిద్ధాంతపరంగా, ఆచరణ పరంగా కృషి చేసినవారు సోక్రటీస్, అంబేడ్కర్‌లు. ఎంత క్లిష్టతరమైన పరిస్థితులు వచ్చినా వారు సత్య నిరూపణ కోసం ముందడుగు వేస్తారు.

ఇకపోతే అంబేడ్కర్ విద్యా తాత్త్విక వాది. ఆయన తన ప్రతిభా సంపత్తితో అస్పృశ్యుల గురించి అనేక కమిషన్‌లకు వివరాలు అందించి అనేక హక్కులు సాధించాడు. ఏ పాఠశాల అయితే తనకు ప్రవేశాన్ని నిరాకరించిందో తనను తరగతి గదిలో బయట కూర్చోబెట్టి, బైట పాఠాలు చెప్పిందో, అదే భారతంలో తన ప్రజలను విద్యావంతులను చేయడానికి... అన్ని ప్రభుత్వ పాఠశాలల ద్వారాలు తెరిపించ గలిగాడు. ఆయన ఒక్కడుగా ఒక సైన్యంగా పని చేశాడు.

అంబేడ్కర్‌కు అధ్యయనంతో పాటు లోతైన అవగాహన, అనుభవం, ఆచరణ వున్నాయి. అందుకే ఆయన మాటలు సత్య నిష్టం అయ్యాయి. బుద్ధుని ధార్మిక సూత్రాలను, నీతి సూత్రాలను అంబేడ్కర్ రాజ్యాంగంలో అవసరం అయిన చోటంతా పొందుపరుస్తూ వెళ్ళాడు. ఈనాడు అంబేడ్కర్ రాజ్యాంగానికి ప్రత్యామ్నాయ వాదాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఇటీవల నవంబర్ 26న భారత రాజ్యాంగ దినోత్సవం అనే పేరు మీద భారత చరిత్ర పరిశోధనా మండలి (ఐసీహెచ్ఆర్) హిందూ పునరుద్ధరణవాద పత్రాన్ని రాష్ట్రాల గవర్నర్లకు, విశ్వవిద్యాలయాలకు పంపింది. అంటే అంబేడ్కర్ రాజ్యాంగ నిర్మాణ సూత్రాలను దెబ్బతీయాలనే ప్రయత్నం జరుగుతోందన్న మాట!

రాజ్యాంగం పీఠికలో చెప్పబడిన సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని దెబ్బతీయాలనే ఒక పెద్ద ప్రయత్నం జరుగుతోంది. ఈ ప్రయత్నం బౌద్ధ యుగాన్ని దెబ్బతీయడానికి కౌంటర్ రివల్యూషన్‌గా వచ్చిన గుప్తుల కాలం నాటి మతోద్ధరణ వాదం లాగా వుంది. అంబేడ్కర్ రాజ్యాంగానికి ప్రత్యామ్నాయ వాదాన్ని ప్రచారం చేయాలనే పెద్ద ప్రయత్నం జరుగుతోంది. అయితే రాజ్యాంగంలోని సామాజిక సామ్యవాద భావాన్ని దెబ్బతీయలేరనేది కూడా మరో ప్రక్క రుజువవుతూ వస్తోంది. మతం ఎప్పుడూ తత్త్వశాస్త్రానికి ప్రత్యామ్నాయం కాలేదు. మతం కొందరికే పరిమితమైంది. రాజ్యాంగం అందరిని సమన్వయీకరించుకుంటుంది. ఆ శక్తి దానికుంది. ప్రపంచ తాత్త్విక దృక్పథం నుంచి ఏర్పడింది రాజ్యాంగం.

అంబేడ్కర్‌వాదులు, మార్క్సువాదులు, లౌకికవాదులు, ప్రజాస్వామ్యవాదులు ఐక్యంగా అంబేడ్కర్ నిర్మించిన రాజ్యాంగ సౌధాన్ని తప్పక కాపాడుకుంటారు. ఈ యుగం అంబేడ్కర్‌ది. ఆయన నిర్మించిన తాత్త్విక సామాజిక మార్గంలో నడుద్దాం.

వ్యాసకర్త దళిత ఉద్యమ నాయకులు
మొబైల్: 98497 41695

(నేడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఏం మారదా?



ప్రాథమిక నివేదికలు వస్తున్నాయి – గుజరాత్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చు. కాంగ్రెస్ తన ఓటుబ్యాంకులో కొంతైనా యథాతథంగా నిలుపుకోగలుగుతుంది. తుది ఫలితాల కోసం వేచిచూడాలి.

– పల్లవీ ఘోష్, జర్నలిస్ట్

మరిచిపోయారా?



మనం 93,000 మంది పాకిస్తానీ యుద్ధఖైదీలకు రెండేళ్లకు పైగా తిండి పెట్టాం. బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్, టీ, స్నాక్స్...రెండేళ్లపాటు! దాన్ని మనం ఎప్పుడూ చెప్పుకోం. కానీ అభినందన్ గురించి వాళ్లు మాట్లాడుతూనే ఉంటారు. ఒక్క అభినందన్ = 93,000 పాకిస్తానీలు. ఒక్కొక్కరికి ఒక్కో స్థాయి ఉంటుంది.

– మేజర్ గౌరవ్ ఆర్య, మాజీ సైనికాధికారి

అక్కర్లేనిది



టిక్‌టాక్ అనేది కేవలం గూఢచార యాప్ మాత్రమే కాదు. అది చైనా కమ్యూనిస్ట్ పార్టీకి చెందిన ప్రచార సాధనం కూడా. దాన్ని యూఎస్‌ఏలో అనుమతించడానికి ఏ కారణమూ లేదు.

– మైక్ పాంపియో, అమెరికా మాజీ విదేశాంగ మంత్రి

కూలిపోతుంది



యూరప్ ఇప్పుడు నీళ్ల కుండలోని కప్పలా ఉంది. యూరోపియన్లు అతి త్వరలో గుర్రాల బగ్గీల్లో ప్రయాణాలు చేయనున్నారు. వెచ్చదనం కోసం కలపను కాల్చుతారు. ఉడకబెట్టిన దుంపలు (ఒకవేళ అదృష్టం ఉంటే) తిననున్నారు. ఘోరమైన నాయకత్వం.

– అభిజిత్ చావ్డా, హోస్ట్

ఏది మానవ హక్కు?



కొన్ని మత విశ్వాసాలు స్త్రీలు, స్వలింగ సంపర్కుల పట్ల ద్వేషాన్ని చూపుతూ, పూర్తి వివక్షతో కూడి ఉంటాయి. దుర్బలుల పట్ల వివక్షకు స్వేచ్ఛ ఉండటం అనేది మానవ హక్కు కానేరదు. అన్ని రకాల వివక్ష నుంచి స్వేచ్ఛ అనేది మానవ హక్కు అవుతుంది.

– ఖదీజా ఖాన్, కామెంటేటర్

సీమంతైనా నిజముందా?

ప్రాజెక్టులకు నిధులు ఇవ్వడం లేదని ఈనాడు దుష్ప్రచారం

- రాయలసీమ కరువు నివారణ పథకం ప్రాజెక్టులపై ఎన్జీటీలో కేసులు వేయించిన చంద్రబాబు
- సైంధవుడిలా అడ్డు పడుతూ ప్రభుత్వంపై బురద చల్లే దుస్సాహసం
- నాడు పోతిరెడ్డిపాడుకు సైతం బాబు అడ్డుపుల్లలు
- ముంపు గ్రామాలను ముంచేసైనా సరే కట్టి తీరాలనే తరహాలో ఎల్లో మీడియా కథనాలు

నాడు: కడలిలో కలుస్తున్న కృష్ణా జలాలను రాయలసీమకు తరలించి సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో దివంగత వైఎస్సార్ 2006లో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 11 వేల నుంచి 44 వేల క్యూసెక్కులకు పెంపు పనులను చేపడితే చంద్రబాబు ధర్నాలకు దిగి ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టారు. జలయజ్ఞానికి విఘ్నాలు కల్పించే రాక్షసమూకకే 'ఈనాడు' బాకాలూదింది.

నేడు: శ్రీశైలానికి వరద వచ్చే 30 - 40 రోజుల్లోనే కృష్ణా వరద జలాలను తరలించి రాయలసీమ ప్రాజెక్టులను నింపేలా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం 80 వేల క్యూసెక్కులకు పెంపు, కాలువల ప్రవాహ సామర్థ్యాన్ని పెంచడంతోపాటు కొత్త ప్రాజెక్టులను సీఎం జగన్ చేపట్టారు. రాయలసీమ కరువు నివారణ పథకం కింద చేపట్టిన ఈ ప్రాజెక్టులపై చంద్రబాబు ఎన్జీటీలో కేసులు వేయించి సైంధవుడిలా అడ్డుపడుతుంటే రామోజీ వంతపాడుతున్నారు.

సాక్షి, అమరావతి: రాయలసీమలో ఏ ప్రాజెక్టు చూసినా నిండుకుండను తలపిస్తోంది. భూగర్భ జలమట్టం పెరగడంతో ఎండిన బోర్లకూ జలకళ వచ్చింది. ఎన్నడూ లేని రీతిలో భారీ ఎత్తున రైతులు పంటలు సాగు చేస్తుండటంతో కూలీలకు సమృద్ధిగా పని దొరుకుతోంది. రైతులు, కూలీలు సంతోషంగా ఉంటే కొందరికి మాత్రం రుచించడం లేదు. న్యాయ రాజధాని కర్నూలులో ఏర్పాటైతే రాయలసీమ సమగ్రాభివృద్ధి చెందుతుందనే ఆకాంక్షతో గర్జన సభ నిర్వహిస్తున్న రోజు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు 'సీమంతైనా మేలు చేశారా' అనే శీర్షికతో 'ఈనాడు' అబద్ధాలను కుమ్మరించింది. పేజీలకు పేజీలు అచ్చేసినా అందులో చీమంతైనా నిజం లేదు! రాయలసీమ కరువు నివారణ పథకం(ఆర్‌డీఎంపీ) కింద రూ.43,336 కోట్లతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 33 ప్రాజెక్టులను చేపట్టి నిధుల సమీకరణకు స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు చేశారు. అవి పూర్తైతే టీడీపీకి పుట్టగతులు ఉండవనే భయంతో చంద్రబాబు అడ్డుకునే కుట్రలకు వ్యూహం రచించారు.

సీమ ఎత్తిపోతలకు బ్రేక్ వేసిన ఎన్జీటీ

ఈనాడు: పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 80 టీఎంసీలను తరలించే ఉద్దేశంతో చేపట్టిన రాయలసీమ ఎత్తిపోతల పథకం పడకేసింది.



వాస్తవం: శ్రీశైలంలో నీటి మట్టం 854 అడుగుల కంటే దిగువన ఉన్నా సాగు, తాగునీటి కష్టాలను కడతేర్చేందుకు రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని సీఎం జగన్ చేపట్టారు. దీనిపై తెలంగాణ సర్కార్ ఎన్జీటీలో కేసు వేయడంతో పర్యావరణ అనుమతి పొందాకే పనులు చేపట్టాలని నిర్దేశించింది. ఈ నేపథ్యంలో పర్యావరణ అనుమతి కోసం ఇప్పటికే కేంద్ర అటవీ, పర్యావరణ శాఖకు ఏపీ ప్రభుత్వం దరఖాస్తు చేసింది. యుద్ధప్రాతిపదికన పర్యావరణ అనుమతి సాధించి ఎన్జీటీ అనుమతితో ఎత్తిపోతలను పూర్తి చేయడానికి సిద్ధమైంది.

నిండుకుండల్లా ప్రాజెక్టులు..

ఈనాడు: బ్రహ్మంసాగర్ ఎత్తిపోతల, కుందూనదిపై జోలదరాశి, రాజోలి రిజర్వాయర్ల నిర్మాణం నిలిచిపోయాయి. బిల్లులు చెల్లించకపోవడం వల్ల అవుకు రెండో సొరంగం పనులు ఆగిపోయాయి.

వాస్తవం: గాలేరు–నగరి వరద కాలువ ప్రవాహ సామర్థ్యం 20 వేల క్యూసెక్కులు. ఈ కాలువలో అంతర్భాగమైన అవుకు వద్ద రెండు టన్నెళ్లు తవ్వాలి. ఇందులో ఎడమ సొరంగంలో మిగిలిన 45 మీటర్లను తవ్వలేక నాడు టీడీపీ సర్కార్ తాత్కాలికంగా లూప్ వేసింది. కుడి టన్నెల్ 162 మీటర్లలో ఫాల్ట్ జోన్(పెలుసు పొరలు)లో పనులు చేయలేక చేతులెత్తేసింది. ఆ పనులను అత్యాధునిక సాంకేతిక పరి/జ్ఞానంతో సీఎం జగన్ ప్రభుత్వం చేపట్టింది. మరో రెండు మూడు నెలల్లో ఈ టన్నెల్ పూర్తవుతుంది. అప్పుడు 20 వేల క్యూసెక్కులను వరద కాలువ ద్వారా తరలించవచ్చు. గండికోట నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పునరావాసం కల్పించి గరిష్ఠంగా 26.85 టీఎంసీలను నిల్వ చేస్తున్నారు. పూర్తి స్థాయిలో పునరావాసం ద్వారా చిత్రావతిలో గరిష్ఠంగా 10 టీఎంసీలను నిల్వ చేస్తున్నారు. ఖరీఫ్ పూర్తయింది. రబీ ఆరంభంలో రాయలసీమలో ఏ ప్రాజెక్టును చూసినా నిండుకుండను తలపించడం కానరావడం లేదా?

అవార్డు నోటిఫై చేయలేదని తెలియదా?

ఈనాడు: ఆర్డీఎస్ కుడి కాలువ పనులు ఆగిపోయాయి. భూసేకరణ ఇబ్బందులతో ప్రాజెక్టు పనులు ముందుకు కదలడంలేదు.

వాస్తవం: ఆర్డీఎస్ కుడి కాలువకు బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ 4 టీఎంసీలు కేటాయించింది. ట్రిబ్యునల్ అవార్డును కేంద్ర జల్ శక్తి శాఖ నోటిఫై చేసే వరకూ పనులు ఆపేయాలని కృష్ణా బోర్డు ఆదేశించింది. ట్రిబ్యునల్ అవార్డును నోటిఫై చేయగానే రూ.1,985 కోట్లతో ఆర్డీఎస్ కుడి కాలువను పూర్తి చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కర్నూలు జిల్లాలో ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు నియోజక వర్గాల్లో 45 వేల ఎకరాలకు నీళ్లందించనుంది.

సమస్యలను అధిగమిస్తూ ముందుకు..

ఈనాడు: భూసేకరణలో జాప్యం, కాంట్రాక్టర్‌కు రూ.వంద కోట్లు బిల్లులు చెల్లించకపోవడం వల్ల వేదవతి ఎత్తిపోతల ఆగిపోయింది.

వాస్తవం: వేదవతి ఎత్తిపోతల పథకంలో భూసేకరణ సమస్యలను అధిగమించి రూ.1,942 కోట్లతో పూర్తి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆదోని, ఆలూరు నియోజకవర్గాల పరిధిలో 80 వేల ఎకరాలను వేదవతి ఎత్తిపోతలతో సస్యశ్యామలం చేసే పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టింది.

కమీషన్లతో ప్రజాధనం మట్టిపాలు

ఈనాడు: కర్నూలు పశ్చిమ ప్రాంతంలో హంద్రీ–నీవా నీటితో 68 చెరువులు నింపే పనులను చేపట్టి 52 శాతం పనులను టీడీపీ సర్కారే పూర్తి చేసింది. మూడున్నరేళ్లలో 24 శాతం పనులే పూర్తయ్యాయి.

వాస్తవం: టీడీపీ హయాంలో కమీషన్లు అధికంగా వచ్చే మట్టి తవ్వకం పనులకే ప్రాధాన్యం ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంప్‌హౌస్‌లతోపాటు కాంక్రీట్ పనులను చేపట్టింది. మిగతా 33 శాతం పనులను 2023 మార్చి నాటికి పూర్తి చేసే దిశగా వేగవంతం చేసింది. 2023 ఖరీఫ్‌కు నీళ్లందించే దిశగా ఇప్పటికే ట్రయల్ రన్ నిర్వహించింది. ఇది తెలుసుకోకుండా తప్పుడు కథనాలు రాస్తే ఎలా?

అక్రమాలను సరిదిద్దడం వల్లే జాప్యం

ఈనాడు: జీడిపల్లి–పేరూరు(అప్పర్ పెన్నార్) పథకంలో మూడు రిజర్వాయర్ల నిర్మాణం శిలాఫలకాలకే పరిమితమైంది. రూ.240 కోట్లతో చేపట్టాల్సిన మడకశిర బైపాస్ కెనాల్‌ను అటకెక్కించేశారు.

వాస్తవం: అప్పర్ పెన్నార్ ప్రాజెక్టులో చంద్రబాబు భారీ అక్రమాలకు పాల్పడ్డారు. వాటిని సరిదిద్ది ప్రాజెక్టును సమూలంగా ప్రక్షాళన చేయడం వల్లే జాప్యం చోటుచేసుకుంది. కొత్త డిజైన్ మేరకు పనులు చేపట్టి నిర్దేశిత గడువులోగా పూర్తి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రూ.240 కోట్లతో మడకశిర బైపాస్ కెనాల్ నిర్మాణ పనులకు టెండర్లు పిలిచింది. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి.

ఏడీబీ నిధులివ్వట్లేదని ఏడుపు రాతలు

ఈనాడు: రాష్ట్ర ప్రభుత్వం 11 శాతం వాటా చెల్లించేందుకు సమ్మతిపత్రం ఇవ్వకపోవడం వల్లే రూ.513 కోట్ల ఏడీబీ నిధులతో చేపట్టిన కేసీ కెనాల్ సింప్ పథకం వెనక్కి వెళ్లిపోయింది.

వాస్తవం: ఏడీబీ ఆర్థిక సహకారంతో కేసీ కెనాల్ ఆధునికీకరణ పనులను ప్రభుత్వం చేపట్టింది. ఏడీబీ రుణానికి కేంద్ర జల్ శక్తి శాఖ ఆమోదం అవసరం. ఆ తరువాత ఏడీబీతో రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకుంటుంది. ఈ ప్రక్రియ సజావుగా సాగుతోంది. నాలుగు దశలలో నిధులను ఏడీబీ సర్దుబాటు చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం 11 శాతం వాటా నిధులను ఇచ్చేందుకు సమ్మతిపత్రం ఇవ్వకపోవడం వల్ల ప్రాజెక్టు వెనక్కివెళ్లిపోయిందని మీరేమైనా కలగన్నారా రామోజీ?

గుండ్రేవులపై గట్టిగా పోరాటం

ఈనాడు: కేసీ కెనాల్ ఆయకట్టు స్థిరీకరణతోపాటు మరో రెండు లక్షల ఎకరాలకు అదనంగా నీళ్లందించేందుకు రూ.5,400 కోట్లతో గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణానికి ప్రభుత్వానికి డీపీఆర్‌ను పంపారు. కానీ.. ఆ ప్రాజెక్టును పక్కన పెట్టేశారు.

వాస్తవం: తుంగభద్రపై నిర్మించే గుండ్రేవుల రిజర్వాయర్‌తో కర్నూలు జిల్లాలో కొంత, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో కొంత భూమి, గ్రామాలు ముంపునకు గురవుతాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి కర్ణాటక, తెలంగాణను ఒప్పించేందుకు దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ మండలి సమావేశాల్లో ప్రభుత్వం చేసిన పోరాటం కనపడలేదా? కర్ణాటక, తెలంగాణలో ముంపు గ్రామాల ప్రజలను ముంచేసైనా గుండ్రేవుల కట్టాలా రామోజీ?

ఇవేం పనులు?

ఈనాడు: సాగునీటి కోసం రైతులు ధర్నాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. పనుల్లేక రైతు కూలీలు వలస బాట పట్టాల్సి వస్తోంది.

వాస్తవం: బ్రహ్మంసాగర్ మట్టికట్టలో నిర్మాణ లోపాల వల్ల లీకేజీలు ఏర్పడటంతో నాలుగైదు టీఎంసీలను కూడా నిల్వ చేయలేని దుస్థితి. 2014 నుంచి 2019 వరకూ అధికారంలో ఉన్న చంద్రబాబు బ్రహ్మంసాగర్‌కు మరమ్మతులు చేసిన పాపాన పోలేదు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక డయాఫ్రమ్‌వాల్ నిర్మించి లీకేజీలకు అడ్డుకట్ట వేశారు. ప్రాజెక్టులో 17.74 టీఎంసీలకుగానూ 15.11 టీఎంసీలను నిల్వ చేస్తున్నారు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి: శు.త్రయోదశి ఉ.6.42 వరకు, తదుపరి చతుర్దశి, నక్షత్రం: భరణి ఉ.9.14 వరకు, తదుపరి కృత్తిక, వర్జ్యం: రా.9.44 నుండి 11.25 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.31 నుండి 9.15 వరకు, తదుపరి రా.10.31 నుండి 11.23 వరకు, అమృతఘడియలు: లేవు : రాహుకాలం : ప. 3.00 నుంచి 4.30 వరకు : యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు : సూర్యోదయం 6.20 : సూర్యాస్తమయం 5.21.

దక్షిణ భారత అజ్మీర్..కడప అమీన్‌పీర్ దర్గా

- 7న గంధం, 8న ఉరుసు
- 12వ తేదీ వరకు ఉత్సవాలు



విద్యుత్ దీప కాంతుల మధ్య కడప పెద్ద దర్గా (ఫైల్)

కడప కల్చరల్: ఇస్లాం సూఫీ తత్వాన్ని బోధిస్తూ కులమతాలకు అతీతంగా ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనను పెంచుతూ మానవత్వానికే పెద్దపీట వేస్తున్న కడప అమీన్‌పీర్ దర్గాకు విశిష్టమైన పేరుంది. దీన్ని దక్షిణ భారత అజ్మీర్‌గా కూడా కొనియాడుతారు. ఈ దర్గా ప్రధాన ఉరుసు ఉత్సవాలు ఈనెల 7, 8 తేదీలలో నిర్వహిస్తారు. 12వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయి.

చరిత్ర.. 16వ శతాబ్దంలో కర్ణాటకలోని బీదర్ ప్రాంతం నుంచి మహా ప్రవక్త (సా.అ.వ) వంశీయులైన ఖ్వాజాయే ఖాజుగా నాయబె రసూల్ అతాయే రసూలుల్లాహ్ హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా పీరుల్లామాలిక్ సాహెబ్ తన సతీమణి, కుమారులు హజరత్ ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్, హజరత్ అహ్మద్ హుసేనీ సాహెబ్‌తోపాటు భక్తగణంతో ఈ ప్రాంతానికి వచ్చారు. ఆధ్యాత్మిక బోధనలతో అందరినీ ఆకట్టుకున్నారు. నాటి నవాబులు వీరి మహిమలను గమనించి ప్రియ భక్తులు అయ్యారు. వారి కోరిక మేరకు గురువులు కడప నగరంలో స్థిరపడ్డారు.

జీవసమాధి.. హజరత్ పీరుల్లా మాలిక్ సాహెబ్ పట్ల ఈర్ష్యతో స్థానికుల్లో కొందరు సవాలు విసిరారు. దాని ప్రకారం ఆయన జీవ సమాధి అయి మూడవరోజున దర్శనం ఇవ్వడంతో శత్రువులు సైతం ప్రియమైన భక్తులుగా మారారు. కాగా, హజరత్ అమీనుల్లా హుసేనీ సాహెబ్ 10వ పీఠాధిపతిగా వ్యవహరించారు. ఆయన పేరుతోనే దర్గాను అమీన్‌పీర్ సాహెబ్ దర్గాగా పేర్కొనేవారు. కాలక్రమంలో అది అమీన్‌పీర్ దర్గాగా మారింది. ప్రస్తుతం దర్గా 11వ పీఠాధిపతి హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ నిర్వహణలో ఉంది. దర్గాలో మొత్తం గురువులు, వారి వారసుల పేరిట ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం యేటా మొత్తం 11 చిన్న ఉరుసులు, గంధం ఉత్సవాలు నిర్వహిస్తారు. ప్రస్తుతం పెద్ద ఉరుసును వారం రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, పలు ఇస్లామిక్ దేశాల నుంచి కూడా ఈ ఉరుసుకు హాజరవుతారు.

6 బెంగళూరు నుంచి విజయవాడ గంటల్లోనే..

రూ.19,200 కోట్లతో 342 కి.మీ. ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం

- భూ సేకరణ దాదాపు పూర్తి చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- 10 ప్యాకేజీలుగా టెండర్ల ప్రక్రియ చేపట్టిన ఎన్‌హెచ్‌ఏఐ
- 4 ప్యాకేజీలకు టెండర్ల ప్రకటన
- రాయలసీమ మీదుగా బెంగళూరుతో విజయవాడకు అనుసంధానం
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం
- 2025కు రహదారి నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యం



ప్రస్తుతం..: కర్ణాటక రాజధాని బెంగళూరు – విజయవాడ మధ్య రోడ్డు మార్గం దూరం 560 కిలోమీటర్లు. ప్రయాణ సమయం దాదాపు 12 గంటలు. అదీ నేరుగా లేదు. వ్యయప్రయాసలతో కూడుకొన్నది. విజయవాడ నుంచి రాయలసీమకు వెళ్లడానికీ సరైన దారి లేదు.

మూడేళ్ల తర్వాత : బెంగళూరు నుంచి విజయవాడకు రోడ్డు మార్గం దూరం 342 కిలోమీటర్లు. ప్రయాణ సమయం 6 గంటలే. పైగా, విజయవాడ నుంచి రాయలసీమలోని అనేక ప్రాంతాలకు సౌకర్యవంతమైన రోడ్డు మార్గం. ప్రయాణ సమయం, ఖర్చు కూడా తక్కువ.

సాక్షి, అమరావతి

భారత్‌మాల ప్రాజెక్టులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన బెంగళూరు – విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేతో ఈ కల సాకారమవుతుంది. రూ.19,200 కోట్లతో ఆరు లేన్లుగా 342 కిలోమీటర్ల ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మించనున్నారు. ఇప్పటికే ఈ హైవేకి భూసేకరణ ప్రక్రియను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాదాపుగా పూర్తి చేసింది. దాంతో 10 ప్యాకేజీలుగా టెండర్లు పిలిచి, పనులు అప్పగించే చర్యలను జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) వేగవంతం చేసింది. నాలుగు ప్యాకేజీలకు టెండర్లు పిలిచింది. 2025 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలన్నది లక్ష్యం.

ప్రస్తుతం రాయలసీమ ప్రాంతానికి విజయవాడతో నేరుగా రహదారి లేదు. కర్ణాటకకు కూడా అనుసంధానం సరిగా లేదు. ఈ రెండు ప్రయోజనాలను సాధించాలన్న ద్విముఖ వ్యూహంతో రాష్ట్రంలో మొట్టమొదటి గ్రీన్‌ఫీల్డ్ హైవేగా బెంగళూరు – విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపాదించారు. సీఎం జగన్ సమర్పించిన ప్రతిపాదనలను కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదించారు. ప్రస్తుతం బెంగళూరు – విజయవాడ మధ్య దూరభారాన్ని దాదాపు సగానికి తగ్గించేలా రూట్‌మ్యాప్ రూపొందించారు. ఈ హైవే నిర్మాణం పూర్తయితే ఆరు గంటల్లోనే బెంగళూరు చేరుకోవచ్చు. సరుకు రవాణా కూడా మరింతగా పెరుగుతుంది.

ఇదీ రూట్.. కర్ణాటక రాజధాని బెంగళూరు శివారు నుంచి ఈ హైవే ప్రారంభమవుతుంది. మన రాష్ట్రంలో పుట్టపర్తి జిల్లాలోని కందికొండ, వైఎస్సార్ జిల్లాలోని పులివెందుల, నెల్లూరు జిల్లా మల్లెపల్లి, వంగపాడు, ప్రకాశం జిల్లా అద్దంకి మీదుగా మేదరమెట్ల వరకు వస్తుంది. అక్కడ జాతీయ రహదారి–16కు అనుసంధానిస్తారు. ఇది నేరుగా విజయవాడను కలుపుతుంది.

కేంద్రం పరిశీలనలో జంగాలను ఎస్సీల్లో చేర్చే అంశం

- రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన జేసీ శర్మ కమిటీ నివేదిక అందాల్సి ఉంది
- అది అందిన తరువాత తగిన నిర్ణయం తీసుకునే అవకాశం
- హైకోర్టుకు నివేదించిన డీఎస్‌జీ
- విచారణ జనవరి 4కి వాయిదా

సాక్షి, అమరావతి: బేడ, బుడగ జంగాలను ఎస్సీల జాబితాలో చేర్చే అంశం కేంద్రప్రభుత్వ పరిశీలనలో ఉందని కేంద్ర ప్రభుత్వం తరఫున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ) ఎన్.హరినాథ్ సోమవారం హైకోర్టుకు నివేదించారు. బేడ, బుడగ జంగాలను ఎస్సీల్లో చేర్చే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంత ఐఏఎస్ అధికారి జేసీ శర్మ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేసిందని, ఈ కమిటీ నివేదిక కేంద్రానికి అందాల్సి ఉందని తెలిపారు. నిర్దిష్ట విధివిధానాలు పూర్తయిన తరువాత ఈ వ్యవహారంలో కేంద్రం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని చెప్పారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు.. దశాబ్దకాలానికిపైగా ఈ వివాదానికి సంబంధించిన వ్యాజ్యాలు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో వీటిపై తుది విచారణ జరుపుతామని చెప్పింది. తుది విచారణను జనవరి 4కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డి.వి.ఎస్.ఎస్.సోమయాజుల ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. బేడ, బుడగ జంగాలను ఎస్సీలుగా పరిగణించకపోవడాన్ని, వారికి గతంలో ఇచ్చిన కులధ్రువీకరణ పత్రాలను రద్దుచేయడాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో 2008 నుంచి పలు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో.. ప్రస్తుత ఏపీలోని బేడ, బుడగ జంగాలను ఎస్సీలుగా పరిగణించారని, ఆ మేరకు సర్టిఫికెట్లు కూడా ఇచ్చారని పిటిషనర్లు తమ వ్యాజ్యాల్లో పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తరువాత ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా బేడ, బుడగ జంగాలు కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే ఉన్నారని, ఏపీలో వారు లేరంటూ వారిని ఎస్సీలుగా పరిగణించేందుకు కేంద్రం నిరాకరించింది. ఈ నేపథ్యంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ వ్యవహారంపై అధ్యయనం చేసేందుకు 2019లో విశ్రాంత ఐఏఎస్ అధికారి జేసీ శర్మ అధ్యక్షతన ఏకసభ్య కమిషన్‌ను నియమించింది. ఈ కమిటీ ఆంధ్రప్రదేశ్‌లో సైతం బేడ, బుడగ జంగాలు ఉన్నారంటూ నివేదిక ఇచ్చింది. గతంలో దాఖలు చేసిన వ్యాజ్యాలు తాజాగా సోమవారం సీజే ధర్మాసనం ముందు విచారణకు వచ్చాయి. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తరఫున డీఎస్‌జీ హరినాథ్ స్పందిస్తూ.. బేడ, బుడగ జంగాలను ఎస్సీల్లో చేర్చే అంశం కేంద్రం పరిశీలనలో ఉందని చెప్పారు. జేసీ శర్మ కమిటీ నివేదిక కేంద్రానికి అందాల్సి ఉందని తెలిపారు. ఈ వ్యాజ్యాలపై తుది విచారణ జరుపుతామంటూ ధర్మాసనం విచారణను జనవరి 4కి వాయిదా వేసింది.

అమరావతి ఉద్యమానికి కాలం చెల్లినట్లే..

- 799వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు



రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: రాయలసీమ గర్జనతో అమరావతి ఉద్యమం బంగాళాఖాతంలో కలిసిపోవడం ఖాయమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే దీక్షలు సోమవారం నాటికి 799వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కులవాదులు, చంద్రబాబూ.. ఆయన బినామీ పెట్టుబడిదారులు మినహా అమరావతి ఏకైక రాజధాని కావాలని ఏ ఒక్కరూ కోరుకోవడం లేదని చెప్పారు. ప్రాంతాల మధ్యవిభేదాలు సృష్టించి లబ్ధి పొందాలని బాబు వేసిన ఎత్తుగడలు పారకపోవడంతో ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని ప్రజలను రెచ్చగొట్టేందుకు నానా తంటాలు పడుతున్నాడని విమర్శించారు. అభివృద్ధే అజెండాగా కొనసాగుతున్న జగనన్న పాలనలో గత ప్రభుత్వం చేసిన తప్పులను ఎత్తిచూపి తిరిగి పునరావృతం కాకుండా సరిచేస్తుండడాన్ని ఓర్వలేక బాబు అండ్ కో విషప్రచారానికి తెరలేపిందన్నారు. వ్యవస్థలను అడ్డుపెట్టుకుని ప్రజలను మోసం చేయాలని చూసిన చంద్రబాబుకు ప్రజలు ఓటు హక్కుతో తగిన బుద్ధి చెప్పినా తీరు మారలేదని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పుతో రాష్ట్రంలో మూడు రాజధానుల ఏర్పాటుకు మార్గం సుగమం అవడం ఖాయమన్నారు.

9న సాయుధ దళాల పతాక దినోత్సవం

సాక్షి, అమరావతి: సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని ఈ నెల 9న విజయవాడలోని రాజ్‌భవన్‌లో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా యుద్ధ వీరులు, అమరవీరుల కుటుంబాలను గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ సత్కరించనున్నారు. ఈ జాబితాలో 2021–22లో దేశసేవలో భర్తలను కోల్పోయిన నలుగురు వీర నారీమణులు, ఇద్దరు యుద్ధ వికలాంగ సైనికులు, ఒక గాలంటరీ అవార్డు గ్రహీత, రెండో ప్రపంచ యుద్ధ సైనికుడు, సైనిక దళాల కుటుంబాల కోసం అత్యధిక విరాళాలు సేకరించిన ఇద్దరు జిల్లా కలెక్టర్లు, ఒక జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఉన్నారు. మరో పది మందికి గవర్నర్ ప్రశంసా పత్రాలు ప్రదానం చేయనున్నారు.

రాహుకేతు పూజల్లో బ్రెజిల్ దేశస్తులు



శ్రీకాళహస్తి(తిరుపతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి బ్రెజిల్ దేశస్తులు 22 మంది యువతీ, యువకులు సోమవారం విచ్చేశారు. రూ.500 టికెట్ తీసుకుని రాహుకేతు పూజలు చేయించుకున్నారు. గతంలో తమ దేశానికి చెందిన వారు ఇక్కడ రాహుకేతు పూజలు చేయించుకున్నారని, వారికి మంచి జరగడంతోనే తాము వచ్చామని తెలిపారు. ఆలయంలో శిల్పకళ అద్భుతంగా ఉందన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో 14 క్యూ కంపార్ట్‌మెంట్లు నిండాయి. టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనానికి 24 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 2 గంటల సమయం పడుతోంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 80,001 మంది శ్రీవారిని దర్శించుకోగా 32,967 మంది తలనీలాలు ఇచ్చారు. స్వామికి హుండీ కానుకల రూపంలో భక్తులు రూ.4.07 కోట్లు సమర్పించారు.

రైతు సంక్షేమమే లక్ష్యం: ఉమ్మారెడ్డి

గుంటూరు రూరల్: రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. గుంటూరు లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న అగ్రిటెక్ 2022 ఆధునిక సాంకేతిక వ్యవసాయ సదస్సు ముగింపు కార్యక్రమంలో సోమవారం ఆయ న పాల్గొని మాట్లాడారు. రైతుల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎల్లప్పుడూ కృషి చేస్తూనే ఉన్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ అగ్రిమిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి మాట్లా డుతూ అత్యధిక జనాభాగా ఉన్న మన దేశం ఆహార ధాన్యాలను ఎగుమతి చేసే స్థితిలో ఉండడం సంతోషకరమన్నారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఎ. విష్ణువర్ధన్‌రెడ్డి వ్యవసాయ రంగం లో ఆధునికతను పెంచి డ్రోన్ టెక్నాలజీతో 10 రకాల పంటల్లో 22 రకాల యాజమాన్య పద్ధతులు వివరించారు.

క్లుప్తంగా...

లాలూ కిడ్నీ మార్పిడి విజయవంతం



పట్నా: రాష్ట్రీయ జనతాదళ్(ఆర్‌జేడీ) చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్(74)కు సింగపూర్‌లోని ఆస్పత్రిలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా ముగిసిందని ఆయన కుమారుడు, బిహార్ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ తెలిపారు. ఆపరేషన్ తర్వాత తన తండ్రి లాలూ, అవయవ దానం చేసిన తన సోదరి రోహిణి ఆచార్య చక్కగా కోలుకుంటున్నారని చెప్పారు. లాలూ ఆపరేషన్ విజయవంతమవ్వాలని బిహార్ వ్యాప్తంగా ఆర్జేడీ కార్యకర్తలు పూజలు, హోమాలు జరిపించారు. ఆపరేషన్ తర్వాత లాలూ ఆరోగ్యంగా ఉన్నారని ప్రకటించడంతో సోమవారం పట్నాలోని పార్టీ కార్యాలయంలో పండగ వాతావరణం నెలకొంది. దాణా కుంభకోణంలో జైలు శిక్ష అనుభవిస్తున్న బిహార్ మాజీ సీఎం లాలూకు ఆరోగ్య కారణాలపై కోర్టు బెయిల్ మంజూరు చేసింది. సింగపూర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను వివాహం చేసుకున్న రోహిణి తండ్రి లాలూకు కిడ్నీ దానం చేసేందుకు తీసుకున్న నిర్ణయంపై ఇటీవల సర్వత్రా హర్షం వ్యక్తమైన విషయం తెలిసిందే.

వచ్చే నెలలో ప్రియాంకా గాంధీ 'మహిళా మార్చ్'

న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కొనసాగిస్తున్న భారత్ జోడో యాత్ర ముగిసిన తర్వాత మరో యాత్రకు ఆ పార్టీ సన్నాహాలు చేస్తోంది. పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా నేతృత్వంలో 'మహిళా మార్చ్' చేపట్టాలని కాంగ్రెస్ నిర్ణయించింది. జనవరిలో మహిళా మార్చ్ ప్రారంభమవుతుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కేసీ వేణుగోపాల్ తెలిపారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల రాజధానుల్లో ప్రియాంకా గాంధీ మహిళలతో కలిసి యాత్రలో పాల్గొంటారని వెల్లడించారు. తమ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో జనవరి 26 నుంచి మార్చి 26వ తేదీ దాకా.. రెండు నెలలపాటు ఈ యాత్ర కొనసాగుతుందని పేర్కొన్నారు.

బస్సులోనే ప్రసవం

బులంద్‌షహర్: భర్తతో కలిసి సొంతూరుకు వెళుతున్న ఓ మహిళ బస్సులోనే ప్రసవించి, పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. డ్రైవర్ ఆ బస్సును ప్రభుత్వ ఆస్పత్రికి వద్దకు తీసుకెళ్లి తల్లిని, నవజాత శిశువును వైద్యులకు అప్పగించారు. ఈ ఘటన ఢిల్లీ నుంచి యూపీలోని కన్నౌజ్ జిల్లా ఛిబ్రమౌకు వెళ్తుండగా ఆదివారం చోటుచేసుకుందని ప్రభుత్వ రోడ్డు రవాణా సంస్థ బస్సు డ్రైవర్ అలోక్ కుమార్ చెప్పారు. ఢిల్లీ నుంచి సొంతూరైన యూపీలోని ఈటా జిల్లాలోని సొంతూరుకు తాము వెళ్తున్నట్లు మహిళ భర్త సోమేశ్ కుమార్ చెప్పారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారన్నారు.

రష్యా చమురుపై ధరల పరిమితి షురూ

కీవ్: రష్యా చమురు ధరపై 27 దేశాలతో కూడిన యూరోపియన్ యూనియన్, జీ 7 దేశాలు విధించిన బ్యారెల్‌కు 60 డాలర్ల పరిమితి అమల్లోకి వచ్చింది. దీంతోపాటు రష్యా నుంచి కొన్ని రకాల చమురు దిగుమతులపై ఆ దేశాలు నిషేధమూ విధించాయి. ఈయూ, జీ7 పరిమితిని రష్యా ఇప్పటికే నిర్ద్వంద్వంగా తిరస్కరించడం తెలిసిందే. పరిమితులు విధించే దేశాలకు చమురు విక్రయాలు పూర్తిగా నిలిపేస్తామని ఇంధన వ్యవహారాలు చూసే రష్యా ఉప ప్రధాని అలెగ్జాండర్ నొవాక్ ఆదివారం కూడా హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ చమురు మార్కెట్‌పై వాటి నిర్ణయం ఎలాంటి ప్రభావం చూపుతుందోనన్న ఆందోళనలు నెలకొన్నాయి. సోమవారం యూఎస్ బెంచ్ మార్క్ చమురు బ్యారెల్‌కు 80.88 డాలర్లు పలికింది.

కెనడాలో సిక్కు మహిళ కాల్చివేత

టొరంటో: కెనడాలోని ఒంటారియో ప్రావిన్స్‌లో శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగుడు జరిపిన కాల్పుల్లో ఒక సిక్కు మహిళ(21) ప్రాణాలు కోల్పోయారు. మిస్సిసాగా నగరంలోని బ్రంప్టన్‌కు చెందిన కెనడా పౌరురాలు పవన్‌ప్రీత్ కౌర్ రాత్రి 10.40 గంటల సమయంలో గ్యాస్ స్టేషన్ సమీపంలో ఉండగా దుండగుడొకరు కణతపై దగ్గర్నుంచి కాల్పులు జరిపి, పారిపోయినట్లు ప్రత్యక్ష సాక్షి ఒకరు చెప్పారు. కౌర్ అక్కడికక్కడే చనిపోయిందని పోలీసులు తెలిపారు. ఎవరో కావాలనే ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు భావిస్తున్నామన్నారు. నవంబర్ 22వ తేదీన బ్రిటిష్ కొలంబియా ప్రావిన్స్‌లో మెహక్‌ప్రీత్ సేథి అనే భారతీయ విద్యార్థిని దుండగులు పొడిచి చంపిన విషయం తెలిసిందే.

ఎన్‌సీ చీఫ్‌గా మళ్లీ ఫరూక్

శ్రీనగర్: నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) అధ్యక్షుడిగా ఫరూక్ అబ్దుల్లా (85) మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హజ్రత్‌బల్‌లోని నసీమ్ బాగ్‌లో ఉన్న ఎన్‌సీ వ్యవస్థాపకుడు షేక్ మహ్మద్ అబ్దుల్లా సమాధి వద్ద ఆయన 117వ జయంతిని పురస్కరించుకుని ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యవర్గ సమావేశంలో అధ్యక్షుడిగా ఫరూక్ అబ్దుల్లాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష పదవికి కేవలం ఒకే ఒక్క నామినేషన్ అందిందని ఎన్‌సీ ప్రధాన కార్యదర్శి అలీ మహ్మద్ సగర్ చెప్పారు. 2014లో కొడుకు ఒమర్ రాజీనామాతో ఫరూక్ పార్టీ పగ్గాలు స్వీకరించారు.



అహ్మదాబాద్‌లో ఓటేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా దంపతులు, కుమారుడు జై షా, కోడలు



గాంధీనగర్‌లో ఓటేయడానికి వస్తున్న ప్రధాని మోదీ మాతృమూర్తి హీరా బెన్



ఓటేసిన బీజేపీ నేత హార్దిక్ పటేల్

గుజరాత్ బీజేపీదే

అన్ని ఎగ్జిట్ పోల్స్‌దీ అదే మాట
- వరుసగా ఏడోసారీ ఘనవిజయం
- కాంగ్రెస్‌కు ఘోర పరాభవం
- సత్తా చాటనున్న ఆమ్ ఆద్మీ పార్టీ
- హిమాచల్‌ప్రదేశ్‌లో బీజేపీ, కాంగ్రెస్ హోరాహోరీ

గురువారం వెలువడనున్న ఫలితాలు

గుజరాత్ — మొత్తం సీట్లు 182 — మెజారిటీ మార్కు 92
ప్రస్తుత బలాలు: బీజేపీ: 99, కాంగ్రెస్: 77, ఇతరులు: 6

	బీజేపీ	కాంగ్రెస్	ఆప్	ఇతరులు
ఇండియాటుడే - యాక్సిస్ మై ఇండియా	129-151	16-30	9-21	2-6
ఇండియా టీవీ-మాట్రిజ్	112-127	51-61	1-7	1-3
ఏబీపీ-సి ఓటర్	128-140	31-43	3-11	2-6
రిపబ్లిక్ టీవీ-పి.మార్క్	128-148	30-42	2-10	0-3
టైమ్స్ నౌ-ఈటీజీ	131	41	6	4
పీపుల్స్ పల్స్	125-143	30-48	3-7	2-6
న్యూస్ 24-టుడేస్ చాణక్య	150	19	11	2
సీఎన్ఎన్ న్యూస్ 18 పోల్ ఆఫ్ పోల్స్	134	37	8	0

హిమాచల్ — మొత్తం సీట్లు 68 — మెజారిటీ మార్కు 35
ప్రస్తుత బలాలు: బీజేపీ: 44, కాంగ్రెస్: 21, ఇతరులు: 3

	బీజేపీ	కాంగ్రెస్	ఆప్	ఇతరులు
ఇండియాటుడే- యాక్సిస్-మై ఇండియా	24-34	30-40	0	4-8
ఇండియా టీవీ-మాట్రిజ్	35-40	26-31	0	
ఏబీపీ-సి ఓటర్	33-41	24-32	0	0-4
రిపబ్లిక్ టీవీ-పి.మార్క్	34-39	28-33	0-1	0
టైమ్స్ నౌ-ఈటీజీ	34-42	24-32	0	0
పీపుల్స్ పల్స్	27-37	29-39	0	2-5
జీ సర్వే	35-40	20-25	0-3	1-5
న్యూస్ 24-టుడేస్ చాణక్య	33	33	0	0
సీఎన్ఎన్ న్యూస్ 18 పోల్ ఆఫ్ పోల్స్	35	30	0	0

న్యూఢిల్లీ: కీలక రాష్ట్రమైన గుజరాత్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం ఖాయమని ఎగ్జిట్ పోల్స్ ముక్త కంఠంతో పేర్కొన్నాయి. 182 అసెంబ్లీ స్థానాలున్న గుజరాత్‌లో ఒక్క ఎగ్జిట్ పోల్ కూడా బీజేపీకి 110 కంటే తక్కువ సీట్లు ఇవ్వక పోవడం విశేషం! 2017 అసెంబ్లీ ఎన్నికల్లో 99 సీట్లొచ్చిన కమల దళానికి కొన్ని ఎగ్జిట్ పోల్స్ ఏకంగా 149 నుంచి 151 సీట్ల దాకా ఇచ్చాయి!! 2024 లోక్‌సభ ఎన్నికలకు సెమీఫైనల్స్‌గా భావించిన ఈ పోరులో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ దారుణ పరాభవం మూటగట్టుకోనుందని తేల్చేశాయి. గత ఎన్నికల్లో 77 స్థానాలు గెలుచుకున్న హస్తం పార్టీకి ఈసారి ఇండియాటీవీ-మాట్రిజ్ ఎగ్జిట్ పోల్ ఇచ్చిన 51 సీట్లే గరిష్టం! ముక్కోణపు పోరులో కాంగ్రెస్‌ను ఆప్ నిండా ముంచిందని ఎగ్జిట్ పోల్స్ తేల్చి చెప్పాయి. ఆప్ 20 సీట్లకు పైగా నెగ్గనుందని పలు ఎగ్జిట్ సర్వేలు పేర్కొన్నాయి. హిమాచల్‌ప్రదేశ్‌లో మాత్రం బీజేపీ, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ నెలకొంది. పలు ఎగ్జిట్ పోల్స్‌లో బీజేపీకి మొగ్గు కనిపించగా ఒకట్రెండు మాత్రం స్వల్ప మెజారిటీతో కాంగ్రెస్ గెలుస్తుందని పేర్కొన్నాయి. ఇక కీలకమైన ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) బీజేపీ చేజారడం ఖాయమని ఎగ్జిట్ పోల్స్ స్పష్టం చేశాయి. అక్కడ ఆప్ ఘనవిజయం సాధిస్తోందన్నాయి. హిమాచల్‌ప్రదేశ్‌లో నవంబర్ 12న, గుజరాత్‌లో రెండు దశల్లో డిసెంబర్ 1, 5వ తేదీల్లో పోలింగ్ జరగడం తెలిసిందే. ఓట్ల లెక్కింపు 8న జరగనుంది.

గుజరాత్‌లో మళ్లీ మోదీ మ్యాజిక్

గుజరాత్‌లో ఏడోసారి బీజేపీ ఘనవిజయం సాధించనుందని ఎగ్జిట్ పోల్స్ పేర్కొన్నాయి. దానికి 117 నుంచి 151, కాంగ్రెస్‌కు 16-51 సీట్ల దాకా వస్తాయని అంచనా వేశాయి. 182 స్థానాలున్న గుజరాత్ అసెంబ్లీలో మెజారిటీకి 92 సీట్లు కావాలి. 2017లో పటేళ్ల ఉద్యమం తదితర కారణాలతో బీజేపీ 99 స్థానాలే నెగ్గగా కాంగ్రెస్ గట్టి పోటీ ఇచ్చి 77 సీట్లు కైవసం చేసుకుంది. ఈసారి బీజేపీకి 129 నుంచి 151 సీట్లు రావచ్చని ఇండియాటుడే యాక్సిస్ మై ఇండియా పేర్కొంది. కాంగ్రెస్ 16 నుంచి 30 సీట్లకు పరిమితమవుతుందని, ఆప్ 9 నుంచి 21 సీట్ల దాకా గెలుస్తుందని అంచనా వేసింది. న్యూస్ 24 టుడేస్ చాణక్య కూడా బీజేపీకి 150 సీట్లు ఇచ్చింది. బీజేపీకి 148, కాంగ్రెస్‌కు 42, ఆప్‌కు 10 సీట్లొస్తాయని రిపబ్లిక్ టీవీ పేర్కొంది.

మంచు కొండల్లో పోటాపోటీ

హిమాచల్‌ప్రదేశ్‌లో ఇండియాటుడే యాక్సిస్ మై ఇండియా బీజేపీకి 24-34, కాంగ్రెస్‌కు 30-40 సీట్లు; న్యూస్24 టుడేస్ చాణక్య రెండు పార్టీలకూ చెరో 33 సీట్లు అంచనా వేశాయి. ఏబీపీ న్యూస్ సీ ఓటర్ బీజేపీకి 33 నుంచి 41, కాంగ్రెస్‌కు 24 నుంచి 32 సీట్లు; ఇండియా టీవీ బీజేపీకి 35 నుంచి 40, కాంగ్రెస్‌కు 26 నుంచి 31 సీట్లిచ్చాయి. టైమ్స్ నౌ ఈటీజీ మాత్రం బీజేపీ 38 సీట్లతో అధికారాన్ని నిలబెట్టుకుంటుందని, కాంగ్రెస్‌కు 28 సీట్లొస్తాయని పేర్కొంది.

రెండో దశలో 61% ఓటింగ్

అహ్మదాబాద్‌లో ఓటు వేసిన ప్రధాని మోదీ

అహ్మదాబాద్: గుజరాత్ శాసనసభ రెండో దశ ఎన్నికల్లో 60.94 శాతం ఓటింగ్ నమోదయ్యింది. రెండో, చివరి దశలో భాగంగా 14 జిల్లాల్లోని 93 అసెంబ్లీ స్థానాలకు సోమవారం ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 833 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అత్యధికంగా సబర్‌కాంతా జిల్లాలో 65.84 శాతం ఓటింగ్ నమోదయ్యింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, ఆప్ సీఎం అభ్యర్థి ఇసుదాన్ గాఢ్వీ తదితర ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మోదీ అహ్మదాబాద్‌లో రానిప్ ప్రాంతంలోని నిశాన్ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. ఆయన తల్లి, 99 ఏళ్ల వృద్ధురాలు హీరాబెన్ గాంధీనగర్ జిల్లాలో చక్రాల కుర్చీలో వచ్చి ఓటేశారు. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించలేదంటూ మెహసానా జిల్లాలో మూడు గ్రామాలకు చెందిన 5,200 మంది ఓటర్లు బహిష్కరించారు. ఇదే జిల్లాలోని విజాపురా పట్టణంలో 110 ఏళ్ల వృద్ధురాలు శాంతాబెన్ ఓటు వేశారు.

గుజరాతీలు సత్యాన్ని మాత్రమే స్వీకరిస్తారు

గుజరాత్ ప్రజలు అందరి మాట వింటారు కానీ, నిజాన్ని మాత్రమే స్వీకరించడం వారి నైజమని మోదీ చెప్పారు. ఓటేశాక పోలింగ్ కేంద్రం బయట ఆయన మాట్లాడుతూ..'గుజరాత్ ప్రజలు వివేచన గలిగిన వారు. పెద్ద సంఖ్యలో వచ్చి ఓటు హక్కు వినియోగించు కుంటున్నారు. వారికి నా కృతజ్ఞతలు' అని అన్నారు. భారత ప్రజాస్వామ్యం ఘనతను ప్రపంచవ్యాప్తంగా చాటేలా అద్భుతంగా పోలింగ్ జరిపిస్తున్న ఎన్నికల సంఘానికి కృతజ్ఞతలు తెలిపారు. గుజరాత్, హిమాచల్, ఢిల్లీ వాసులు ఓటింగ్‌లో పాల్గొని ప్రజాస్వామ్య పండగను ఉత్సాహంగా జరుపుకున్నారన్నారు. ఢిల్లీ మునిసిపాలిటీకి ఆదివారం, హిమాచల్ అసెంబ్లీకి గత నెలలో ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. సోమవారం ఉదయం 9.30 గంటలకు అహ్మదాబాద్ చేరుకున్న ప్రధాని మోదీ, రానిప్ ప్రాంతంలోని నిషాన్ హైస్కూల్ పోలింగ్ బూత్‌కు చేరుకున్నారు. కొద్దిసేపు క్యూలో నిలబడి ఓటు వేసి వచ్చారు. బయట నిలబడిన వారికి సిరా గుర్తు వేసిన వేలిని చూపిస్తూ సమీపంలోనే ఉన్న సోదరుడు సోమా మోది ఇంటికి వెళ్లారు. పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలంటూ ఉదయం ఆయన ట్వీట్ల ద్వారా ఓటర్లకు పిలుపునిచ్చారు.

పోలింగ్ జరుగుతుండగానే ప్రధాని రోడ్ షో: కాంగ్రెస్

గుజరాత్‌లో ఒక వైపు రెండో దశ పోలింగ్ కొనసాగుతున్న సమయంలోనే ప్రధాని మోదీ రోడ్ షో నిర్వహించడమేంటని కాంగ్రెస్ ప్రశ్నించింది. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన ప్రధానిపై చర్యలు తీసుకునేందుకు ఎన్నికల సంఘం భయపడుతున్నట్లుగా ఉందని పేర్కొంది. అహ్మదాబాద్‌లో సోమవారం ఓటు హక్కు వినియోగించుకున్న ప్రధాని మోదీ..అంతకుముందు సుమారు రెండున్నర గంటల పాటు రోడ్ షో నిర్వహించినట్లు కాంగ్రెస్ మీడియా, పబ్లిసిటీ హెడ్ పవన్ ఖేరా తెలిపారు. ఈసీ ఈ రోడ్ షోకు అనుమతి ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. రోడ్ షోను అన్ని టీవీ చానెళ్లు ఉచితంగా ప్రత్యక్ష ప్రసారం చేశాయని పేర్కొన్నారు. మన ప్రజాస్వామ్యానికి, ఎన్నికల వ్యవస్థకు కాపలాదారుగా వ్యవహరించాల్సిన ఈసీ మాత్రం మౌనంగా ఉండిపోయిందని పేర్కొన్నారు. బహుశా ఒత్తిడుల వల్లే చర్యలకు వెనకాడుతున్నట్లు అనిపిస్తోందన్నారు. గుజరాత్, ఢిల్లీ ఎన్నికల్లో అక్రమాలు, ఉల్లంఘటనపై ఎప్పటికప్పుడు తమ పార్టీ ఈసీకి ఫిర్యాదులు చేస్తూనే ఉన్నా చర్యలు మాత్రం కరువయ్యాయని చెప్పారు. వీటిపై న్యాయపరంగా ముందుకు వెళ్లాలని యోచిస్తున్నట్లు వెల్లడించారు. తమ అభ్యర్థి, దంతా సిట్టింగ్ ఎమ్మెల్యే కాంతిభాయ్ ఖరాడీ ప్రాణహాని ఉందంటూ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదుపై ఈసీ చర్యలు తీసుకోలేదన్నారు.



అహ్మదాబాద్‌లో ఓటేసిన అనంతరం ప్రజలకు ప్రధాని అభివాదం

ఢిల్లీ కార్పొరేషన్‌పై ఎగరనున్న ఆప్ జెండా

న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మకంగా జరిగిన ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో 15 ఏళ్ల బీజేపీ పాలనకు ఆప్ తెర దించనుందని ఎగ్జిట్‌పోల్స్ పేర్కొన్నాయి. 250 స్థానాల్లో ఆప్ 149 నుంచి ఏకంగా 171 సీట్లు కొల్లగొట్టనుందని ఇండియాటుడే యాక్సిస్ మై ఇండియా పేర్కొంది. బీజేపీ 69 నుంచి 91 సీట్లకు పరిమితమవుతుందని చెప్పింది. టైమ్స్ నౌ ఈటీజీ సర్వేలోనూ ఆప్‌కు 146 నుంచి 156, బీజేపీకి 84 నుంచి 94 సీట్లొచ్చాయి. ఆప్ 150 నుంచి 175, బీజేపీ 70 నుంచి 92 సీట్లు గెలుస్తుందని న్యూస్ ఎక్స్ పేర్కొంది. కాంగ్రెస్ సింగిల్ డిజిట్ దాటబోదని మూడు సర్వేలూ తేల్చడం విశేషం! 2007 నుంచీ ఎంసీడీ బీజేపీ చేతుల్లోనే ఉంది. 2017లో జరిగిన ఎన్నికల్లో 270 సీట్లలో బీజేపీ 181 నెగ్గగా ఆప్‌కు 48, కాంగ్రెస్‌కు 27 సీట్లొచ్చాయి. ఈ ఏడాది మొదట్లో ఢిల్లీలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్లను కేంద్రం ఏకీకృతం చేసింది 250 వార్డులను ఏర్పాటు చేసింది.

కరోనా వైరస్.. మానవ నిర్మితమే

వూహాన్ ల్యాబ్ సైంటిస్టు ఆండ్రూ హఫ్ వెల్లడి



వాషింగ్టన్: ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ప్రాణాలను బలితీసుకున్న కరోనా వైరస్ మానవ నిర్మితమేనని చైనాలోని వూహాన్ ల్యాబ్‌లో పని చేసిన అమెరికా శాస్త్రవేత్త, ఎపిడెమియాలజిస్ట్ ఆండ్రూ హఫ్ చెప్పారు. తాజాగా విడుదల చేసిన తన పుస్తకం 'ది ట్రూత్ ఎబౌట్ వూహాన్'లో సంచలన విషయాలు బయటపెట్టారు. చైనా ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేస్తున్న వూహాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ(డబ్ల్యూఐవీ) నుంచి రెండేళ్ల క్రితం కరోనా వైరస్ లీక్ అయ్యిందని వెల్లడించారు. చైనా ల్యాబ్‌లో వైరస్‌లపై పరిశోధనలకు అమెరికా ప్రభుత్వం నిధులు సమకూరుస్తోందని పేర్కొన్నారు. కరోనా వైరస్ అనేది జన్యుపరంగా రూపొందించిన ఏజెంట్ అని చైనాకు తెలుసని వివరించారు. చైనాకు అమెరికా బయోవెపన్ సాంకేతికతను అందజేస్తోందన్నారు. సరైన భద్రతా చర్యలు లేని ప్రయోగాల కారణంగా వూహాన్ ల్యాబ్ నుంచి కరోనా బయటకు వచ్చిందని స్పష్టం చేశారు. జీవ భద్రత, బయోసెక్యూరిటీ, రిస్క్ మేనేజ్‌మెంట్ వంటి చర్యలు ఆ ల్యాబ్‌లో లేవని ఆండ్రూ హఫ్ ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికాకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్(ఎన్ఐహెచ్)తో చైనాలోని వూహాన్ ల్యాబ్‌కు సన్నిహిత సంబంధాలున్నాయని తెలిపారు. ఎన్ఐహెచ్ నుంచి అందే నిధులతో గబ్బిలాల్లోని కరోనా వైరస్‌లపై వూహాన్ ల్యాబ్ అధ్యయనం చేస్తోందని తన పుస్తకంలో ప్రస్తావించారు.

బలవంతపు మత మార్పిడి రాజ్యాంగ విరుద్ధం

సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ



న్యూఢిల్లీ: బలవంతంగా మతం మార్చడం ముమ్మాటికీ తీవ్రమైన అంశమేనని సుప్రీంకోర్టు మరోసారి తేల్చిచెప్పింది. బలవంతపు మత మార్పిడి రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసింది. భారతదేశంలో నివస్తున్న వారంతా ఇక్కడి సంస్కృతీ సంప్రదాయాల ప్రకారం నడుచుకోవాలని సూచించింది. అయితే, సమాజానికి సేవ చేయడం కోసం మరో మతంలోకి వెళితే అది బలవంతపు మత మార్పిడి కాదని పేర్కొంది. బెదిరింపులు, ప్రలోభాలతో జరిగే మత మార్పిడులను అరికట్టేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలివ్వాలని కోరుతూ సీనియర్ అడ్వొకేట్ అశ్వినీకుమార్ ఉపాధ్యాయ్ గతంలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ సీటీ రవికుమార్‌తో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. మత మార్పిడుల వ్యవహారంపై రాష్ట్రాల నుంచి సమాచారం సేకరిస్తున్నామని చెప్పారు. పూర్తి సమాచారాన్ని కోర్టు ముందు ఉంచేందుకు వారం రోజుల సమయం ఇవ్వాలని కోరారు. దీంతో ధర్మాసనం తదుపరి విచారణను ఈ నెల 12వ తేదీకి వాయిదా వేసింది. బలవంతపు మత మార్పిడులు దేశ భద్రతకు ప్రమాదకరం కావొచ్చని సుప్రీంకోర్టు గతంలో వెల్లడించింది. అంతేకాకుండా పౌరుల మత స్వేచ్ఛకు కూడా ప్రతిబంధకమేనని పేర్కొంది. ఇలాంటి మత మార్పిడులను అడ్డుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది.

జీ-20 నాయకత్వం.. ప్రతి పౌరుడికీ గర్వకారణం

ప్రధాని మోదీ పునరుద్ఘాటన
- దేశ సంస్కృతీ సంప్రదాయాలను ప్రపంచానికి చాటాలి
- బీజేపీ ఆఫీస్-బేరర్ల భేటీ ప్రారంభం



న్యూఢిల్లీ: శక్తివంతమైన జీ-20 కూటమి నాయకత్వం భారత్‌కు దక్కడం దేశంలో ప్రతి పౌరుడూ గర్వించాల్సిన విషయమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. భారతీయతను, దేశ సంస్కృతీ సంప్రదాయాలను ప్రపంచానికి చాటడానికి ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. సోమవారం ఢిల్లీలో అధికార బీజేపీ జాతీయ ఆఫీస్-బేరర్ల సమావేశాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశ సరిహద్దుల్లో ఉన్న గ్రామాలతో ప్రత్యక్ష అనుబంధం పెంచుకోవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఆయా గ్రామాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని చెప్పారు. కోవిడ్-19 మహమ్మారి వ్యాప్తి, ఉక్రెయిన్-రష్యా యుద్ధం వంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ భారత్ ప్రబల ఆర్థిక శక్తిగా ఎదుగుతోందని హర్షం వ్యక్తం చేశారు. భారతదేశ ప్రయాణాన్ని ప్రపంచదేశాలు ఆసక్తిగా గమనిస్తున్నాయని తెలిపారు. కాశీ-తమిళనాడు మధ్య ప్రాచీన కాలం నుంచి సాంస్కృతిక సంబంధాలను స్మరించుకుంటూ 'కాశీ-తమిళ సంగమం' నిర్వహిస్తుండడం సంతోషకరమని అన్నారు. భిన్న సంస్కృతులను పరిచయం చేసుకోవడానికి 'స్నేహ మిలన్'లు నిర్వహించుకోవాలని హైదరాబాద్‌లో జరిగిన బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశంలో తాను సూచించానని మోదీ గుర్తుచేశారు. ఇప్పుడు 'కాశీ-తమిళ సంగమం' జరుగుతోందని వెల్లడించారు.

ఎన్నికల వ్యూహాలపై చర్చ

బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అధ్యక్షతన జరిగిన పార్టీ జాతీయ ఆఫీస్-బేరర్ల సమావేశంలో రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ముఖ్యనేతలు పాల్గొన్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ సమావేశంలో త్వరలో జరగబోయే వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించనున్నారు. బూత్ స్థాయిలో పార్టీలో బలోపేతం చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. సంస్థాగత వ్యవహారాలపై చర్చిస్తారు.

సోమరి స్వార్థపరుడు..

ఈ ఏడాది పదంగా 'గోబ్లిన్ మోడ్'ను ప్రకటించిన ఆక్స్‌ఫర్డ్

లండన్: అత్యంత సోమరిగా ఉంటూ స్వార్థ చింతనతో జీవించే వ్యక్తులను ఉద్దేశిస్తూ వాడే 'గోబ్లిన్ మోడ్' పదాన్ని 2022 ఏడాదికి వర్డ్ ఆఫ్ ది ఇయర్‌గా ఆక్స్‌ఫర్డ్ ప్రకటించింది. ఇంట్లో వస్తువులు చిందర వందరగా పడేస్తూ, సామాజిక నియమాలను పాటించని స్వార్థపూరిత అపరిశుభ్ర వ్యక్తుల మానసిక వైఖరిని 'గోబ్లిన్ మోడ్' అని పిలుస్తుంటారు. ఒక సంవత్సరకాలంలో సమాజంలో అత్యంత సాధారణంగా వినిపించే, ప్రస్తావించే, చర్చించబడే పదాన్ని 'ఆ ఏడాది పదం'గా ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లిష్ డిక్షనరీ ప్రకటిస్తోంది. సాధారణంగా ఆక్స్‌ఫర్డ్ ప్యానెల్ నిపుణులే ప్రతి ఏటా పదాన్ని నిర్ణయిస్తారు. కానీ, తొలిసారిగా ఈఏడాది ప్రజాభిప్రాయాన్ని ఓటింగ్ ద్వారా తీసుకుని విజేత పదాన్ని ప్రకటించారు. ఓటింగ్‌లో దాదాపు 93 శాతం ఓట్లు ఒక్క గోబ్లిన్ పదానికి పట్టం కడుతూ పోలవడం విశేషం. దాదాపు 13 ఏళ్ల క్రితం నుంచీ గోబ్లిన్ పదం అప్పుడప్పుడూ వార్తల్లో నిలుస్తోంది. కానీ, కోవిడ్ సంక్షోభం నేపథ్యంలో నెలల తరబడి కేవలం ఇంటికి, గదికే పరిమితమైన వారు మానసికంగా 'గోబ్లిన్ మోడ్'లోకి వెళ్లిపోయారని అంతర్జాతీయంగా చర్చ కొనసాగిన విషయం విదితమే. ఈ పోటీలో మెటావర్స్(ఊహా ప్రపంచం) పదం రెండో స్థానంలో ఐ స్టాండ్ విత్ అనే పదం మూడో స్థానంలో నిలిచాయి.

గెహ్లోట్, పైలట్‌లతో కలిసి పాదయాత్ర

రాజస్తాన్‌లో మొదలైన భారత్ జోడో యాత్ర



జోడో యాత్రలో బాలికలతో రాహుల్‌గాంధీ

ఝులవాడ్(రాజస్తాన్): రాజస్తాన్‌లో భారత్ జోడో యాత్ర తొలిరోజు పాదయాత్రను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్, మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్‌ల సమక్షంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మొదలుపెట్టారు. రాజస్తాన్ రాష్ట్ర కాంగ్రెస్ రాజకీయాల్లో ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తున్న ముఖ్యమంత్రి గెహ్లోట్, మాజీ డెప్యూటీ సీఎం సచిన్ పైలట్‌లు యాత్రలో కలిసి నడిచారు. యాత్ర 89వ రోజును మధ్యప్రదేశ్ సరిహద్దులోని ఝల్‌రాపటాన్ పరిధిలోని కాళీ తలాయ్ గ్రామంలో ప్రారంభించారు. ఉదయం ఆరు గంటలకే చలిలో 13 డిగ్రీల చల్లని వాతావరణంలోనూ రాహుల్ ఉత్సాహంగా యాత్రలో పాల్గొన్నారు. యాత్ర మధ్యలో ధాబా వద్ద డజను మంది చిన్నారులతో ముచ్చటిస్తూ టీ తాగారు. 'ధైర్యసాహసాలకు, ఘన చరిత్రకు నెలవైన నేల రాజస్థాన్. ఈసారి మరో చరిత్రను లిఖించనుంది' అంటూ కాంగ్రెస్ ట్వీట్‌చేసింది.

యాత్రను మీడియా బహిష్కరిస్తోంది

'యాత్రలో లక్షలాది మంది భాగస్వాములయ్యారు. దేశవ్యాప్తంగా అందరి మద్దతుతో యాత్ర అద్భుతంగా ముందుకు సాగుతోంది. కానీ, మీడియా సంస్థల యాజమాన్యాలు, సంపాదకులపై పై నుంచి ఒత్తిడి ఎక్కువైంది. అందుకే భారత్ జోడో యాత్ర కవరేజీని ప్రధాన జాతీయ మీడియా సంస్థలు బహిష్కరించాయి. ప్రజాస్వామ్యానికి నాలుగో మూలస్తంభమైన మీడియా చేస్తున్న ఈ ద్రోహాన్ని చరిత్ర మరువదు' అని గెహ్లోట్ అన్నారు.



సైఫయిలో ఓటు వేసేందుకు వచ్చిన సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, భార్య డింపుల్. మెయిన్‌పురి ఎంపీ, ఎస్పీ అగ్రనేత ములాయం సింగ్ యాదవ్ మరణంతో ఆ నియోజకవర్గంలో ఉప ఎన్నిక నిర్వహిస్తున్న సంగతి తెల్సిందే. ఈ స్థానంలో ఎస్పీ తరఫున అభ్యర్థిగా ములాయం కోడలు డింపుల్ బరిలో నిలిచారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

మంగళవారం । 6 । డిసెంబర్ । 2022



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం
ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ సన్నిధిలో జరిగే నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన డి.ప్రవీణ్‌కుమార్ దంపతులు సోమవారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.



15 నుంచి భవానీ దీక్షల విరమణ
శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభమయ్యే భవానీ దీక్షల విరమణకు అవసరమైన ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. -8లో▸



హెల్త్ వర్సిటీ కబడ్డీ జట్టు ఎంపిక
దక్షిణ భారత అంతర్‌వర్సిటీ కబడ్డీ పోటీలకు పురుషుల జట్టును ఎంపిక చేసినట్లు డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వర్సిటీ క్రీడా విభాగ కార్యదర్శి డాక్టర్ త్రిమూర్తులు తెలిపారు. -8లో▸

న్యూస్‌రీల్

తిరుపతమ్మ ఆలయ ఈఓగా లీలాకుమార్



పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయ ఈఓగా జి.వి.డి.ఎన్.లీలాకుమార్‌ను నియమిస్తూ దేవదాయశాఖ కమిషనర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అన్నవరం శ్రీసత్యనారాయణస్వామి ఆలయ ఈఓ మూర్తి ప్రస్తుతం అమ్మవారి ఆలయ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు.

విభిన్న ప్రతిభావంతుల చెస్ పోటీల్లో కార్తీక్‌కు మూడో స్థానం



విజయవాడ స్పోర్ట్స్: విభిన్న ప్రతిభావంతుల మూడో జాతీయ చదరంగం పోటీల్లో విజయవాడ కృష్ణలంకకు చెందిన కె.వెంకటకృష్ణకార్తీక్ అద్భుత ప్రతిభకనబర్చాడు. ఈ నెల ఒకటి నుంచి నాల్గో తేదీ వరకు కర్ణాటకలోని తుంకూర్ పట్టణంలో జరిగిన ఈ పోటీలకు దేశ వ్యాప్తంగా 70 మంది రేటింగ్ క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన కార్తీక్ 7/9 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. కార్తీక్‌ను గ్లోబల్ చెస్ అకాడమీ కోచ్ ఖాసీం అభినందించారు.

హక్కులపై అవగాహన అవసరం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థి దశ నుంచే వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగివుండాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సూచించారు. వినియోగదారుల హక్కులపై రూపొందించిన అవగాహన ప్రచార పోస్టర్‌ను కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వినియోగదారుల హక్కులపై అవగాహన ఉంటే మోసాల నుంచి తమను తాము రక్షించుకోవచ్చని సూచించారు. ప్రస్తుతం ఈకామర్స్ వ్యాపారంలో వినియోగదారులు నష్టపోకుండా యువతలో చైతన్యం రావాలన్నారు. వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ సంస్థలతో పాటు యూత్ ఎంగేజ్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు. జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్, డీఆర్వో కె.మోహన్ కుమార్, ట్రైనీ డెప్యూటీ కలెక్టర్లు ఎస్.రామలక్ష్మి, ఖలీఫ్ కౌసర్ బానో, డీఎస్ఓ పి.కోమలిపద్మ, యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎం.శ్రీనివాసరావు, యూత్ ఎంగేజ్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ బాజీ, జిల్లా యువజన సమన్వయ కర్త మధులత, న్యాయవాది సవ్య, రమ్య, గోపిక తదితరులు పాల్గొన్నారు.


మంచులో ప్రకాశం బ్యారేజీ

కప్పేసిన మంచు దుప్పటి
విజయవాడను సోమవారం మంచు దుప్పటి కప్పేసింది. నగరం అంతా పొగమంచుతో నిండిపోయింది. ఉదయం పది గంటల వరకూ భానుడు సైతం మంచులో చిక్కుకున్నాడు. వాహనాలన్నీ లైట్ల వెలుగుల్లో రాకపోకలు సాగించాయి. పొగ మంచులో నగరం సరికొత్త అందాలతో కనువిందు చేసింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ


అజిత్‌సింగ్ నగర్ రైల్వే ట్రాక్



జయహో బీసీ
జయహో బీసీ మహాసభకు విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియం ముస్తాబవుతోంది. స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, మంత్రులు బొత్స సత్యనారాయణ, చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్, జంగా కృష్ణమూర్తి, లేళ్ల అప్పిరెడ్డి తదితరులు సోమవారం పరిశీలించారు.

– సాక్షి ప్రతినిధి, విజయవాడ


సిద్ధమవుతున్న సభా ప్రాంగణం

దివ్యాంగుల భవితకు భరోసా

- దివ్యాంగుల సేవలో భవిత కేంద్రాలు
- ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాల పంపిణీ
- ఉచితంగా ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ
- ప్రత్యేక ఉపాధ్యాయులతో చిన్నారులకు శిక్షణ


ఉపకరణాలతో ప్రత్యేక అవసరాల పిల్లలు


కంచికచర్ల మండల కేంద్రంలోని భవిత కేంద్రం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైకల్యంతో పిల్లలు పుడితే ఆ తల్లిదండ్రుల మనోవేదన అంతా ఇంతా కాదు. బిడ్డలను చూసుకుని అనునిత్యం బాధపడుతుంటారు. ఎదిగేకొద్దీ వారి అవసరాల తీర్చడం కష్టంగా మారుతుంది. రెక్కల కష్టంతో కుటుంబ పోషణ చేసేవారికి దివ్యాంగులు పుడితే ఇక వారి బాధ వర్ణనాతీతం. 'మా తలరాతలు ఇలా ఉంటే వీళ్లకు చదువు ఎందుకు?' అని నిరాశపడే వారు కొందరు. 'వీళ్లకు చదువు ఎవరు చెబుతారు? బడికి పంపితే బాగోగులు పట్టించుకుంటారా? తల్లిదండ్రులమే ఇబ్బందులు పడుతున్నాం' అంటూ ఆలోచించే వారు మరి కొందరు. అటువంటి వారి పాలిట భవిత కేంద్రాలు వరంలా మారాయి. సమగ్ర శిక్ష ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ భవిత కేంద్రాలు ప్రత్యేక అవసరాల పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తున్నాయి. వారికి ఎదుగుదలకు ఊతమిస్తున్నాయి. చక్కటి విద్యాబుద్ధులు నేర్పుతున్నాయి.

2,046 మంది పిల్లలకు శిక్షణ
అందరికీ విద్య ప్రభుత్వ నినాదం. ప్రత్యేక అవసరాల పిల్లలకు విద్య అందితేనే ఆ లక్ష్యం నెరవేరుతుందని భావించిన ప్రభుత్వం వారి కోసం భవిత కేంద్రాలు ఏర్పాటు చేసింది. పాఠశాలకు వెళ్లలేని బుద్ధిమాంద్యం, శారీరక, మానసిక వైకల్యం, వినికిడి లోపం, చూపు లేకపోవడం వంటి పలు రకాల వైకల్యాలతో బాధపడే పిల్లల కోసం భవిత కేంద్రాలు పనిచేస్తున్నాయి. ప్రభుత్వం ఈ కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులను నియమించి వారికి విద్యాబుద్ధులు నేర్పిస్తోంది. విద్యతో పాటు వారు వైకల్యం నుంచి ఉపశమనం పొందేందుకు ఫిజియోథెరపీ, విజన్ థెరపీ, స్పీచ్ థెరపీ వంటి సేవలు అందిస్తోంది. అవసరమైన ఉపకరణాలను ప్రభుత్వమే సరఫరా చేస్తోంది. ఎన్టీఆర్ జిల్లాలో 17, కృష్ణాజిల్లాలో 25 భవిత కేంద్రాలు (ప్రత్యేక అవసరాల పిల్లల వనరుల కేంద్రాలు) పనిచేస్తున్నాయి. వీటిలో ఏడాది నుంచి 18 సంవత్సరాల వయసు లోపు దివ్యాంగులు 2,046 మంది శిక్షణ పొందుతున్నారు. వీరిలో ప్రభుత్వం 192 మందికి ట్రైసైకిల్స్, మరి కొందరికి సంకకర్రలు, వినికిడి యంత్రాలు, బ్రెయిలీ లిపి పలకలు వంటి ఉపకరణాలను ఉచితంగా అందించింది.

ప్లే స్కూల్స్ తరహాలో భవిత కేంద్రాలు
భవిత కేంద్రాల్లో చదువుతోపాటు ప్రత్యేక అవసరాల పిల్లలకు ఆటలు, పాటల్లో ప్లే స్కూల్ తరహాలో ఆల్ రౌండ్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తున్నారు. స్పెషల్ బీఈడీ చేసిన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆటిజంతో బాధపడే పిల్లలు సైతం 20 ఎక్కాలు చెబుతున్నారు. వినికిడి లోపం ఉన్నవాళ్లకు వీడియో చూపి డ్యాన్స్ నేర్పిస్తున్నారు. ఇలా ప్రతి అంశంలోనూ ఉపాధ్యాయులు చక్కటి శిక్షణనిచ్చి వారిలోపాలు మర్చిపోయేలా చేస్తున్నారు. ఒకప్పుడు తమ పిల్లలను చూసి బాధపడిన తల్లిదండ్రులు, ఇప్పుడు వారి ఆటపాటలు, ప్రతిభను మెచ్చుకుని మురిసిపోతున్నారు.

ఫిజియోథెరపీ, మైనర్ శస్త్రచికిత్సలు
భవిత కేంద్రంలో ప్రతివారం ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నారు. వీటికి తోడు శారీరక వైకల్యం, మెదడు పక్షవాతం, గ్రహణం మొర్రి, గ్రహణ శూల, ప్యాలెట్ ఫిస్ట్యులా (పై అంగిలికి రంధ్రం), కంటికి సంబంధించిన వ్యాధులు ఉన్న పిల్లలను గుర్తించి వారికి తేలిక పాటి శస్త్ర చికిత్సలు అందిస్తున్నారు.

సొంతబిడ్డల్లా చూస్తున్నాం



వైకల్యం శాపం కాదు. లోపాలు ఉన్న పిల్లలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నాం. సొంతబిడ్డల్లా చూసుకుంటున్నాం. సాధన చేయిస్తే దివ్యాంగులు కూడా సాధారణ విద్యార్థుల్లానే ప్రతిభ చాటుతారు. శిక్షణకు ప్రత్యేక అవసరాలు పిల్లలు స్పందిస్తున్న తీరు ఆశ్చర్యం కలిగిస్తోంది. భవిత కేంద్రాలకు పిల్లలను పంపుతున్న తల్లిదండ్రులు బిడ్డల ప్రతిభను చూసి సంబరపడుతున్నారు. తల్లిదండ్రులు పిల్లలను చూసి కుంగిపోకుండా భవిత కేంద్రాలకు పంపాలి.

– వెంకట సుధ, ఐఈఆర్‌పీ, విజయవాడ భవిత కేంద్రం

దివ్యాంగులకు ప్రభుత్వ చేయూత



ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తోంది. వారికి అవసరమైన ఉపకరణాలు అందిస్తోంది. వారిని సాధారణ విద్యార్థులకు సమానంగా తీర్చిదిద్దేలా భవిత కేంద్రాల ద్వారా కృషి చేస్తోంది. వినికిడి లోపాలు గల పిల్లలను గుర్తించి ఇంప్లాంట్స్ అందిస్తోంది. ఈ ఏడాది ట్రైసైకిల్స్, సంక కర్రలు, వినికిడి యంత్రాలు, రోలర్స్ వంటివి ఉచితంగా పంపిణీ చేస్తోంది.

– ఎస్.రాంబాబు, కో ఆర్డినేటర్, సమగ్ర శిక్ష

బాధను మర్చిపోతున్నాం



మాది రాజీవ్‌నగర్. మాబాబుకు 12 సంవత్సరాలు, డౌన్‌సిండ్రోమ్‌తో బాధపడుతున్నాడు. డబ్బులు ఖర్చుపెట్టి ప్రైవేటు సెంటర్‌లో పెట్టాను. ప్రయోజనం లేదు. తెలిసిన వాళ్లు చెబితే భవిత కేంద్రానికి పంపుతున్నాను. చక్కటి మార్పు వచ్చింది. అందరు పిల్లలతో కలిసి ఆడుతూ పాడుతూ ఉన్నాడు. వాడు సంతోషంగా ఉండడం చూసి మా బాధను మర్చిపోతున్నాం.

– మహేష్, పేరెంట్, రాజీవ్‌నగర్, విజయవాడ

8న నెమలి దేవస్థానంలో బహిరంగ వేలం
గంపలగూడెం(తిరువూరు): మండలంలోని నెమలి గ్రామంలో వేంచేసిన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో వివిధ అంశాలకు సంబంధించి ఈ నెల ఎనిమిదో తేదీన బహిరంగ వేలం, సీల్డ్ టెండర్ కొటేషన్లు స్వీకరిస్తామని ఆలయ సహాయ కమిషనర్ కె.శాంతి, ఆలయ కమిటీ చైర్మన్ కె.శశిరేఖ సోమవారం తెలిపారు. 2023 జనవరి ఒకటో తేదీ నుంచి ఆలయంలో తలనీలాలు పోగుచేసుకునే హక్కు కోసం ఆ రోజు ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం జరుగుతుందని పేర్కొన్నారు. సర్వే నంబర్ 135, 136లలో 50 సెంట్లను రెండేళ్ల పాటు కౌలుకు ఇచ్చేందుకు కూడా వేలం నిర్వహిస్తామని తెలిపారు. జనవరి ఒకటో తేదీ నుంచి ఏడాది పాటు ఆలయంలో పూజా సామగ్రి, పడితరం మహా నివేదన, లడ్డూ ప్రసాదం, అన్న ప్రసాదం సరుకుల సరఫరా, శానిటేషన్ వస్తువుల సరఫరాకు సీల్డ్ టెండర్, శ్రీ వేణుగోపాలస్వామి, అమ్మవార్లకు నిత్య అలంకరణ, కళ్యాణ మహోత్సవానికి పూలదండలు, మాలలు, విడిపూలు సరఫరా కోసం సీల్డ్ కొటేషన్లు స్వీకరిస్తామని వివరించారు.

పెన్షన్ కానుక 96.92 శాతం పంపిణీ


విజయవాడ కృష్ణలంకలో కోలవెన్ను శకుంతలకు వితంతు పింఛన్ ఇస్తున్న వార్డు సెక్రటరీ యర్ల కృష్ణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో ఐదు రోజుల్లో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ 96.92 శాతం పూర్తయింది. మొత్తం 2,25,834 మంది లబ్ధిదారులు ఉండగా 2,18,885 మందికి పింఛన్ అందింది. జి.కొండూరు మండలంలో అత్యధికంగా 99.48 శాతం, జగ్గయ్యపేటలో 99.39 శాతం, నందిగామలో 99.38 శాతం పింఛన్ల పంపిణీ జరిగింది.

రేపు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

విజయవాడ స్పోర్ట్స్: నగరంలోని ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఈ నెల ఏడో తేదీన జయహో బీసీ మహాసభ కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా సోమవారం తెలిపారు. నగరంలో వాహన రాకపోకలకు అంతరాయం కలగకుండా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. బెంజిసర్కిల్ నుంచి బందరు రోడ్డులోకి, పోలీస్ కంట్రోల్ రూం నుంచి బెంజిసర్కిల్ వైపు, ఐదో నంబర్ రూట్, ఏలూరు రోడ్డులోని సీతారామపురం సిగ్నల్ నుంచి ఆర్‌టీఏ జంక్షన్ వరకు, శిఖామణి సెంటర్ నుంచి బందరు రోడ్డుకు జయహో బీసీ మహాసభకు వచ్చే వాహనాలను మాత్రమే అనుమతి ఇస్తామని స్పష్టం చేశారు.

జాతీయ రహదారులపై..
- హైదరాబాద్–విశాఖపట్నం మార్గంలో ప్రయాణించే వాహనాలు ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, మైలవరం, నూజివీడు, హనుమాన్ జంక్షన్ ద్వారా రాకపోకలు సాగించాలి.
- విశాఖపట్నం–చెన్నై మార్గంలో ప్రయాణించే వాహనాలు హనుమాన్‌జంక్షన్, గుడివాడ, పామర్రు, చల్లపల్లి, రేపల్లె, బాపట్ల, చీరాల, త్రోవగుంట, ఒంగోలు మార్గంలో ప్రయాణించాలి.
- గుంటూరు–విశాఖపట్నం మార్గంలో ప్రయాణించే వాహనాలు బుడంపాడు, తెనాలి, వేమూరు, కొల్లూరు, వెల్లటూరు జంక్షన్, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్‌జంక్షన్ మీదుగా రాకపోకలు సాగించాలి.
- చెన్నై–హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు మేదరమెట్ల, అద్దంకి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ, నార్కెట్‌పల్లి మీదుగా ప్రయాణించాలి.

విజయవాడలో ఇలా..
- విశాఖపట్నం నుంచి వచ్చే బస్సులు రామవరప్పాడు రింగ్, మహానాడు జంక్షన్, బెంజిసర్కిల్ ఫ్లై ఓవర్, స్క్యూ బ్రిడ్జి, వారధి జంక్షన్ మీదుగా పండిట్ నెహ్రూ బస్టాండ్‌కు చేరుకోవాలి.
- పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి విశాఖపట్నం వెళ్లే బస్సులు పీసీఆర్ జంక్షన్, ప్రకాశం విగ్రహం జంక్షన్, పాత గవర్నమెంట్ ఆస్పత్రి, ఏలూరు లాకులు, జీఎస్ రాజురోడ్డు, సీతన్నపేట సిగ్నల్, బీఆర్‌టీఎస్ రోడ్డు, గుణదల, రామవరప్పాడు మార్గంలో ప్రయాణించాలి.
- మచిలీపట్నం, గుడివాడ ప్రాంతాల నుంచి పీఎన్‌బీఎస్‌కు వచ్చే బస్సులు తాడిగడప 100 అడుగుల రోడ్డు, ఎనికేపాడు, రామవరప్పాడు రింగ్, బెంజిసర్కిల్ ఫ్లై ఓవర్, కృష్ణలంక మార్గాన్ని అనుసరించాలి.
- బస్టాండ్ నుంచి మచిలీపట్నం, గుడివాడ ప్రాంతాలకు వెళ్లేటప్పుడు పీసీఆర్, చల్లపల్లి బంగ్లా, ఏలూరు లాకులు, బీఆర్‌టీఎస్‌రోడ్డు, గుణదల, రామవరప్పాడురింగ్, ఎనికేపాడు, తాడిగడప 100 అడుగుల రోడ్డును అనుసరించాలి.
- బెంజిసర్కిల్ వైపు నుంచి బందరు రోడ్డులో ప్రయాణించే వాహనాలు పకీరుగూడెం జంక్షన్, స్క్యూ బ్రిడ్జి, వారధి జంక్షన్ మార్గం ద్వారా పీఎన్‌బీఎస్‌కు చేరుకోవాలి.
- పీఎన్‌బీఎస్ నుంచి ఇబ్రహీంపట్నం వైపు వెళ్లే బస్సులు బస్టాండ్‌లో మధ్యనున్న ఐదో నంబర్ గేటు ద్వారా బయటకు వచ్చి రాజీవ్‌గాంధీ పార్కు, కనకదుర్గ ఫ్లై ఓవర్, స్వాతిజంక్షన్ మార్గాన్ని అనుసరించాలి.

పార్కింగ్ ప్రదేశాలు ఇలా..
- మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీసీ కార్పొరేషన్ల చైర్మన్ల వాహనాలను సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్‌లో నిలపాలి.
- ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల నుంచి సభకు వచ్చే బస్సులను స్వరాజ్య మైదానంలో పార్కు చేయాలి.
- గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, పొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్, నంద్యాల జిల్లాల నుంచి సభకు వచ్చే బస్సులకు సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ మైదానం కేటాయించారు.
- కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి సభకు వచ్చే బస్సులను సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ గ్రౌండ్‌లో నిలపాలి.
- పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల నుంచి సభకు వచ్చే బస్సులను బీఆర్‌టీఎస్ రోడ్డులో నిలపాలి.
- శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి వచ్చే బస్సులకు ఆంధ్రా లయోల కాలేజీ మైదానాలను కేటాయించారు.



• విజైవాడ
హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ సోమవారం విజయవాడలో సందడి చేశారు. మొగల్రాజపురం పీవీపీమాల్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన వస్త్రలహరి షోరూమ్‌ను ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ఆమెను చూసేందుకు అభిమానులు తరలివచ్చారు. అభిమానులతో పాయల్ రాజ్‌పుత్ సెల్ఫీలు దిగి వారిలో ఉత్సాహం నింపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విజయవాడ నగరం అంటే తనకు ఎంతో ఇష్టమన్నారు. మోడ్రన్ డ్రెస్‌ల కంటే చీరలు కట్టుకోవడానికే మొగ్గుచూపుతానని పేర్కొన్నారు. నగరానికి చాలా సార్లు వచ్చానని, ఇక్కడి ప్రజల ఆదరణను మరువలేనని సంతోషం వ్యక్తంచేశారు.

– లబ్బీపేట(విజయవాడతూర్పు)

అర్జీలు పునరావృతం కాకూడదు

- స్పందనలో కలెక్టర్ ఢిల్లీరావు
- సమస్యలపై అందిన 83 అర్జీలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్పందనలో ప్రజలు విన్నవించే సమస్యలపై అధికారులు సత్వరమే స్పందించాలని అధికారులను కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. స్పందనలో అర్జీలు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం జరిగింది. కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు నేరుగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తమ దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం కోసం స్పందనలో అర్జీలు ఇస్తారని పేర్కొన్నారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. వ్యయప్రయాల కోర్చి వచ్చే అర్జీదారుల సమస్యను వినాలని, అపుడే పరిష్కారం లభిస్తుందన్న నమ్మకం వారికి కలుగుతుందని సూచించారు. గ్రామ సచివాలయం, మండలం, డివిజన్ స్థాయిలోనే ప్రజల అర్జీలకు పరిష్కారం చూపాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ముఖ్యమైన అర్జీలు ఇవీ..
- తన భూమి సరిహద్దులు ఆక్రమించి పెన్సింగ్ వేశారని, సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని కోరుతూ జగ్గయ్యపేట మండలానికి చెందిన చెరుకుమల్లి రాధిక స్పందనలో అర్జీ సమర్పించారు. దీనిపై కలెక్టర్ స్పందించి అర్జీదారుని సమక్షంలో వర్చువల్‌గా సంబంధిత తహసీల్దార్‌తో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు.
- వినగడప గ్రామ రెవెన్యూ పరిధిలో అక్రమ మట్టి తవ్వకాలు, ఇటుక బట్టీలపై చర్యలు తీసుకోవాలని గంపలగూడెం మండలం తోటమూల గ్రామానికి చెందిన రామిశెట్టి పుష్పావతి అర్జీ సమర్పించారు. తన పంట భూములకు సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీల వ్యాపారం చేస్తున్నారని, దీనిపై తగు చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు.


స్పందనలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ శ్రీవాస్ నుపూర్ తదితరులు

- ఇటీవల తన కుమారుడు మరణించాడని, మరణ ధ్రువీకరణ పత్రం మంజూరు చేయకుండా రెవెన్యూ అధికారులు కాలయాపన చేస్తున్నారని, తనకు న్యాయం చేయాలని విజయవాడ పెజ్జోనిపేటకు చెందిన వాలితేటి పద్మ అర్జీ ఇచ్చారు.

రెవెన్యూ పరమైన అర్జీలే అధికం
స్పందన కార్యక్రమంలో 83 అర్జీలు అందాయని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. వీటిలో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 33 అర్జీలు అందాయన్నారు. అనంతరం జిల్లాలోని ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లతో వర్చువల్‌గా మాట్లాడిన కలెక్టర్ కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్, డీఆర్వో కె.మోహన్ కుమార్, అసిస్టెంట్ డెప్యూటీ కలెక్టర్లు ఎస్.రామలక్ష్మి, ఖలీఫ్ కౌసర్ బానో, డ్వామా పీడీ కె.సునీత, డీఈఓ సి.వి.రేణుక, ఐసీడీఎస్ పీడీ ఎం.ఉమాదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాలికను లైంగికంగా వేధించిన వ్యక్తికి ఐదేళ్ల జైలు

విజయవాడస్పోర్ట్స్: బాలికలను లైంగికంగా వేధిస్తూ, భయభ్రాంతులకు గురి చేసిన వ్యక్తికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ విజయవాడ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ ఎస్.రజని సోమవారం తీర్పు చెప్పారు. నగరంలోని అజిత్ సింగ్‌నగర్‌లో నివాసం ఉంటున్న 15 ఏళ్ల బాలికను అదే ప్రాంతానికి చెందిన వడియార్ గణేష్ లైంగికంగా వేధించసాగాడు. దీనిపై బాలిక కుటుంబీకులతో పాటు, పరిసరాల్లోని ప్రజలు మందలించినా గణేష్‌లో ఎలాంటి మార్పు రాలేదు. దీంతో గత ఏడాది పోలీసులను ఆశ్రయించి గణేష్‌పై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. బాధితురాలి తరపున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వి.నారాయణరెడ్డి కోర్టుకు వాదనలు వినిపించారు. ఈ కేసులో ఏడుగురు సాక్షులను న్యాయమూర్తి విచారించారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడు గణేష్‌కు జైలు శిక్షతో పాటు రూ. 14 వేలను జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. బాధితురాలికి రూ. 50 వేలు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా లీగల్ సెల్ అథారిటీకి న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

సర్దుబాటుకు సన్నద్ధం

ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా ఏర్పాట్లు

- సర్‌ప్లస్ టీచర్ల లెక్క తీస్తున్న విద్యాశాఖ
- హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్లకు ప్రాధాన్యం
- పారదర్శకంగా వర్క్ అడ్జస్ట్‌మెంట్
- కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక కమిటీ



మచిలీపట్నం: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు దృష్టి సారించారు. అవసరమైన పాఠశాలల్లో యుద్ధ ప్రాతిపదికన ఉపాధ్యాయులు సర్దుబాటు చేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ అత్యవసర ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారులు కార్యాచరణకు దిగారు.

ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి..

ఉమ్మడి కృష్ణా జిల్లాలో మండల పరిషత్, జెడ్పీ, ప్రభుత్వ పాఠశాలలు కలిపి 2,484 ఉండగా, వీటిలో వివిధ కేడర్లకు చెందిన 12,370 ఉపాధ్యాయ పోస్టులు ఉన్నాయి. వీటిలో అత్యధికంగా 5,620 సెకండరీ గ్రేడ్ టీచర్లు ఉన్నాయి. ఎయిడెడ్ పాఠశాలల నుంచి విలీనమైన ఉపాధ్యాయులకు ఇటీవలే ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు. అదేవిధంగా ఇటీవల కాలంలో కొంతమంది ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి ఇచ్చారు. ఈ మొత్తం పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వ యాజమన్యాల పరిధిలోని పాఠశాలల్లో ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయుల వాస్తవ గణాంకాలను లెక్క తీస్తున్నారు.

హైస్కూళ్లకు ప్రాధాన్యం..

ఉమ్మడి కృష్ణా జిల్లాలో ప్రైమరీ, యూపీఎస్, హైస్కూళ్లు కలిపి ఒక కిలోమీటర్ లోపు 445 ఉన్నాయి. వీటిలో ప్రాధాన్యాన్ని బట్టి సమీప స్కూళ్లలో విలీనం చేయనున్నారు. ప్రైమరీలో 388 స్కూళ్లను హైస్కూళ్లగా మ్యాపింగ్ చేశారు. అలాగే మరో 57 యూపీఎస్‌గా మ్యాపింగ్ చేశారు. ప్రైమరీ, యూపీ పాఠశాల నుంచి హైస్కూళ్లలో విలీనం చేసిన చోట సరిపడా ఉపాధ్యాయులు లేరనే విమర్శలు వస్తున్న నేపథ్యంలో దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. హైస్కూళ్లలో ప్రతి సబ్జెక్టుకు తప్పనిసరిగా ఉపాధ్యాయుడు ఉండేలా శ్రద్ధ తీసుకుంటున్నారు.

అర్హత గల ఎస్జీటీలకు అవకాశం..

విలీనమైన పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఇప్పటికే సమీప పాఠశాలల్లో విధులు కేటాయించారు. అయితే ప్రస్తుతం హైస్కూళ్లకు ప్రాధాన్యం ఇవ్వాలనే కమిషనరేట్ నుంచి వచ్చిన ఆదేశాలతో సెకండరీ గ్రేడ్ టీచర్లలో అర్హత గల వారిని గుర్తిస్తున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఏర్పాటైన కమిటీ సర్‌ప్లస్ ఉపాధ్యాయుల జాబితాను పరిశీలన చేసి, అవసరమైన స్కూళ్లలో సర్దుబాటు చేయాలని కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో రెండు జిల్లాలో పరిధిలో ఎక్కడెక్కడ మిగులు ఉపాధ్యాయులు ఉన్నారనే గుర్తిస్తున్నారు.

సర్దుబాట్లపై దృష్టి..



పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉండాలనేది ప్రభుత్వం ఉద్దేశం. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు సర్దుబాటుపై దృష్టి సారించాం. బోధనకు ఆటంకం లేకుండా ఇప్పటికే చాలా చోట్ల ఏర్పాట్లు చేశాం. ప్రస్తుతం హైస్కూళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఎస్జీటీల్లో అర్హత గలవారిని హైస్కూళ్లకు పంపిస్తున్నాం.

– సీవీ రేణుక, డీఈవో, ఎన్టీఆర్ జిల్లా

మంచి నిర్ణయమే..



హైస్కూళ్లలో ఉపాధ్యాయులు కొరత ఉన్న మాట వాస్తవం. విద్యార్థుల చదువుల దృష్ట్యా సర్దుబాటుకు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయటం మంచి పరిణామం. అయితే ఎస్జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా ఇటీవల ఉద్యోగోన్నతి పొందిన వారికి శాశ్వత ప్రదేశాలు ఇవ్వాలి. ఆ తర్వాత ఏర్పడిన ఖాళీల్లో అర్హత గల ఎస్జీటీలకు అవకాశం ఇచ్చినట్లయితే అందరికీ మేలు జరుగుతుంది.


– చేబ్రోలు శరత్ చంద్ర, బీటీఏ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు

హాజరు నమోదులో నిర్లక్ష్యం

- కృష్ణా జిల్లాలో 23 స్కూళ్లపై చర్యలు!
- ఎంఈవో, హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసు

మచిలీపట్నం: విద్యార్థుల హాజరు నమోదులో నిర్లక్ష్యం వహిస్తున్న కృష్ణా జిల్లాలోని 23 స్కూళ్ల ప్రధానోపాధ్యాయులకు, ఆయా మండలాల ఎంఈవోలకు డీఈవో తాహెరా సుల్తానా సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రెండు రోజుల్లోకి సంజాయిషీ ఇవ్వాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇది విద్యాశాఖలో హాట్ టాఫిక్‌గా మారింది. విద్యార్థులందరినీ పాఠశాలలకు రప్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని అన్ని స్కూళ్లలో మొబైల్ యాప్ విధానంలో హాజరు నమోదు చేస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం 10గంటల లోపు తప్పనిసరిగా హాజరు నమోదు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. మొబైల్ యాప్ ద్వారా హాజరు నమోదును రాష్ట్ర స్థాయిలోని ఉన్నతాధికారులు సైతం ప్రతి రోజూ పర్యవేక్షణ చేస్తున్నారు. దీంతో విద్యార్థుల హాజరు నమోదుపై డీఈవో తాహెరా సుల్తానా జిల్లాలోని అన్నిపాఠశాలల హెచ్‌ఎంలను ఇప్పటికే పలుమార్లు హెచ్చరించారు. సోమవారం 10గంటల తరువాత డీఈవో తాహెరా సుల్తానా మొబైల్ యాప్ హాజరుపై పరిశీలన చేశారు. అయితే 23 స్కూళ్లలో విద్యార్థులు హాజరు వేయలేదని గుర్తించారు. పదే పదే హెచ్చరికలు చేసినప్పటికీ, మార్పు లేకపోవటంపై ఆమె తీవ్రంగా పరిగణించారు. దీంతో చర్యలకు ఉపక్రమించారు. పాఠశాల హెచ్‌ఎంలతో పాటు, ఆయా మండలాల విద్యాశాఖాధికారులను సైతం బాధ్యులను చేశారు. పాఠశాలల హెచ్‌ఎం, ఎంఈవోల నుంచి వచ్చిన సంజాయిషీ అనంతరం చర్యలకు ఉపక్రమించే అవకాశం ఉంది.

హరితతోరణం



ప్రకృతిలోని పచ్చదనాన్నంత పరచుకుని రహదారి కొత్తందాలు సంతరించుకుంది.. మనోహరమైన చిగురాకు అందాలతో ఆకర్షిస్తోంది. ఇరువైపులా బారులుగా నిలబడిన హరిత సైన్యంతో వాహనదారుడికి సరికొత్త అనుభూతిని అందిస్తోంది. అందానికే ఆహ్లాదాన్ని పంచేలా ఈ వృక్షాల వయ్యారాలను ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం చిట్యాల గ్రామం శివారు ప్రాంతంలో 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

వైఎస్సార్ హెల్త్ వర్సిటీ కబడ్డీ జట్టు ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్: దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పురుషుల పోటీలకు ప్రాతినిధ్యం వహించే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పురుషుల జట్టును ఎంపిక చేసినట్లు విశ్వవిద్యాలయ క్రీడా విభాగ కార్యదర్శి డాక్టర్ ఇ.త్రిమూర్తులు తెలిపారు. జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ(రాజమండ్రి)కి చెందిన ఎం.శ్రీహరి, వై.వీరహరిప్రసాద్‌రెడ్డి, ఎస్.అనీల్‌కుమార్, సీహెచ్ వెంకట ఉమాచందు, డి.లాలూఅమరనాథ్, ఎం.సాయిఅఖిల్, ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ(చినకాకాని)కి చెందిన కె.పెద్దరామయ్య, ఎం.శ్రీకాంత్, రంగరాయమెడికల్ కాలేజీ(కాకినాడ)కి చెందిన పి.జాయ్‌డిన్, ఇ.జ్యోతిప్రసాద్‌జయరామ్, వీఏపీఎంఎస్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ (విశాఖపట్నం)కు చెందిన సీహెచ్ మౌళి, అనీల్ నీరుకొండ కాలేజ్ ఆఫ్ ఎంఎల్‌టీ(విశాఖపట్నం)కు చెందిన పి.సత్యశేషరావు జట్టుకు ఎంపికై నట్లు చెప్పారు. ఈ నెల ఏడో తేదీ నుంచి బెంగళూరు సిటీ యూనివర్సిటీలో జరిగే పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. జట్టుకు ఎంపికై న క్రీడాకారులను యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ పి.శ్యామ్‌ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు అభినందించారు. ఈ జట్టుకు మేనేజర్‌గా కుమార్‌రాజు, కోచ్‌గా శ్రీనివాసరావు వ్యవహరిస్తారు.

ఏఆర్ ఏడీసీపీగా శ్రీనివాసరావు బాధ్యతలు



విజయవాడ స్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఏఆర్ అడిషనల్ డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(ఏడీసీపీ)గా కె.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీగా పని చేస్తున్న శ్రీనివాసరావుకు ప్రభుత్వం ఇటీవల నాన్ కేడర్ ఏఎస్పీగా ఉద్యోగోన్నతి ఇచ్చి జిల్లా పోలీస్ కమిషనరేట్‌కు ఏడీసీపీగా నియమించింది. బాధ్యతలు తీసుకున్న అనంతరం కమిషనర్ టి.కె.రాణాను మర్యాదపూర్వకంగా కలుసుకుని మొక్కను అందజేశారు.

ఫెన్సింగ్ పోటీల్లో ఎన్టీఆర్ జిల్లాకు రెండు పతకాలు



విజయవాడ స్పోర్ట్స్: కాకినాడలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. శాబర్ అండర్–18 బాలుర వ్యక్తిగత విభాగంలో విజయవాడకు చెందిన వి.రాహుల్ గోల్డ్‌మెడల్ సాధించగా.. బాలికల గ్రూప్ విభాగంలో డి.నాగప్రత్యూష, జి.వాసవి, సీహెచ్ భవాని, ఎస్.రమ్యశ్రీ బ్రాంజ్ మెడల్ సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులు ఆంధ్రప్రదేశ్ ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, కృష్ణమోహన్, కోచ్ డి.నాగరాజు అభినందించారు.

వెంటాడిన మృత్యువు

ఒకే పాము రెండు సార్లు కాటేయడంతో వ్యక్తి మృతి



వీరాంజనేయులు మృతదేహం

గూడూరు(పెడన): ఒక వ్యక్తిని పాము రెండు సార్లు కాటువేయడంతో మృతి చెందిన ఘటన గూడూరు మండలం కంచాకోడూరులో చోటు చేసుకుంది. వివారాలు.. గ్రామానికి చెందిన కోళ్ల వీరాంజనేయులు(37) వ్యవసాయం ఆధారంగా జీవనం సాగిస్తుంటాడు. ఆదివారం సాయంత్రం వరిపొలంలో యంత్రం సహాయంతో వరికోత కోశాక వచ్చిన గడ్డిని మోపులు కడుతుండగా పాము కాటు వేసింది. ఏదో మోడు గుచ్చుకుందనుకుంటూ గడ్డి మోపును ఇంటికి తీసుకువచ్చి వామిగా పోస్తున్నాడు. మోపులోనే నక్కి ఉన్న తాచు పాము వీరాంజనేయులును మళ్లీ కాటేసింది. దీంతో కాలికి గాయమైన ప్రాంతంలో తుండుతో కట్టి, ద్విచక్రవాహనంపై భార్యా కుమారుడిని ఎక్కించుకుని బందరు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాడు. తనను పాము కాటేసిందని వైద్యులకు చెప్పిన వీరాంజనేయులుకు చికిత్స మొదలు పెట్టారు. అప్పటికే విష ప్రభావం శరీరం అంతా వ్యాపించడంతో చికిత్స పొందుతూనే ఆస్పత్రిలో ప్రాణాలు విడిచాడు. గూడూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీరాంజనేయులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

రూ.20 లక్షలు విలువైన బీరు బాటిళ్లు ధ్వంసం



బాటిళ్లను ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో అక్రమంగా తరలిస్తుండగా పట్టుపడిన బీరు సీసాలను సోమవారం సాయంత్రం పోలీస్ స్టేషన్ ఎదుట ధ్వంసం చేశారు. మొత్తం 76 కేసులకు సంబంధించిన 4,374 బీరు బాటిళ్లను రోడ్డు రోలర్‌తో తొక్కించారు. వీటి విలువ సుమారు రూ. 20 లక్షలు ఉంటుందని సీఐ కాశీవిశ్వనాథ్ చెప్పారు. కరోనా లాక్‌డౌన్ నుంచి ఇప్పటి వరకు వివిధ చోట్ల పట్టుబడిన ఈ బాటిళ్లను కోర్టు ఆదేశాలతో ధ్వంసం చేశామని చెప్పారు.

29.5 టన్నుల పీడీఎస్ బియ్యం స్వాధీనం

కృష్ణలంక(విజయవాడతూర్పు): అక్రమంగా తరలిస్తున్న 29.5 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని కృష్ణలంక పోలీసులు స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. మధుబాబు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతను బాపట్లలో 29 టన్నుల 550 కిలోల పీడీఎస్ బియ్యాన్ని సోమవారం తన లారీలో లోడ్ చేసుకుని యానాం తరలిస్తున్నాడు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో వారధి చెక్‌పోస్టు వద్ద లారీని ఆపి తనిఖీ చేశారు. లారీలో 591 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఒక్కొక్క బస్తాలో 50 కిలోల బియ్యం ఉందని గుర్తించారు. లారీని, బియ్యం బస్తాలను సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

15 నుంచి భవానీ దీక్షల విరమణ

- ముమ్మర ఏర్పాట్లు చేస్తున్న దుర్గగుడి అధికారులు
- 8 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా



విజయవాడలో సిద్ధమవుతున్న క్యూలైన్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభమయ్యే భవానీ దీక్షల విరమణకు అవసరమైన ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. 15 నుంచి 19వ తేదీ వరకు అంటే ఐదు రోజుల పాటు నిర్వహించే దీక్షల విరమణకు రాష్ట్ర నలమూలల నుంచే కాకుండా తెలంగాణ, తమిళనాడు, కర్నాటక నుంచి సుమారు 8 లక్షల మంది భవానీ మాలధారులు విచ్చేస్తారని దేవస్థానం, అధికారులు అంచనా వేశారు. భవానీలు, భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలుగకుండా సకల సదుపాయాలను దేవస్థానం కల్పిస్తోంది. ఇప్పటికే క్యూలైన్ల ఏర్పాటు పనులు వేగంగా జరుగుతున్నాయి.

కనకదుర్గనగర్‌లో ప్రసాదం కౌంటర్లు..

కనకదుర్గనగర్‌లో ప్రసాదం కౌంటర్ల ఏర్పాటు పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. హోమగుండాలను ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఇక మహామండపం సమీపంలో భవానీలకు అన్నప్రసాద వితరణకు దేవస్థానం ఏర్పాట్లు చేస్తోంది. ఉత్సవాల్లో భవానీలు కొనుగోలు చేసే లడ్డూ ప్రసాదాల తయారీకి దేవస్థానం ప్రత్యేక చర్యలు చేపట్టింది. గత ఏడాది సుమారు 12 లక్షల లడ్డూలను విక్రయించారు. ఈ ఏడాది 15 లక్షల లడ్డూలను విక్రయించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్రసాదాల విక్రయం కోసం కనకదుర్గనగర్‌లో పది ప్రసాదాల కౌంటర్లు ఏర్పాటు చేశారు. రైల్వేస్టేషన్, బస్టాండ్, ఘాట్‌రోడ్డులో వీఐపీల కోసం ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం 13 కౌంటర్లలో లడ్డూ ప్రసాదాలు భవానీలకు అందుబాటులో ఉంటాయి.

గత రెండేళ్ల కంటే ఎక్కువగానే...

కరోనా నేపథ్యంలో గత రెండేళ్ల కంటే ఈ ఏడాది భవానీల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని దేవస్థానం భావిస్తోంది. దీక్షల విరమణ గురువారం ప్రారంభమై సోమవారంతో ముగుస్తుంది. తొలి రెండు రోజులు దీక్షల విరమణకు విచ్చేసే భవానీల సంఖ్య అంతంత మాత్రంగానే ఉండే అవకాశం ఉంది. మూడో రోజు శనివారం కావడంతో ఆ రోజున భవానీలు విశేషంగా తరలివస్తారని, ఇక నాల్గో రోజు ఆదివారం కావడంతో ఇతర ప్రాంతాల నుంచి విచ్చేసే భవానీలకు తోడు విజయవాడ నగరానికి చెందిన భక్తులు, సాధారణ ప్రజలు సైతం గిరి ప్రదక్షిణ చేసే అవకాశం ఉంది. ఆదివారం ఒక్క రోజే నాలుగు లక్షల మంది గిరి ప్రదక్షిణ చేసే అవకాశం ఉంటుందని పోలీసులు అంచనావేశారు. ఇక ఐదో రోజు సోమవారం ఉదయం 11 గంటలకు పూర్ణాహుతితో దీక్షల విరమణ పరిసమాప్తమవుతుంది. ఆ రోజు రద్దీ నామమాత్రంగానే ఉండే అవకాశం ఉంటుంది. ఈ ఏడాది ఉత్సవాల్లో మూడు, నాలుగు రోజులే అత్యంత కీలకమని ఇటు దేవస్థానం, అటు రెవెన్యూ, పోలీసు విభాగాలు అంచనా వేస్తున్నాయి.

800 షవర్లు ఏర్పాటు..

భవానీలు పుణ్యస్నానాలు ఆచరించేందుకు 800 షవర్లు ఏర్పాటు చేస్తున్నారు. సీతమ్మ వారి పాదాల వద్ద 500, పున్నమీ ఘాట్‌లో 200, భవానీ ఘాట్‌లో వంద షవర్లు ఏర్పాటు చేస్తున్నారు. గత ఏడాది మూడు స్నానఘాట్లలో 500 షవర్లు ఏర్పాటు చేయగా, ఈ ఏడాది మరో 300 అదనంగా ఏర్పాటు చేస్తున్నారు. ఇక కేశఖండనశాలలో మొత్తం 850 మంది నాయీబ్రాహ్మణులు అందుబాటులో ఉంటారు.

255 సీసీ కెమెరాలు..

దీక్ష విరమణలకు విచ్చేసే భవానీలకు ఎటువంటి ఇబ్బందులూ కలుగకుండా దేవస్థానం ప్రత్యేకంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తోంది. టోల్‌గేట్, ప్రధాన ఆలయం, శివాలయం, కనకదుర్గనగర్, మహా మండపం, కేశ ఖండనశాలలు, దుర్గాఘాట్, లడ్డూ ప్రసాదం కౌంటర్లు, జమ్మిదొడ్డిలో మొత్తం 55 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం దేవస్థానంలో సుమారు రెండు వందల సీసీ కెమెరాలు పని చేస్తున్నాయి. దీంతో దీక్ష విరమణలకు మొత్తం 255 సీసీ కెమెరాలు నిరంతరం పర్యవేక్షిస్తాయి.

8.50 లక్షల వాటర్ ప్యాకెట్లు

రాష్ట్ర నలుమూలల నుంచి దీక్ష విరమణలకు విచ్చేసే భవానీల కోసం దేవస్థానం 8.50 లక్షల వాటర్ ప్యాకెట్లు సిద్ధం చేస్తోంది. క్యూలైన్లతో పాటు గిరి ప్రదక్షిణ మార్గాలు, స్నానఘాట్లు, ప్రసాదం కౌంటర్లలో వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

క్లుప్తంగా

మధుసూదనరావుకు అభినందనలు



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): తమ కళాశాలల్లో సీనియర్ ఇన్‌స్ట్రక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ మధుసూదనరావు ఏపీ ఎన్జీఓ నగర శాఖ ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం చాలా సంతోషంగా ఉందని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి పేర్కొన్నారు. రమేష్ ఆస్పత్రి రోడ్డులోని కళాశాల ఆవరణలో పాలిటెక్నిక్ కళాశాలలోని వివిధ ట్రేడ్‌ల విభాగాధిపతులు కె.విజయభాస్కర్, బీమా నాయక్, ఎంబీఎస్ ప్రసాద్, రమణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రీదిమ, ఆఫీస్ సూపరింటెండెంట్ శ్రీదేవితో పాటుగా కళాశాల సిబ్బంది పుల్లయ్య, అమిద్, దుర్గారావు సోమవారం మధుసూదనరావును అభినందించారు.

క్రికెట్ నెట్స్, టెన్నికాయిట్ కోర్టు ఏర్పాటు



విజయవాడ స్పోర్ట్స్: నగరంలోని ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కో ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రికెట్ నెట్స్, టెన్నికాయిట్ కోర్టులను ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ, ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ బి. శ్రీధర్ ప్రారంభించారు. విద్యుత్ సంస్థల ఉద్యోగుల కోసం ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ స్పోర్ట్స్ కౌన్సిల్ వీటిని ఏర్పాటు చేసింది. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎండీలు పృథ్వీతేజ్, మల్లారెడ్డి, జెన్‌కో డైరెక్టర్లు సయ్యద్ రఫీ, బి.వెంకటేశ్వరరెడ్డి, ట్రాన్స్‌కో డైరెక్టరు భాస్కర్ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో చిన్నారుల ప్రతిభ



విజయవాడ స్పోర్ట్స్: సీఎం కప్ ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో విజయవాడ చిన్నారులు ప్రతిభ కనబర్చారు. గుంటూరులో ఈ నెల నాల్గవ తేదీన జరిగిన ఈ పోటీల కటా విభాగంలో పి.శరణ్య, ఎం.జ్యోషిత, సి.చదుర్వేద్, ఎం.ప్రభు, ఎం.ప్రణతి, కె.చాందినిశివలక్ష్మీ మొదటి స్థానం సాధించారు. కటా విభాగంలో పి.హర్షిత మొదటి స్థానం, పి.అనంత సాయి, కె.అనురూప్, ఎం.జోగేశ్వర్, పి.మణికంఠ రెండో స్థానం, వి.విహాన, ఎం.కార్తికేయ, ఎ.సాహితిరెడ్డి, సి.లోహిత్ మూడో స్థానాన్ని సాధించారు. స్టూడెంట్స్ కోపూకన్ కరాటే క్లబ్ ఏపీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ టి.వాసు క్రీడాకారులను అభినందించారు.

తుది దశకు చేరుకున్న రోడ్డు విస్తరణ పనులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ రామకృష్ణాపురం దేవీనగర్ రోడ్డు విస్తరణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఇప్పటికే రోడ్డును రెండు మీటర్ల మేర రోడ్డు మార్జిన్లను విస్తరించారు. ఇప్పుడు విస్తరించిన ప్రాంతంలో సోమవారం రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న రోడ్డు పనులు పూర్తికానుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ యూజీడీ పైప్‌లైన్‌లను సైతం మార్చి లీకేజీలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపింది.

పౌష్టికాహారంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



భోజనం చేస్తున్న బాలింతతో ముచ్చటిస్తున్న కార్పొరేటర్ గంగ

భవానీపురం(విజయవాడ పశ్చిమ): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగ అన్నారు. డివిజన్‌లోని కేఎల్ రావునగర్ లోగల అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమంలో ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాల వయసుగల పిల్లలకు అందించే బాలామృతం, కోడి గుడ్లు, పాలను ఆమె పంపిణీ చేశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి భోజనం చేస్తున్న గర్భిణులు, బాలింతలతో ముచ్చటించారు. భోజనం రుచి ఎలా ఉందీ..అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వ మెనూ ప్రకారం అన్నీ అందిస్తున్నారా, ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అంటూ వారిని ఆరా తీశారు.

తాగునీటి సరఫరాకు నూతన పైప్‌లైన్ ఏర్పాటు

రూ.కోటితో పనులు



నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి పైపులైను

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): అది మొగల్రాజపురంలోని కొండ ప్రాంతం. నీటి చుక్క విలువ ఈ ప్రాంత వాసులకు బాగా తెలుసు. అయితే నీటి సరఫరా పైపుల నుంచి నీరు లీకై వృథా అవుతున్నా ఏమీ చేయలేని పరిస్థితి. బిందె తాగునీటి కోసం కష్టాలు పడాల్సిందే. గతంలో ఎప్పుడో 25 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన తాగునీటి పైపుల నుంచి తాగునీరు వృథాగా పోతుండేవి. అప్పటి టీడీపీ పాలకుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు. పైపుల లీకుల వల్ల తాగునీరు వృథా కావడమే కాకుండా కొండ పై భాగాలకు నీరు సక్రమంగా అందేది కాదు. నీటి కుళాయిల నుంచి సన్నటి ధార వచ్చేది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తూర్పు నియోజకవర్గంలోని కొండ ప్రాంతాల్లోని మౌలిక సౌకర్యాలైన తాగునీరు, విద్యుత్, మెట్లు, రోడ్ల నిర్మాణాలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి నిధులు కేటాయించి పనులు పూర్తి చేస్తున్నారు. అందులో భాగంగానే ఆరో డివిజన్ పరిధిలోని మారుతీనగర్, బాల భాస్కర్ నగర్, అమ్మవారి గుడి రోడ్డు, గుమ్మడి వారి వీధుల్లో ప్రాంతాల్లో సుమారు రూ.కోటి వ్యయంతో ఈ ప్రాంతాల్లో ఎప్పుడో అమర్చిన తాగునీటి సరఫరా పైపులైన్లను తొలగించి, నూతన పైపులను చేపట్టారు. కొన్ని ప్రాంతాల్లో పనులు పూర్తి కావడమే కాకుండా మరి కొన్ని ప్రాంతాల్లో పనులు వేగంగా జరుగుతున్నాయి.

స్పందన అర్జీలను వెంటనే పరిష్కరించాలి

కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



అర్జీలను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ఆయన 23 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆయా సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్పందన కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి 14, ఇంజినీరింగ్ సెక్షన్‌లో 5, ప్రజారోగ్యం విభాగానికి చెందిన 2, యూసీడీ ఒకటి, రెవెన్యూకు సంబంధించి ఒక అర్జీ వచ్చింది. కార్యక్రమంలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ ఇంజనీర్ ఎం ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రత్నావళి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) శకుంతల, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) డీ వెంకటలక్ష్మి, సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు. కాగా జోనల్ కమిషనర్లు నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సర్కిల్–3 కార్యాలయంలో ఇంజినీరింగ్ విభాగం –1, పట్టణ ప్రణాళిక విభాగం –1, సర్కిల్–1, సర్కిల్–2 కార్యాలయాల పరిధిలో ఎటువంటి అర్జీలు అందలేదని కమిషనర్లు తెలిపారు.

'జయహో బీసీ మహాసభ'కు తరలిరండి

ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా, కార్పొరేటర్ షాహీనా సుల్తానా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): జయహో బీసీ మహాసభకు తరలి రావాలని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో తలపెట్టిన జయహో బీసీ మహాసభ వాల్‌పోస్టర్లను సింగ్‌నగర్ డాబా కొట్లు సెంటర్‌లోని తన కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్సీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ బీసీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు బీసీల అభ్యున్నతి కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ఎంతో గొప్పవన్నారు. బీసీలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నకు అమితమైన ప్రేమ అని పేర్కొన్నారు. బీసీలలోని అన్ని కులాలకు సముచితస్థానం కల్పించి, వారి జీవన స్థితిగతులను మార్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. బీసీల హక్కులను కాలరాసే టీడీపీ వంటి అవకాశవాద పార్టీలకు బుద్ధి చెప్పేలా, మన బీసీల సంక్షేమాభివృద్ధికోసం అధిక ప్రాధాన్యం ఇచ్చే మన జగనన్న పాలన గురించి చాటిచెప్పేందుకు చేపట్టిన జయహో బీసీ మహాసభకు రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాదిగా బీసీలు తరలిరావాలని పిలుపునిచ్చారు. 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహీనా సుల్తానా, హజ్‌కమిటీ డైరెక్టర్ ఈఖాదుల్లా పాల్గొన్నారు.

ఆశ వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి



మాట్లాడుతున్న ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని ఆశ వర్కర్లందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మీ ప్రభుత్వాన్ని కోరారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో సీఐటీయూ తూర్పు నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఎన్టీఆర్ జిల్లా ఆశ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) 5వ మహాసభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ధనలక్ష్మీ మాట్లాడుతూ ఆశ వర్కర్లకు ఫేస్ రీడింగ్ నిర్ణయాన్ని వెంటే వెనక్కి తీసుకోవాలని, సంబంధం లేని పనులు చేయించరాదన్నారు. 60 సంవత్సరాలు నిండిన ఆశావర్కర్లకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇచ్చి రిటైర్ చేయాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ నెల 12,13 తేదీల్లో విజయనగరంలో రాష్ట్ర మహాసభలు జరుగుతాయని, ఈ సభలో ఆశావర్కర్లు ఎదుర్కొనే సమస్యలపై భవిష్యత్ కర్తవ్యాలను, ఆందోళన పోరాటాలను నిర్ణయించనున్నట్లు పేర్కొన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 15,16 తేదీల్లో ఎన్టీఆర్ జిల్లా సీఐటీయూ 11వ మహాసభలు విజయవాడలో జరుగుతాయన్నారు. 15న బహిరంగ సభ, ర్యాలీ ఉంటుందని, ఈ ర్యాలీలో ఆశావర్కర్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం 25 మందితో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పి.జ్యోతి, ఎ.కమల, కోశాధికారిగా పి.శ్రీలక్ష్మీ, కార్యదర్శులుగా ఇ.కమల, దుర్గాలక్ష్మీ, చంద్రకళ, ఉపాధ్యక్షులుగా నాగేశ్వరి, కుమారి, నాగమణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, సీఐటీయూ తూర్పు నగర కమిటీ కార్యదర్శి కోటిబాబు, ఆశావర్కర్స్ యేనియన్ కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి పి.ధనశ్రీ పాల్గొన్నారు.

నర్తన గణపతిం... పాలయే



నృత్య ప్రదర్శన

విజయవాడ కల్చరల్: నాట్యవేద(అకాడమీ ఆఫ్ మ్యూజిక్ అండ్ డాన్స్) ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల సంగీత కళాశాలలో సోమవారం చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి అంశాలు ఆకట్టుకున్నాయి. జంగం మనీషా చక్రవర్తి,శిరీషా చక్రవర్తి నృత్య పర్యవేక్షణలో కూచిపూడి నాట్యసంప్రదాయంలోని ప్రధాన అంశమైన పూర్వరంగంతో ప్రారంభించి నర్తనగణపతిం పాలయే, జతిస్వరం, భామాకలాపంలోని లేఖ అంశం, బృందావనం, పంతములాడెదమా, చెక్కరకలిపిన తీయని కమ్మని తోడు పెరుగు తెలుగు, మద్దుగారే యశోద అంశాలను చిన్నారులు ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలుగు సంస్కృత అకాడమీ సభ్యుడు డాక్టర్ కప్పగంతు రామకృష్ణ మాట్లాడుతూ భారతీయ నృత్య సంప్రదాయాలలో కూచిపూడి తలమానికమైనదని నాట్యగురువుల ఆశీస్సులతో విశ్వవాప్తమైదని, తెలుగు వారి పేరు చెప్పగానే కూచిపూడి నాట్యం గుర్తుకు వస్తుందని తెలిపారు. కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనుగుంట్ల శ్రీనివాస్, మారి స్టెల్లా మహిళా కళాశాల సంస్కృత అధ్యాపకుడు డాక్టర్ ధూళిపాళ రామకృష్ణ, తొలి తెలుగు దివ్వె అధ్యక్షురాలు పిల్లి లక్ష్మీతులసి చిన్నారులను అభినందిస్తూ ప్రసంగించారు.

రూ. 4.30 లక్షలతో రోడ్డు పనులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): డివిజన్‌లో దెబ్బతిన్న రోడ్లు, డ్రెయిన్ల మరమ్మతులకు రూ.4.30 లక్షలు ఖర్చు చేయనున్నట్లు 48వ డివిజన్ కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని వల్లీ వీధిలోని పలు ప్రాంతాల్లో రోడ్డు మరమ్మతు పనులను సోమవారం పూజా కార్యక్రమాలను నిర్వహించి ప్రారంభించారు. డివిజన్‌లోని కొండ ప్రాంతాల్లో దెబ్బతిన్న మెట్లు, డ్రెయిన్లకు మరమ్మతులు చేపట్టినట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు.

హమాలీలకు ఎగుమతి కూలి రేటు పెంచాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): హమాలీలకు ఎగుమతి కూలి రేటు రూ.700 నుంచి రూ.1,000 పెంచాలని హమాలీ యూనియన్స్ ప్రతినిధులు జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావుకు వినతి పత్రం అందజేశారు. లేనిపక్షంలో ఈ నెల 10వ తేదీ నుంచి సమ్మె చేపట్టనున్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. హమాలీలకు ఎగమతి కూలి రేటు ఒప్పందం గతేడాది మే నెలలో సిగ్నా కంపెనీ కాంట్రాక్టర్‌తో ఏపీఎస్‌బీసీఎల్ అధికారుల సమక్షంలో చేసుకోవడం జరిగిందన్నారు. ఒప్పందం కాల పరిమితి అక్టోబర్ 31, 2021 నాటికి ముగిసిందని తెలిపారు. ఆ తర్వాత కొత్త కూలి రేటు అమలు జరగాల్సి ఉందని పేర్కొన్నారు. పలు దఫాలు చర్చలు జరిపినా ఫలితం లేదని, మధ్యలో సమ్మె ఆలోచనను కూడా వాయిదా వేసుకున్నామని తెలిపారు. ఈ నెల 10వ తేదీ లోగా నిర్ణయం తీసుకోకపోతే సమ్మెకు వెళతామని యూనియన్ ప్రతినిధులు పేర్కొన్నారు.

డీఆర్‌యూసీసీ సభ్యుడిగా బాల నారాయణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ (డీఆర్‌యూసీసీ) సభ్యుడిగా విజయవాడ భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్‌కు చెందిన కాకు బాల నారాయణ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు సీనియర్ కమర్షియల్ మేనేజర్/ డీఆర్‌యూసీసీ సెక్రటరీ నుంచి లెటర్ అందుకున్నట్లు బాల నారాయణ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దక్షిణ కోస్తా రైల్వే ప్రయాణికుల సంక్షేమ సంఘం ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తాను అందిస్తున్న సేవలను గుర్తించి డీఆర్‌యూసీసీ సభ్యుడిగా నియమించటానికి కారకులైన వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ బోర్డ్ చైర్మన్ విజయసాయిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలియజేశారు. దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ ప్రయాణికుల సమస్యలను ఎప్పటికప్పుడు డీఆర్ఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా బాల నారాయణ యాదవ్‌ను దక్షిణ కోస్తా రైల్వే ప్రయాణికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ అభినందించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌లోని రోమన్ కథోలిక్ మిషన్ (ఆర్‌సీఎం) ఆలయంలో సోమవారం సాయంత్రం సెమీ క్రిస్మస్, దివ్య బలి పూజ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రెవరెండ్ ఫాదర్ మెరుగుమాల చిన్నప్ప రక్షణమూర్తి బాల యేసు జన్మ రహస్యం వెనుక ఉద్దేశాన్ని భక్తులకు వివరించారు. బైబిల్ గ్రంథంలోని పలు దేవుని వాక్యాలను వినిపించారు. ప్రతి ఒక్కరూ పరిశుద్ధాత్మతతో ఇతరులపట్ల ప్రేమ, కరుణ, జాలి చూపాలని, తద్వారా యేసు కృపకు పాత్రులవుతారని పేర్కొన్నారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు తమ నృత్య ప్రదర్శనలతో అలరించారు. అనంతరం విన్సెంట్ పాల్ సొసైటీ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షురాలు జక్కుల ఇందిర, సభ్యులు కలిసి వారు దత్తత తీసుకున్న కుటుంబాల సభ్యులకు నిత్యావసర సరుకులతోపాటు చీరెలు, దుప్పట్లు పంచిపెట్టారు.

సత్వర వైద్యం అందించండి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని



పటమట యూపీహెచ్‌సీలో తనిఖీలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే వారికి సత్వర వైద్య సేవలందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ మాచర్ల సుహాసిని ఆదేశించారు. ఆమె సోమవారం పటమట 1, 2 పట్టణ ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రికార్డులు, మందుల నిల్వ, స్టోర్‌రూమ్, ల్యాబొరేటరీలను పరిశీలించారు. ఆస్పత్రికి వస్తున్న రోగుల రికార్డును తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసరాలు, పరిశుభ్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే వ్యాధిగ్రస్తులకు తక్షణ వైద్యం అదేలా సిబ్బంది వైద్యులు కృషి చేయాలన్నారు. అవసరమైన వారికి రక్తపరీక్షలు చేయాలని సూచించారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో 64 రకాల రక్తపరీక్షలు అందుబాటులో ఉన్నాయని తలిపారు.

నిధులపై సమీక్ష

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సీనియర్ అసిస్టెంట్స్‌తో సోమవారం తన కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని సమీక్ష చేశారు. ఈ సందర్భంగా గ్రామీణ ఆరోగ్య మిషన్ నిధులు మంజూరు, వినియోగం, పాటించాల్సిన నియమ నిబంధనలపై సమీక్షించారు. ఆయా పీహెచ్‌సీలలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంల ఖాళీలు, రిక్రూట్‌మెంట్ వంటి అంశాలపై చర్చించారు. ఆస్పత్రి అభివృద్ధి నిధులు సక్రమంగా వినియోగించాలన్నారు. ఆడిటింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సింగిల్ నోడల్ అకౌంట్ నిర్వహణ ద్వారా మాత్రమే నిధులు ఉపయోగించాలన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్, ఎనీమియా ముక్త్‌భారత్ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జాతీయ గ్రామీణ అకౌంట్స్ అధికారి విజయ్, డాక్టర్ బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

స్క్యూబ్రిడ్జికి మరమ్మతులు చేపట్టండి



కింద భాగంలో దెబ్బతిన్న బ్రిడ్జి

ఆటోనగర్(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థపరిధిలో శిథిలావస్థకు చేరకున్న స్క్యూబ్రిడ్జికు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. బ్రిడ్జి కింది భాగం భాగం ఇనుప చువ్వలతో దర్శనమిస్తోంది. విజయవాడ నగరంలోని 16వ జాతీయరహదారి మీద సుమారు 50ఏళ్లకు పైగా తూర్పు వైపు ఈ బ్రిడ్జిని నిర్మించారు. పై భాగం చూసేందుకు బాగా ఉన్నప్పటికి .. కింద భాగం పెచ్చులు పెచ్చులుగా సిమెంట్ ఊడిపోతోంది. స్లాబ్ ఇనుప చువ్వలు దర్శనమిస్తున్నాయి. 1950–60 సంవత్సరాల మధ్య ఈ బ్రిడ్జి నిర్మించారని మాజీ కార్పొరేటర్ బహుదూర్ చెబుతున్నారు. ఇంత వరకు మరమ్మతులు చేయలేదని, సంబంధింత జాతీయ రహదారి అధికారులు ఈ బ్రిడ్జిని పరిశీలించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

సహజ వనరులను పరిరక్షించుకుందాం



సాయిల్‌ను కాపాడుకుందామంటూ ర్యాలీ చేస్తున్న స్టెల్లా విద్యార్థినులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): సహజ వనరుల పరిరక్షణ మనందరి బాధ్యత అని మారీస్ స్టెల్లా కళాశాల ప్రిన్సిపాల్ జసింతా క్వాడ్రస్ అన్నారు. ప్రపంచ సాయిల్‌డేను పురస్కరించుకుని ఆ కళాశాల అగ్రికల్చర్, రూరల్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సహజ వనరుల పరిరక్షణ, నేలకోత, భూక్షయం వంటి భావనల గురించి విద్యార్థినులకు తెలియజేశారు. నేత రకాలు, లక్షణాలు, ప్రయోజనాలు, సంరక్ష వంటి అవశాలపై అవగాహన కలిగించారు. అనంతరం ప్లకార్డులు చేతపట్టి ర్యాలీ చేశారు. ప్రిన్సిపాల్ జసింతా క్వాడ్రస్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా సాయిల్ డే గురించి చర్చిస్తున్నారన్నారు. ఆరోగ్యకరమైన నేలలు, పర్యావరణ వ్యవస్థ, పటిష్టంగా ఉండాలంటే సహజ పద్ధతులలో నేలనే సేద్యం చేయడం జరగాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ రూరల్ డెవలప్‌మెంట్ విభాగాధిపతి పరసా లక్ష్మణస్వామి, అధ్యాపకులు చిన్నయ్య, మనోజ్, మణికంత, సుమగ్రేస్, ప్రియాంక, ఇమ్మానియేలు పాల్గొన్నారు.

సంగీత కళానిధి పారుపల్లి



సూరిబాబుకు సునాధ సుధానిధి పురస్కారం అందజేస్తున్న సుధాకర్, రామచంద్రరావు,గౌరీనాథ్

విజయవాడ కల్చరల్: సంగీత కళానిధి, గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్యపంతులు అని స్వరఝరి అధ్యక్షుడు టీఎస్ రామచంద్రరావు అన్నారు. గాయక సార్వభౌమ సంగీత పరిషత్ ఆధ్వర్యంలో శివరామకృష్ణ క్షేత్రంలోని శ్రవణ సదనంలో సోమవారం సంగీత విద్వాంసుడు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 139 జయంతి వేడుకలు, మల్లాది సూరిబాబుకు సునాధ సుధానిధి పురస్కారం, ఐదురోజులపాటు నిర్వహించే సంగీత మహోత్సవాలను సోమవారం ఆయన ప్రారంభించారు. రామచంద్రరావు మాట్లాడుతూ నగరానికి చెందిన పారుపల్లి అనేక మందికి విద్యనందించారన్నారు. అదే పరంపర కొనసాగుతోందన్నారు. అధ్యాపకురాలు బాల్రాంత్రపు ప్రసూన పారుపల్లి సంగీత సేవలను వివరించారు. పోవూరి గౌరీనాథ్ పురస్కార గ్రహీత మల్లాది సూరిబాబు సంగీత సేవలను వివరించారు. సంగీత విద్వాంసుడు ఆకాశవాణి విశ్రాంత ప్రయోక్తకు పారుపల్లి జయంతి సందర్భంగా సునాధ సుధానిధి బిరుదు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్వరఝరి కార్యదర్శి మోదుమూడి సుధాకర్, అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్ పాల్గొన్నారు. సంగీత కార్యక్రమంలో భాగంగా మల్లాది సూరిబాబు సంప్రదాయ కీర్తనలను ఆలపించారు. మల్లాది శివానంద్, మల్లాది సాయి దీక్షిత్ సహకార గాత్రం అందించారు. వయోలిన్‌పై చెన్నైకి చెందిన ఎల్. రామకృష్ణన్, మైసూరుకు చెందిన టంకూర్ రవిశంకర్ మృదంగంపై, ఘటంపై ఎం హరిబాబు సహకరించారు.

నట గ్రంథాలయం.. మహానటి సావిత్రి



పేదలకు దుస్తులను పంపిణీ చేస్తున్న గుప్తా

విజయవాడ కల్చరల్: నడిచే నట గ్రంథాలయం మహానటి సావిత్రి అని ప్రముఖ న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. ఏపీ వైఎస్సార్ సాంస్కృతిక క్రీడలు, సినిమా సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్ ఎస్‌కేపీవీ ట్రస్ట్ కార్యాలయంలో సోమవారం సినీనటి, దర్శకురాలు, నిర్మాత సావిత్రి 85 జయంతి వేడుకలు, పేదలకు వస్త్రదానం, బాల బాలికలకు పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గుప్తా మాట్లాడుతూ తెలుగు సినిమా చరిత్రలో సావిత్రి యుగం స్వర్ణయుగమని అన్నారు. నగరంతో సావిత్రికి విడదీయలేని అనుబంధం ఉందన్నారు. గతంలో హైదరాబాద్ కళాభవన్‌లో దాసరి నారాయణరావు, సావిత్రికుమార్తె విజయ చాముండీశ్వరి చేతులమీదుగా అందుకున్నానని, తన జీవితంలో మరచిపోలేని సంఘటనగా అభివర్ణించారు. నిర్వాహకులు పేదలకు వస్త్రాలను బాల బాలికలకు పండ్లను అందించారు. సావిత్రి చిత్రపటానికి పూలమాలలు వేశారు. సంస్థ అధ్యక్షుడు పీ వెంకన్న మాట్లాడుతూ ప్రతి ఏటా జయంతి వేడుకలను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రభలశ్రీనివాస్, పీ రవికుమార్, వసంతకుమార్, ఏడుకొండలు, జానీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎక్సెల్ ప్లాంట్‌ను మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ప్లాంట్ ఆవరణలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ప్లాంట్‌లో జరుగుతున్న కార్యాలయం, స్టోర్ రూమ్, డ్రైవర్స్ రూమ్, నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. అదే విధంగా ప్లాంట్ ఆవరణలో నిర్మిస్తున్న రోడ్ల పనులను వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎక్సెల్ ప్లాంట్‌లో ఉన్న ఐకానిక్ పార్క్‌లో జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎక్సెల్ ప్లాంట్‌కు చెత్తను తీసుకొచ్చిన ట్రాక్టర్లను పరిశీలించి నగరంలో కొబ్బరి బొండాల విక్రయదారులు పారవేసిన బొండాలను నేరుగా కాకుండా నాలుగు ముక్కలుగా కట్ చేసిన వాటిని మాత్రమే ప్లాంట్‌కు తరలించే విధంగా చూడాలని సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లందరూ విధిగా వారి వార్డులలోని కొబ్బరి బొండాల వ్యాపారులతో మాట్లాడి బొండాలను ముక్కలు ముక్కలుగా చేసి ఇవ్వాలని వివరించాలన్నారు. అలాగే చెత్తతోపాటుగా కాకుండా చెట్ల కొమ్మలను వేరుగా తీసుకొచ్చి ప్లాంట్‌లోని ఉడ్ చాపర్ మిషన్ ప్లాంట్‌కు అందజేయాలని సూచించారు. ఈ సందర్భంగా ప్లాంట్ ఆవరణలోగల సమస్యలను గుర్తించిన ఆయన వాటిపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు.

ఆ చార్జిషీట్‌ను మా ముందుంచండి

- ఎమ్మెల్సీ డ్రైవర్ హత్యకేసులో పోలీసులకు హైకోర్టు ఆదేశం
- తదుపరి విచారణ 7కి వాయిదా



సాక్షి, అమరావతి: డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్యకేసులో ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్‌పై కింది కోర్టులో దాఖలు చేసిన చార్జిషీట్ కాపీని తమ ముందుంచాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. సుబ్రహ్మణ్యం హత్యకేసును సీబీఐ దర్యాప్తునకు ఆదేశించేముందు నిందితుడు అనంత ఉదయభాస్కర్ వాదన వినాల్సిన అవసరం ఉందని ప్రాథమికంగా అభిప్రాయపడింది. ఒకవేళ అలా నిందితుడి వాదన వినాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు చెప్పి ఉంటే, అందుకు సంబంధించిన తీర్పు కాపీలను తమ ముందుంచాలని పిటిషనర్ న్యాయవాదిని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 7కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. తమ కుమారుడు సుబ్రహ్మణ్యం హత్యకేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించేలా ఆదేశాలివ్వాలంటూ మృతుడి తల్లిదండ్రులు నూకరత్నం, సత్యనారాయణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై సోమవారం న్యాయమూర్తి జస్టిస్ రఘునందన్‌రావు విచారించారు. పిటిషనర్ల న్యాయవాది జడా శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. నిందితుడు అధికార పార్టీ ఎమ్మెల్సీ కావడంతో పోలీసులు నిష్పాక్షికంగా దర్యాప్తు చేయడం లేదని చెప్పారు. అందువల్ల ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమయంలో నిందితుడిని ఈ వ్యాజ్యంలో ఎందుకు ప్రతివాదిగా చేర్చలేదని, ఉదయభాస్కర్ వాదనలు వినకుండా సీబీఐ దర్యాప్తునకు ఎలా ఆదేశించగలమని న్యాయమూర్తి ప్రశ్నించారు. సీబీఐ వంటి సంస్థలు దర్యాప్తును సక్రమంగానే చేస్తాయని, అందువల్ల నిందితుడిని ప్రతివాదిగా చేర్చాల్సిన అవసరం లేదని శ్రవణ్‌కుమార్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పులు న్నాయన్నారు. ప్రభుత్వ న్యాయవాది (హోం) వి.మహేశ్వరరెడ్డి వాదనలు వినిపిస్తూ.. దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు. ఇప్పటివరకు సాగిన దర్యాప్తు నిష్పాక్షికంగా జరిగిందన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. నిందితుడిపై దాఖలు చేసిన చార్జిషీట్‌ను తమ ముందుంచాలని పోలీసులను, నిందితుడి వాదనలు వినాల్సిన అవసరంలేదన్న సుప్రీంకోర్టు తీర్పులను తమ ముందుంచాలని శ్రవణ్‌కుమార్‌ను ఆదేశించారు. తదుపరి విచారణను ఈ నెల 7కి వాయిదా వేశారు.



కృష్ణాజిల్లా అవనిగడ్డలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబటివారిపాలెంలో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు





గుంటూరు జిల్లా మంగళగిరిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)




ఏలూరు జిల్లా ముదిచెర్లలో ఎంపీ కోటగిరి శ్రీధర్, చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా తదితరులు

ఎంఎస్‌ఎంఈల బలోపేతంపై దృష్టి

కొత్త పారిశ్రామిక విధానంలో తీసుకోవాల్సిన చర్యలపై కసరత్తు

- నేడు ఆ పారిశ్రామికవేత్తలతో పరిశ్రమల శాఖ సమావేశం
- విశాఖ గ్లోబల్ సమ్మిట్‌లో కూడా వీటికి ప్రాధాన్యత
- మూడున్నరేళ్లలో కొత్తగా 1,08,206 ఎంఎస్‌ఎంఈల ఏర్పాటు
- వీటి ద్వారా 10 లక్షల మందికి పైగా ఉపాధి



సాక్షి, అమరావతి : రాష్ట్రంలో అత్యధిక మందికి ఉపాధి కల్పించే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్‌ఎంఈ) ప్రోత్సాహంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి కొత్తగా తీసుకొస్తున్న రాష్ట్ర పారిశ్రామిక విధానంలో ఎంఎస్‌ఎంఈలకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. కోవిడ్ సంక్షోభం దృష్ట్యా గతంలో రాష్ట్ర పారిశ్రామిక పాలసీ మూడేళ్ల (2020–23)కు పరిమితం చేశారు. ఇప్పుడు కోవిడ్ సంక్షోభం నేర్పిన పాఠాల ఆధారంగా చిన్న పరిశ్రమలను పెద్దఎత్తున ప్రోత్సహించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టింది. కొత్త పాలసీలో ఎంఎస్‌ఎంఈల ప్రోత్సాహానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై నేరుగా ఆయా రంగ ప్రతినిధుల నుంచే సలహాలను స్వీకరిస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ కరికాల వలవన్ మంగళవారం సచివాలయంలో ఎంఎస్‌ఎంఈ సంఘాలు, ప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పాటుచేశారు. వైఎస్సార్ నవోదయం, రీస్టార్ట్, వైఎస్సార్ బడుగు వికాసం పేరుతో ప్రవేశపెట్టిన పథకాలు ఎలాంటి ఫలితాలు అందించాయి.. మారిన పరిస్థితుల్లో ఎంఎస్‌ఎంఈ రంగం ప్రభుత్వం నుంచి ఎలాంటి మద్దతు కోరుకుంటోంది వంటి అంశాలపై ప్రధానంగా దృష్టిసారిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో పెద్దపీట

సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏటా ఎంఎస్‌ఎంఈలకు పారిశ్రామిక ప్రోత్సాహకాలను అందిస్తోంది. గత ప్రభుత్వం పెట్టిన బకాయిలతో పాటు ఏ ఏడాది రాయితీలను ఆ ఏడాదిలోనే విడుదల చేయడం ద్వారా ఈ రంగాన్ని ఆదుకుంటోంది. గత ప్రభుత్వం రూ.2,800 కోట్ల విలువైన పారిశ్రామిక ప్రోత్సాహకాలను బకాయి పెట్టడం ద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని గణనీయంగా దెబ్బతీసింది. కానీ, ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడేళ్లలో రూ.1,715.16 కోట్ల రాయితీలతో పాటు రూ.1,144 కోట్ల విలువైన విద్యుత్ రాయితీ ప్రోత్సాహకాలను అందించి ఈ రంగానికి ఊపిరి పోసింది. దీంతో గడిచిన మూడున్నర ఏళ్లలో కొత్తగా 1,08,206 ఎంఎస్‌ఎంఈ యూనిట్లు ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా రూ.20,537.28 కోట్ల పెట్టుబడులు రావడంతో పాటు 10,04,555 మందికి ఉపాధి లభించింది. ఇక వచ్చే ఏడాది విశాఖ వేదికగా నిర్వహించే గ్లోబల్ సమ్మిట్ 2023లో కూడా రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈ రంగానికి పెద్దపీట వేస్తోంది. ఈ సదస్సు విజయవంతమయ్యేందుకు ఈ రంగ ప్రతినిధుల నుంచి సూచనలు తీసుకోనుంది.

నిబంధనల ప్రకారమే లైట్ల కొనుగోళ్లు

ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో ఆస్పత్రులకు అవసరమైన పరికరాల కొనుగోలులో ఎటువంటి అవకతవకలు జరగలేదని ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రూ.2లక్షల విలువైన లైట్‌ను అధిక మొత్తం ఖర్చు చేసి కొనుగోలు చేసినట్లు పచ్చ పత్రికలు అసత్య ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఊహాజనిత కథనాలు రాస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొనుగోలు చేసే పరికరాలకు కంపెనీ బ్రాండింగ్ బట్టి ధరలు ఉంటాయన్నారు. టెండర్ల నిర్వహణ తర్వాత ఆర్థిక బిడ్లు తెరిచి తక్కువగా వచ్చిన మొత్తానికి మళ్లీ రివర్స్ ఆక్షన్‌కు వెళ్లామన్నారు. రివర్స్ ఆక్షన్‌లో వచ్చిన సదరు మొత్తం 2019లో కొనుగోలు ధరలు, ఇప్పటి ఆన్‌లైన్ ధరల కంటే తక్కువగానే ఉన్నాయన్నారు.

లైట్ల కొనుగోలులో వివిధ ప్రక్రియల్లో రేట్లు ఇలా..

అంశం	ఆర్థిక బిడ్డులో వచ్చిన తక్కువ ధర	రివర్స్ ఆక్షన్ తర్వాత	2019లో కొన్న ధర
షాడో లెస్ ఓటీ లైట్ మేజర్(65)	రూ.4,54,608	రూ.4,43,242.80	రూ.5,59,000
షాడో లెస్ ఓటీ లైట్ మైనర్ (64)	రూ.2,60,937.6	రూ.2,24,406.28	రూ.3,09,000
షాడో లెస్ ఓటీ స్టాండ్ టైప్ మోడల్ (92)	రూ.1,23,000	రూ.48,875.56	రూ.1,96,000

డ్రగ్స్ కట్టడిలో ఏపీ భేష్

రాష్ట్రంలోనే పకడ్బందీగా దాడులు

- అందుకే అత్యధికంగా గంజాయి స్వాధీనం, ఎక్కువ అరెస్టులు
- డ్రగ్స్ నియంత్రణలో ఉదాసీనంగా ఇతర రాష్ట్రాలు
- 'కేంద్ర డీఆర్ఐ నివేదిక 2021–22' వెల్లడి
- నివేదికకు వక్రభాష్యం చెబుతూ పచ్చ మీడియా దుష్ప్రచారం

సాక్షి, అమరావతి : మాదక ద్రవ్యాల (డ్రగ్స్)పై ఉక్కుపాదం మోపడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. నాలుగు రాష్ట్రాలతో కూడిన దండకారణ్యం ప్రాంతం నుంచి గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను కట్టడి చేయడంలో సమర్థవంతమైన పాత్ర పోషించింది. పకడ్బందీ ప్రణాళికతో విస్తృతంగా దాడులు నిర్వహించి గంజాయి సాగును, రవాణాను అడ్డుకోవడంతోపాటు ఎక్కువగా కేసులు నమోదు చేసిన రాష్ట్రంగా గుర్తింపు పొందింది. కేంద్ర డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్ (డీఆర్ఐ) విడుదల చేసిన 'భారతదేశంలో స్మగ్లింగ్ నివేదిక 2021–22' ఈ విషయాన్ని వెల్లడించింది. 2021–22లో దేశవ్యాప్తంగా 28,334.32 కేజీల డ్రగ్స్‌ను జప్తు చేసినట్టు నివేదిక పేర్కొంది. దేశంలో 12 రాష్ట్రాల్లో గంజాయి సాగు, అక్రమ రవాణా సాగుతోంది. ఏపీలో గంజాయి సాగు, అక్రమ రవాణాను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత సమర్థవంతంగా వ్యవహరించిందని ఈ నివేదిక పేర్కొంది. ఏపీ ప్రభుత్వం ఏకంగా 90 మంది స్మగ్లర్లను అరెస్టు చేసింది. ఈ విషయంలో మిగతా రాష్ట్రాలు చాలా ఉదాసీనంగా ఉన్నాయని ఈ నివేదిక ద్వారా వెల్లడైంది. ఏపీలో గత ప్రభుత్వాలు గంజాయి, ఇతర డ్రగ్స్ దందాను పట్టించుకోలేదు. అయితే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల దందాపై ఉక్కుపాదం మోపారు. ఇందుకు ప్రత్యేకంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ)ని ఏర్పాటు చేసి, అత్యంత సమర్థులైన అధికారులు, సిబ్బందిని ఇందులో నియమించారు. దీంతోపాటు 2021లో ఆపరేషన్ పరివర్తన్ పేరిట ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ప్రత్యేక బృందాలు, డ్రోన్ కెమెరాలతో సర్వే చేసి కేవలం రెండు నెలల్లో 11,550 ఎకరాల్లో గంజాయి సాగును ప్రభుత్వం కూకటివేళ్లతో పెకలించివేసింది. 2.49 లక్షల కిలోల గంజాయిని జప్తు చేసింది. ఏపీ ప్రభుత్వ చర్యలను కేంద్ర నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ)తో సహా యావత్ దేశం అభినందించింది. ఇప్పుడు డీఆర్ఐ నివేదిక కూడా రాష్ట్ర ప్రభుత్వ చర్యలను ప్రశంసించింది. విజయవాడలోని బోగస్ చిరునామాతో కస్టమ్స్ అధికారుల కళ్లుగప్పి పంజాబ్‌కు తరలించేందుకు అఫ్గానిస్థాన్ నుంచి గుజరాత్‌లోని కాండ్లా పోర్టుకు అక్రమంగా తరలించిన 2,988.21 కిలోల డ్రగ్స్ ఉదంతాన్ని కూడా ఈ నివేదికలో ప్రస్తావించారు. ఆ డ్రగ్స్ వ్యవహారంతో విజయవాడకు ఏమాత్రం సంబంధంలేదని, కేవలం కస్టమ్స్ అధికారులను బురిడీ కొట్టించేందుకే స్మగ్లర్లు వేసిన ఎత్తుగడలో భాగంగా ఇక్కడి చిరునామా ఇచ్చారని డీఆర్ఐ దర్యాప్తులో వెల్లడైంది కూడా.

పచ్చ మీడియా దుష్ప్రచారం

ప్రభుత్వం డ్రగ్స్ కట్టడిలో సమర్థంగా పని చేస్తున్నా.. వక్ర భాష్యాల పచ్చ మీడియా ప్రజల్ని తప్పుదారి పట్టిస్తోంది. డీఆర్ఐ నివేదిక ప్రశంసిస్తే.. దానిని కూడా రాష్ట్రంలో టీడీపీకి వత్తాసు పలికే పచ్చ మీడియా వక్రీకరిస్తోంది. ఎక్కువ కేసులు నమోదు చేయడం, ఎక్కువ మందిని అరెస్టు చేయడం అంటే స్మగ్లింగ్ ఎక్కువగా జరుగుతోందంటూ ఆ మీడియా కథనాలు ఇవ్వడం విడ్డూరంగా ఉందని పరిశీలకులు విమర్శిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గంజాయి అక్రమ రవాణాను ఏమాత్రం పట్టించుకోలేదు కాబట్టే ఎక్కువ గంజాయిని జప్తు చేయలేదని, ఎక్కువ మంది స్మగ్లర్లను అరెస్టు చేయలేదన్నది సుస్పష్టం. అందుకు భిన్నంగా ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమర్థంగా గంజాయి , ఇతర డ్రగ్స్ దందాకు అడ్డుకట్ట వేస్తోందన్న విషయం కేంద్ర ప్రభుత్వ నివేదికే వెల్లడించిందని నిపుణులు చెబుతున్నారు.

మితిమీరితే యాంటీబయోటిక్స్

- చిన్నచిన్న అనారోగ్యాలకు యాంటీబయోటిక్స్ వాడకూడదు
- పెయిన్ కిల్లర్స్‌తో కిడ్నీలకు ప్రమాదం
- శరీరంలో పెరుగుతున్న డ్రగ్ రెసిస్టెన్సీ
- డాక్టర్ సూచన మేరకే మందులు వాడాలని వైద్య నిపుణుల సూచన



లబ్బీపేట(విజయవాడతూర్పు): కరోనా తర్వాత సొంత వైద్యం చేసుకోవడం ఎక్కువైంది. జలుబు, దగ్గు వస్తే చాలు వైద్యుడి వద్దకు కూడా వెళ్లకుండా వారం రోజులు యాంటీబయోటిక్స్ వాడేస్తున్నారు. పన్నునొప్పి అని మందుల షాపుకు వెళ్తే వారు కూడా ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీబయోటిక్స్ ఇస్తున్నారు. అనుభవం లేని వైద్యులు హైపవర్ 625 ఎంజీ యాంటీబయోటిక్స్‌ను రాసేస్తున్నారు. దీంతో డ్రగ్ రెసిస్టెన్స్ పెరిగి భవిష్యత్తులో మందులు పనిచేయకుండాపోతాయని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు కలరా లాంటి అంటు వ్యాధుల నుంచి పెన్సిలిన్ వంటి యాంటీబయోటిక్స్ ప్రాణాలు నిలిపాయి. ఇప్పుడు మితిమీరి పలు రకాల యాంటీబయోటిక్స్ వాడటం వల్ల తీవ్రమైన దుష్ఫలితాలు కనిపిస్తున్నాయని ఫార్మకాలజీ నిపుణులు పేర్కొంటున్నారు.

యాంటీబయోటిక్స్ ఎప్పుడు వాడాలంటే..

మనకు ఏదైనా జబ్బు చేసినప్పుడు వైరల్ ద్వారా వ్యాప్తి చెందిందా? లేక బ్యాక్టీరియా కారణమా అన్నది నిర్ధారించుకోవాలి. బ్యాక్టీరియా కల్చర్ పరీక్ష ద్వారా నిర్ధారించుకుని అవసరం మేరకు మూడు నుంచి ఐదు రోజులు యాంటీబయోటిక్స్ వాడాలి. శరీరంలో గుడ్ బ్యాక్టీరియా, బ్యాడ్ బ్యాక్టీరియా రెండు రకాలు ఉంటాయి. బ్యాడ్ బ్యాక్టీరియా నివారణకు అతిగా యాంటీబయోటిక్స్ వాడటం వలన వాటి ప్రభావం గుడ్ బ్యాక్టీరియాపై పడి, శరీరంలోని వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఒక్కోసారి తీవ్రమైన నీరసం వంటి సమస్యలు తలెత్తుతాయి. యాంటీబయోటిక్స్ రెండు రకాలుగా ఉంటాయి. నేరో స్పెక్ట్రమ్ యాంటీబయోటిక్స్ ఇవి ఒకే రకమైన బ్యాక్టీరియాకు పనిచేస్తాయి. బ్రాడ్ స్పెక్ట్రమ్ యాంటీబయోటిక్స్ ఇవి రెండు మూడు రకాల బ్యాక్టీరియాల నివారణకు పనిచేస్తాయి.

సూపర్‌బగ్స్‌తో పెనుప్రమాదం

యాంటీబయోటిక్స్ విచ్చలవిడిగా వాడటం వల్ల శరీరంలో బ్యాక్టీరియాలో డ్రగ్ రెసిస్టెన్స్ ఏర్పడుతుంది. వాటి నుంచి వచ్చే నెక్స్ జనరేషన్‌ను సూపర్‌బగ్స్ అంటారు. ఇవి సాధారణ యాంటీబయోటిక్స్‌కు లొంగవు. ఎక్కువ డోస్ ఇవ్వాల్సి ఉంటుంది. అలా ఇవ్వడం ద్వారా సైడ్ ఎఫెక్స్ ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉంది. ప్రస్తుతం కొందరిలో సూపర్ బగ్స్‌ను గుర్తిస్తున్నట్లు నిపుణులు చెపుతున్నారు.

వ్యాధిని గుర్తించడం ముఖ్యం

వైరల్, బ్యాక్టీరియా, ఫంగస్ ఇలా మూడు కారణాలుగా నిమోనియా వస్తుంది. వైరల్ నిమోనియా చాలా వేగంగా వ్యాప్తి చెంది తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ వ్యాధికి మందులు వాడేటప్పుడు సరైన నిర్ధారణ చేసి యాంటీబయోటిక్స్ వాడకపోతే నివారించడం కష్టంగా మారుతుంది. నిమోనియానే కాదు, ఏ వ్యాధినైనా యాంటీబయోటిక్స్ వినియోగించే సమయంలో బ్యాక్టీరియా కల్చర్, అవసరమైతే డ్రగ్ కల్చర్ పరీక్షలు చేయడం ఉత్తమం.

పెయిన్‌కిల్లర్స్‌తో కిడ్నీలకు ముప్పు

వైద్యులు సిఫార్సు చేయకుండా దీర్ఘకాలం పెయిన్ కిల్లర్స్ వాడిన వారిలో కిడ్నీ సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. ఒకసారి కిడ్నీలు పాడైన తర్వాత వాటిని వెనక్కి తీసుకు రావడం కుదరదు. దీంతో దీర్ఘకాలం డయాలసిస్‌పైనే కాలం వెళ్లదీస్తున్న వారు ఉంటున్నారు. విచ్చలవిడిగా పెయిన్ కిల్లర్స్ వాడటం మంచిది కాదని వైద్యులు, ఫార్మకాలజీ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఇవే నిదర్శనం

- ఫుడ్ ఇన్‌ఫెక్షన్‌తో విరేచనాలబారిన పడిన మచిలీపట్నానికి చెందిన వెంకటేశ్వరరావు ఆస్పత్రిలో చేరారు. విరేచనాలు ఎంతకీ తగ్గకపోవడంతో వైద్యులు ఆందోళన చెందారు. పరీక్ష చేయగా శరీరంలో డ్రగ్ రెసిస్టెన్స్ ఉన్నట్లు నిర్ధారించారు.
- పోరంకికి చెందిన ఓ వ్యవసాయ కూలీకి ఒకరోజు ముఖం, కాళ్లు వాపు రాగా పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి వెళ్లాడు. రెండు కిడ్నీలు పాడైనట్లు వైద్యులు నిర్ధారించారు. కొంతకాలంగా మోకీళ్ల నొప్పులకు మందుల షాపులో నొప్పుల బిల్లలు వాడటం వల్లే ఇలా జరిగిందని తేల్చారు. వీళ్లిద్దరే కాదు నిత్యం ఇలాంటి వారు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నవారు చాలా మంది ఉంటున్నారు.

అవసరం మేరకే వాడాలి



యాంటీబయోటిక్స్ మందులను అవసరమైనప్పుడు మాత్రమే వినియోగించాలి. అందుకోసం పబ్లిక్, ప్రయివేటు సెక్టార్‌లతో పాటు, హెల్త్ కేర్ రంగ నిపుణులు, ప్రజలందరికీ అవగాహన కలిగించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపునిచ్చింది. హేచరీస్‌లో కోళ్లకు యాంటీబయోటిక్స్ ఇస్తారు. దీంతో చికెన్‌లో కూడా డ్రగ్ రెసిస్టెన్స్ ఉండొచ్చు. అందుకే కోళ్లకు కూడా ఎక్కువ యాంటీబయోటిక్స్ వాడవద్దని హేచరీస్ వారికి సూచించాం. డ్రగ్ రెసిస్టెన్స్ కారణంగా సూపర్‌బగ్స్ రూపొందితే ప్రాణాంతకంగా మారవచ్చు.

– కోట అనీల్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్, డ్రగ్ కంట్రోల్, కృష్ణాజిల్లా

సిఫార్సు మేరకు వాడాలి



పెయిన్ కిల్లర్స్, యాంటిబయోటిక్స్‌ను వైద్యుల సూచన మేరకు మాత్రమే వాడాలి. ఇష్టమొచ్చినట్లు మందుల షాపుల్లో కొనుగోలు చేసి పెయిన్ కిల్లర్స్ వాడితే కిడ్నీలు దెబ్బతింటాయి. మందులు అధిక మోతాదులో వాడటం వల్ల కిడ్నీలపై ప్రభావం చూపిన వారిని చూస్తున్నాం. ఏ మందైనా అవసరం మేరకు, వైద్యుల సూచనతోనే వాడాలి. అవగాహన లేమితో కొందరు, అనుభవం లేని వైద్యుల సలహాలతో మరికొందరు పెయిన్ కిల్లర్స్, యాంటీబయోటిక్స్‌ను అధిక మోతాదులో వాడుతున్నారు. అది మంచిది కాదు.

– డాక్టర్ భీమవరపు భార్గవ్, నెఫ్రాలజిస్ట్

యుద్ధప్రాతిపదికన ధాన్యం సేకరించాలి



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

పెడన: యుద్ధ ప్రాతిపదికన రైతుల నుంచి ధాన్యం సేకరించాలని సంబంధిత శాఖల ఉన్నతాధికారులను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఆదేశించారు. ఆయన పెడన మార్కెట్ యార్డులోని ఏఎంసీ సమావేశం హాలులో జిల్లా పౌరసరఫరాలు, వ్యవసాయం, రెవెన్యూ శాఖల అధికారులతో ధాన్యం కొనుగోలుపై సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో రైతుల నుంచి ధాన్యం సేకరించే విషయంలో అలసత్వం తగదని సూచించారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు వేగంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. డీఎస్ఓ భారతీ, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ శ్రీధర్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మనోహర్, మచిలీపట్నం ఆర్డీఓ ఐ.కిషోర్, పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను, గూడూరు తహసీల్దార్లు, ఆయ మండలాల ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి మళ్లీ చంద్రబాబు కర్మ పట్టకూడదు

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బీసీల పక్షపాతి
- బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బుద్దా నాగేశ్వరరావు



బుద్దా నాగేశ్వరరావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): బీసీల తోకలు కత్తిరిస్తానన్న చంద్రబాబు కర్మ మళ్లీ రాష్ట్రానికి పట్టకుండా బీసీలంతా సిద్ధం కావాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బుద్దా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. 14 ఏళ్లు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు బీసీలను నిలువుగా ముంచారని, వారు జడ్జిలుగా పనికి వస్తారా అంటూ అవహేళనగా మాట్లాడారని పేర్కొన్నారు. విజయవాడలోని తన కార్యాలయంలో బుద్దా నాగేశ్వరరావు సోమవారం విలేకరులతో మాట్లాడారు. బీసీ సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అలుపెరగని కృషి చేస్తున్నారని తెలిపారు. విజయవాడలో ఈ నెల ఏడో తేదీన జరిగే జయహో బీసీ మహాసభకు రాష్ట్ర నలుమూలల నుంచి బీసీలు భారీ ఎత్తున తరలి రావాలని పులుపునిచ్చారు. బీసీల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తూ, నామినేటెడ్ పదవులలో సైతం బీసీలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి బీసీల పక్షపాతిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని కొనియాడారు. బీసీలు అంటే వెనుకబడిన కులాలు కాదు.. వెన్నెముక వర్గాలు అనే నినాదంతో వారి అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నారని వివరించారు. నలుగురు బీసీలను రాజ్యసభకు పంపిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

25 మంది బాలికలకు సైకిళ్ల పంపిణీ



విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న తానా ప్రతినిధులు, బుద్ధప్రసాద్

అవనిగడ్డ: అమెరికాలోని తానా ద్వారా అందే నిధుల్లో ప్రతి రూపాయీ సద్వినియోగం అవుతోందని తానా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జైశంకర్ పేర్కొన్నారు. స్థానిక గాంధీక్షేత్రంలో తానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎడ్లంకకు చెందిన 25 మంది బాలికలకు సోమవారం జైశంకర్, తానా ట్రస్టీ రవి సామినేని సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా జైశంకర్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకూ పేదల కోసం 13 లక్షల డాలర్లతో సేవా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఈ సంవత్సరం 500 మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశామన్నారు. నేత్ర, క్యాన్సర్ వైద్య శిబిరాలను ఉచితంగా నిర్వహించామన్నారు. శాసన సభ మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, తానా ప్రతినిధులు శృంగవరపు నిరంజన్, నైనుపాటి విశ్వనాథ్, కిలారు ముద్దుకృష్ణ, చావా లక్ష్మీనారాయణ, అశోక్‌కుమార్ భానోతు, వేమూరి శ్యాం పాల్గొన్నారు.

ఏఐబీడీపీఏ ఆంధ్రప్రదేశ్ సర్కిల్ నూతన కార్యవర్గ ఎన్నిక

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆలిండియా బీఎస్ఎన్ఎల్ అండ్ డీఓటీ పెన్షనర్స్ అసోసియేషన్(ఏఐబీడీపీఏ) ఆంధ్రప్రదేశ్ సర్కిల్ నూతన కార్యవర్గం ఎనికైంది. విజయవాడ గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఏఐబీడీపీఏ ఆంధ్రప్రదేశ్ రెండో రాష్ట్ర మహాసభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏఐబీడీపీఏ ఆంధ్రప్రదేశ్ సర్కిల్ ప్రెసిడెంట్‌గా ఎం.యాకోబు, సర్కిల్ సెక్రటరీగా కె.ఎస్.సి బోస్, అసిస్టెంట్ సర్కిల్ సెక్రటరీగా ఎస్.రామారావు, ట్రెజరర్‌గా ఎం.ఎస్.ఎన్.రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఏఐబీడీపీఏ జనరల్ సెక్రటరీ కె.జి.జయరాజ్ మాట్లాడుతూ పెన్షన్ రివిజన్ పూర్తి బాధ్యతను కేంద్ర ప్రభుత్వమే భరించాలన్నారు. 2017 జనవరి ఒకటో తేదీ నుంచి 15శాతం ఫిట్‌మెంట్ డీ లింకింగ్ వేతన సవరణతో వేతన సవరణ నుంచి పెన్షన్ సవరణను విడదీయాలని డీఓటీ ఇప్పటికే నిర్ణయం తీసుకున్నందున ఆలస్యం చేయొద్దని కోరారు. పెన్షన్ రివిజన్ అనేది బీఎస్ఎన్ఎల్ స్తోమత లేదా లాభాదాయకంతో సంబంధం లేదన్నారు. పెన్షన్ ప్రయోజనాలు పొందకుండానే చాలా మంది ఇప్పటికే లోకాన్ని విడిచిపెట్టారని, వెంటనే వేతన సవరణను డీలింక్ చేస్తూ 15 శాతం ఫిట్‌మెంట్‌తో సమస్యను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ సర్కిల్ సెక్రటరీ కె.రమాదేవి, ఏఐబీడీపీఏ ఆంధ్రప్రదేశ్ సర్కిల్ వైస్ ప్రెసిడెంట్ పి.అశోక్‌బాబు, ఉమ్మడి 13 జిల్లాల నుంచి 450 మంది పెన్షనర్లు పాల్గొన్నారు.

యువజన సంఘాల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

విజయవాడ స్పోర్ట్స్: యువజన అభివృద్ధికి ఉత్తమ సేవలు అందించిన యూత్ క్లబ్‌లు, మహిళా సంఘాలకు జిల్లా స్థాయి అవార్డులు అందజేస్తామని నెహ్రూ యువ కేంద్రం ఉమ్మడి కృష్ణాజిల్లా యువజన అధికారి దేవిరెడ్డి కిరణ్మయి సోమవారం తెలిపారు. 2021–22 సంవత్సరంలో ఉత్తమ సేవలు అందించి, నెహ్రూ యువకేంద్రంతో అనుసంధానంగా పని చేస్తూ, రిజిస్టర్ అయిన సంఘాలకే ఈ అవార్డులు పొందే అర్హత ఉందని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న క్లబ్‌లు, సంఘాలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2021 ఏప్రిల్ ఒకటి నుంచి 2022 మార్చి 31వ తేదీ వరకు చేసిన యువజన అభివృద్ధి కార్యక్రమాల నివేదిక ఫొటోలు, పత్రికా ప్రచురణలను జత చేసిన దరఖాస్తులను ఈ నెల 12వ తేదీలోపు విజయవాడ ఆటోనగర్‌లోని నెహ్రూ యువకేంద్రం కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఎంపికైన ఉత్తమ సంఘానికి రూ.25 వేల నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందజేస్తామన్నారు. గతంలో ఈ అవార్డుకు ఎంపికైన సంఘాలకు ఈ ఏడాది నిర్వహించే పోటీలకు అర్హత ఉండదని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 0866–2555828, 6303677849, 94909 08517 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



చలికాలంలో ముఖం పగుళ్లు బారకుండా ఉండాలంటే అందుకు తగ్గ ఫేస్ ప్యాక్ వేసుకోవాలి. ఇందుకోసం కాసిని చల్లటి పాలు, కొద్దిగా నిమ్మరసం, బాదం లేదా కమలాతొక్కల పొడి కావాలి. వీటన్నింటిని ఒక చిన్న గిన్నెలో వేసి పేస్టులా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖంపై ప్యాక్‌లా వేసుకుని పది నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి.

సందర్భం

కొర్రాసు నెగడై మండిన ఆత్మగౌరవ అక్షరం

పాఠాలు వినడానికి బడికి వెళితే వెక్కిరింపులు.
పట్నంలో సరుకులు కొందామని వెళితే వెక్కిరింపులు.
ప్రశ్న అడిగితే వెక్కిరింపులు. జవాబు చెప్పలేకపోతే వెక్కిరింపులు.

ఈ వెక్కిరింపులు తట్టుకోలేక వెక్కివెక్కి ఏడ్చిన ఆదివాసీ బిడ్డలు ఎంతోమంది ఉన్నారు. అయితే జసింత మాత్రం ఎప్పుడూ ఏడ్వలేదు. ఏడిపించాలని చూసిన వారికి గట్టి జవాబు చెప్పింది. ఆత్మగౌరవంతో నిలబడింది. ఆదివాసి హక్కుల ఉద్యమకారిణి, కవయిత్రి జసింత కెర్‌కెట్ట తాజాగా ఫోర్బ్స్ ఇండియా ఉమెన్ పవర్(సెల్ఫ్‌మేడ్ ఉమెన్)-2022 జాబితాలో చోటు సంపాదించింది...

ఝార్ఖండ్‌లోని సింగ్‌భమ్ జిల్లాలో కొయెల్ నది, ప్రఖ్యాతిగాంచిన సరన అడవికి సమీపంలోని బేటియ గ్రామంలో పుట్టి పెరిగింది జసింత.

ఆదివాసీలు బయటి ప్రపంచంలోకి అడుగుపెడితే అడుగడుగునా అవమానాలు ఎదురయ్యే పరిస్థితిని తాను కూడా ఎదుర్కొంది. స్కూల్లో ఆదివాసీలు కాని పిల్లలు జసింతను వెక్కిరించేవారు. దీనికి కారణం నల్లటి ఆమె ఒంటి రంగు. విద్యార్థులే కాదు ఉపాధ్యాయులు కూడా తక్కువ చేసి మాట్లాడేవారు. ఈ అవమానాలతో విసుగెత్తిన జసింత ప్రతిఘటించడం మొదలుపెట్టింది. దీంతో తనను వెక్కిరించడానికి భయపడేవాళ్లు.

చక్రధర్‌పుర్‌లో హైస్కూలో చదువుకునే రోజుల్లో హాస్టల్లో ఉండేది జసింత. కొల్హన్ ప్రాంతం నుంచి వచ్చిన ఎంతోమంది ఆదివాసీ అమ్మాయిలు ఈ హాస్టల్లో ఉండేవారు. అందరూ మూర్తీభవించిన అమాయకత్వంలా అనిపించేవారు. వారితో స్నేహం చేయడమే కాదు ధైర్యం కూడా నింపేది జసింత. ఎవరైనా పరీక్షల సమయంలో కాపీ కొట్టడానికి ప్రయత్నిస్తే 'తప్పు' అని వారించి 'కష్టపడి చదువుదాం' అని చెప్పేది.

తనలోని శూన్యాన్ని భర్తీ చేసుకోవడానికి తన భావాలకు కవితల రూపం ఇచ్చి రాంచీ నుంచి వెలుబడే 'రహి' అనే పత్రికకు పంపేది. సీనియర్ కవి వినోద్‌కుమార్ శుక్లా రాసిన 'ఆదివాసి లడికి' కవిత ప్రభావం తన రచనలపై ఎంతో ఉంది. జసింత జర్నలిస్ట్ కావాలని ఎప్పుడూ అనుకోలేదు. అయితే ఒకానొక సంఘటన తాను జర్నలిస్ట్ కావడానికి కారణం అయింది. మనోహర్‌పూర్ పట్టణంలో ఆదివాసీ దంపతులపై ఒక గుంపు దాడి చేసింది. భర్త చనిపోయాడు. భార్యకు న్యాయం జరగకపోగా తప్పుడు కేసుతో జైలు పాలైంది. జైలు నుంచి వచ్చిన కొద్దికాలానికే చనిపోయింది!

ఇలాంటి విషాదాలకు ఆదివాసీ సమాజంలో లెక్కలేదు. 'మా గురించి ఎవరు నిజాలు రాస్తారు?' అనే ప్రశ్న. ఆ సమయంలోనే జసింత ముందుకు వచ్చి నిలుచుంది.

తాను జర్నలిస్ట్ అయిన తరువాత ఆదివాసీలకు సంబంధించి ఎన్నో సమస్యలను వెలుగులోకి తెచ్చింది. వారి సమస్యల పరిష్కారానికి అధికారులతో మాట్లాడేది. యూఎన్‌డిపి ఫెలోషిప్ రావడం తన జీవితంలో మరో ముందడుగు. ఈ ప్రాజెక్ట్ లో భాగంగా ఝార్ఖండ్‌లోని అన్ని జిల్లాలకు వెళ్లి ఆదివాసీలతో మాట్లాడి వారి కష్టాలు తెలుసుకుంది జసింత. ఇప్పటివరకు హిందీలో రాస్తున్న జసింత ఇకముందు తన మాతృభాష (వొరాన్ ఆదివాసి భాష)లో రాయాలని నిర్ణయించుకుంది. దీనికి కారణం ఇతర భాషలకంటే మహిళలు తమలోని భావాలను ఎలాంటి పరిమితులు లేకుండా సంపూర్ణంగా వ్యక్తీకరించడానికి అనువైన నిర్మాణం తమ మాతృభాషకు ఉందని.



జసింత

W-POWER SELF-MADE WOMEN

'ఆదివాసీల గురించి ఎన్నో పుస్తకాలు వచ్చాయి. ఆదివాసీలు కాని వారు కూడా పుస్తకాలు రాసిన వారిలో ఉన్నారు. అయితే ఈ పుస్తకాలలో చరిత్ర తప్ప ఆదివాసీల తత్వం, ప్రాపంచిక దృక్పథాన్ని పట్టించే రచనలు రాలేదు. ఆ ప్రయత్నం వేగంగా జరగాలి' అంటోంది జసింత. హక్కుల కార్యకర్త, కవయిత్రి, జర్నలిస్ట్‌గా ఆదివాసీల గుండె గొంతుక అయిన జసింత తాను కోరుకున్న రచనలు రావడానికి, ఆదివాసి తత్వాన్ని శోధించే పనికి కూడా పూనుకుంది. 'మన కోసం మనం' అనే నినాదం ఇక్కడ కూడా జసింతను ముందుకు నడిపిస్తోంది.

హలో కణ్మణి

వేలి కొసల జీవితం

జీవితం చేజారిపోయిందంటారు కొందరు.
జీవితం చెప్పుచేతుల్లో లేదంటారు కొందరు.
జీవితం కొట్టిన దెబ్బకు
కళ్లు బైర్లు కమ్మాయంటారు కొందరు.
కాని జీవితానికి సవాలు విసిరితే
అది తోక ముడిచి వేలి కొసల దగ్గర
చతికిలపడుతుంది.
ఆదేశాల కోసం ఎదురు చూస్తుంది.
కేరళకు చెందిన కణ్మణికి ఇరు భుజాలు లేవు.
కాళ్లు ఎదగలేదు.
కాని వేళ్ల కొసలు ఉన్నాయి.
వాటితోనే అద్భుతమైన బొమ్మలు వేస్తుంది.
గొంతు ఉంది.
క్లాసికల్ సంగీతంలో కచ్చేరీలు ఇస్తుంది.
ఎప్పుడూ నవ్వుతూ ఉంటుంది.
జీవితాన్ని ఎలా జీవించాలో చూపుతుంది.
ఆమెలో ఉన్నదేదో
మనలో లేకపోతే లోపం మనదే.



కాలి వేళ్లతో పెయింటింగ్ చేస్తున్న కణ్మణి

'క్వాడ్రపుల్ ఆంప్యుటీ' అనే మాట విన్నారు మొదటగా కణ్మణి తల్లిదండ్రులు. అంటే అర్థం వారికి తెలియదు. తండ్రి శశికుమార్ కతార్‌లో డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. తల్లి రేఖ గృహిణి. మామూలు మధ్యతరగతి జీవితం. కేరళ కొట్టాయంలోని అరుణుత్తిమంగళం అనే ఊళ్లో వీరి నివాసం. కణ్మణి పుట్టడమే ఇరు భుజాలు లేకుండా పుట్టింది. కాళ్లు ఉన్నాయి కాని అవి సాధారణంగా అనిపించలేదు.

డాక్టర్ కణ్మణిని పరిశీలించి చూసి ఇది 'క్వాడ్రపుల్ ఆంప్యుటీ' అనే అవకర స్థితి అని, ఇలా పుట్టిన వాళ్లకు రెండు చేతులు కాని, రెండు కాళ్లు కాని ఒక్కోసారి చేతులు కాళ్లు కాని పూర్తిగా ఏర్పడవని చెప్పాడు. తల్లిదండ్రుల గుండె ఆగినంత పనైంది. ఇంటికి తొలి బిడ్డ. ఇలా పుడితే. కాని కణ్మణిలో విశేష ఉత్సాహం ఉంది. జోలపాడితే కళ్లు పెద్దవి చేసి వినేది. భుజాలు లేకపోయినా ఉన్న కాళ్లతో కుదురే లేక ఇంట్లో తిరిగేది. ఐదేళ్లు వచ్చేసరికి మాటలూ పాటలూ ఇంట్లో హోరెత్తసాగాయి కణ్మణివి.

'మీ అమ్మాయిని ఏదైనా స్పెషల్ స్కూల్‌లో వేయండి' అని సలహా ఇచ్చారు ఇరుగూ పొరుగూ వారు. తల్లిదండ్రులు వినలేదు. 'మా అమ్మాయికి ఏం తక్కువ. మామూలు పిల్లలతోనే కలిసి చదువుకుంటుంది' అని మామూలు బళ్లోనే వేశారు. అది వారు తీసుకున్న చాలా మంచి నిర్ణయంగా తర్వాత నిరూపితమైంది. కణ్మణి మామూలు పిల్లలతోపాటు హుషారుగా చదువుకుంది. చదువులో, పాఠాలు నేర్చుకోవడంలో ఆమెకు ఏ కష్టమూ లేదు. రాయడంలోనే ఇబ్బంది. బొటనవేలు... మధ్య వేలు మధ్య పెన్ను పట్టుకోవడం నేర్చింది. నోట్సు మీద రాయడం నేర్చుకుంది. ఆ తర్వాత పరీక్షలు రాయడం కష్టం కాలేదు. 'నేనేమిటి ఇలా పుట్టాను' అని కణ్మణి ఒక్కరోజు కూడా అనుకోలేదు. 'నేను ఏం చేయగలను?' అని చిన్నప్పటి నుంచి ఆలోచించేది. పాడేది. స్కూల్లో ప్రైజులన్నీ కణ్మణివే.

యూనివర్సిటీ రికార్డు

కణ్మణి 'బేచిలర్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్' (ఓకల్) చదవాలని నిశ్చయించుకుంది. ఆమెకోసం కుటుంబం తిరువనంతపురం షిఫ్ట్ అయ్యింది. కేరళ యూనివర్సిటీలో సీటు వచ్చింది కణ్మణికి. మూడేళ్ల కోర్సు. 82 శాతం మార్కులతో పాస్ అయ్యింది. యూనివర్సిటీ ఫస్ట్ ర్యాంక్. ఆమె ఆ ర్యాంక్ తెచ్చుకోవడానికి ఆమెలోని లోపం అడ్డుపడలేదు. పట్టుదల ఉంటే ఏదీ అడ్డుపడదు. అందుకే 2019లో కణ్మణికి రాష్ట్రపతి భవన్ నుంచి పిలుపు వచ్చింది. రాష్ట్రపతి భవన్‌లో కణ్మణి పాడింది. కోవింద్‌తోపాటు మోది కూడా ఆమె గాత్రకచ్చేరి విన్నారు.

బొమ్మలు కొంటాం

కణ్మణి కేవలం పాడటంతో ఊరుకోలేదు. బొమ్మలు వేయడం కూడా నేర్చుకుంది. బ్రష్‌ను కాలి వేళ్ల కొసల మధ్యన పట్టుకుని బొమ్మలు వేసి వాటిని సోషల్ మీడియాలో పెట్టసాగింది. చూసిన వారు మేము కొంటాం అని రాసాగారు. అది ఒక ఆదాయం. కేరళలో కణ్మణి కచ్చేరీలు పెట్టేవారు కూడా పెరిగారు. వారు ఇచ్చే పారితోషికం ఆమెకు ఉపయోగపడుతోంది. కణ్మణి కోసం తల్లి ఎంతో కష్టపడింది. తండ్రి అనుక్షణం మద్దతు ఇచ్చాడు. ప్లస్ టు చదువుతున్న తమ్ముడికైతే అక్క అంటే ప్రాణం. వాళ్లంతా కణ్మణి ఇలా పేరు తెచ్చుకోవడం... తన కాళ్ల మీద... అవును, కాళ్లమీద తాను నిలబడటం చూసి పొంగిపోతున్నారు. ఇప్పుడు కణ్మణి సంగీతంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తోంది.

నెత్తిపట్టం

కొడితే ఏనుగు కుంభస్థలాన్ని కొట్టమన్నారు. కొట్టగలను అని మరోవిధంగా నిరూపించింది కణ్మణి. కేరళలో ఏనుగుల కుంభస్థలాన్ని ఒక బంగారు రంగు అలంకరణతో అలంకరిస్తారు. దానిని 'నెత్తి పట్టం' అంటారు. నెత్తి పటం అని తెలుగులో అనవచ్చు. నెత్తి మీద అలంకరించే ఆ హస్తకళా అలంకరణను కణ్మణి పట్టుపట్టి నేర్చుకుని కాళ్లతోనే తయారు చేస్తోంది. కేరళలో వీటిని ఏనుగుల అలంకరణకే కాదు ఇంట్లో అలంకరణగా కూడా వాడతారు. కణ్మణి తయారు చేసే నెత్తి పటాలకు ఇప్పుడు గిరాకి ఉంది.

ఈ మధ్యే కణ్మణి కుటుంబం కారు కొంది. కణ్మణి హాయిగా అందులో కుటుంబంతో కలిసి విహారాలు చేస్తుంది. దిగులు ముఖం బెంగ ముఖం ఆమె నుంచి ఆశించలేము. నవ్వుతూ హుషారుగా ఉండే కణ్మణి జీవితం ఎలా ఉందో ఏమి ఇస్తుందో దానిని స్వీకరిస్తూ దానితోపాటు కొనసాగే తత్వాన్ని అలవర్చుకుని ముందుకు పోవాలని బోధిస్తుంది.

'ఏమి లేవో చూడకండి. ఏమి ఉన్నాయో చూసుకుని వాటితో శక్తి ప్రదర్శించండి' అనేది కణ్మణి చెప్పేమాట.

అందరూ వినాల్సిన మాట అది.

క్లీనింగ్ టిప్స్



సీలింగ్ ఫ్యాన్ క్లీన్ చేయడం పెద్ద పని. ఫ్యాన్ రెక్కల పైన ఉన్న దుమ్మంతా కింద పడుతుంది. క్లీన్ చేసేవాళ్ల జుట్టు మీదా పడుతుంది. ఒక చిన్న చిట్కాతో ఈ పని సులువుగా అయిపోతుంది. ఈ సారి సీలింగ్ ఫ్యాన్ క్లీన్ చేసేటప్పుడు పాత దిండు గలీబు తీసుకోండి. దాన్ని ఫ్యాన్‌కి తొడిగి ఒడుపుగా లాగేయండి. దుమ్ము గలీబు లోపలే ఉంటుంది. కింద పడదు. ఆ తరువాత దుమ్ము దులిపేసి గలీబు ఉతికేసుకోవచ్చు.


గాజు గోడల మీద, మార్బుల్స్ లాంటి వాటి మీద మరకలు పడితే చూడడానికి చాలా అసహ్యంగా ఉంటుంది. మామూలు పద్ధతుల్లో క్లీన్ చేస్తే అవి పోవు. ఇలాంటప్పుడు కాస్తంత షేవింగ్ క్రీం ఉంటే చాలు. మీకెంతో సాయం చేస్తుంది. మరకలున్న చోట షేవింగ్ క్రీం రాసి పదిహేను నిమిషాలు ఆగండి. తరవాత తుడిచేయండి. ఏదో అద్భుతం జరిగినట్టుగా మార్బుల్స్, గ్లాస్ వాల్స్ తళ తళలాడతాయి.



టాయిలెట్ క్లీనింగ్ ఎవరికీ నచ్చని పని. కానీ, క్లీన్ చేసి తీరాలి. ఒక చిన్న ఉపాయంతో ఈ పని సింపుల్ గా చేసేసుకోవచ్చు. ఇందుకు మీకు కావలసినవి బేకింగ్ సోడా, వెనిగర్. ఒక కప్పు వెనిగర్‌ని అర కప్పు వంటసోడా, వేడినీటితో కలపండి. ఈ మిశ్రమాన్ని టాయిలెట్ బౌల్‌లో వేసి కొంతసేపు ఉంచి ఫ్లష్ చేసేయండి. తర్వాత టాయిలెట్ సీట్‌ని శుభ్రంగా తుడవడం మాత్రం మరిచిపోకండి.

అద్భుత నేలలు.. ఆహార లోగిళ్లు!

- ప్రకృతికి అనుగుణమైన పరిష్కారాలే పంట భూములకు మేలు
- పట్టణ వ్యర్థాలను కంపోస్టుగా మార్చి పొలాలకు చేర్చాలి: ఎఫ్.ఎ.ఓ.



సాగుబడి

జ్యేష్ఠ కార్తె: డిసెంబర్ 3 నుంచి

పంట భూములు.. అపూర్వ వారసత్వ సంపద. విచ్చలవిడిగా రసాయనాలు కుమ్మరించటం.. పదే పదే దున్నటం.. ఒకే పంట సాగు చెయ్యటం.. వంటి మన పిచ్చి పనులు నేలతల్లి మూలుగను నిలువునా పీల్చేస్తున్నాయి. రసాయనాల వాడకం మానెయ్యటం.. ప్రకృతి సేద్యం ద్వారా ఏడాది పొడవునా అనేక పంటలతో నేలను కప్పి ఉంచటం వంటి మంచి పనులతో కాపాడుకుందాం...

మనుగడకు ఆహారం మూలాధారం. ఆహారం పుట్టుకకు మూలస్థానం మన కాలి కింద నేలలు. మనం తినే ఆహారంలో 95 శాతం నేలల ద్వారా ఉత్పత్తవుతున్నవే. పోషకాల పుట్టుక, నిల్వ, పునర్వినియోగం వంటి అసాధారణ సామర్థ్యంతో కూడిన పనులు మట్టిలో సహజంగా జరుగుతుంటాయి. ఆరోగ్యకరమైన నేలల ద్వారానే ఆరోగ్యకరమైన, పోషకవంతమైన ఆహారం మనకు అందుతుంది.

భూమిపై ఉన్న వ్యక్తుల కంటే ఒక చెంచా మట్టిలో ఎక్కువ సూక్ష్మజీవులు ఉన్నాయని మీకు తెలుసా? సూక్ష్మజీవులు, ఖనిజాలు, సేంద్రియ పదార్థాల సమ్మేళనంతో రూపొందిన అద్భుత సజీవ ప్రపంచం అది. అటువంటి మట్టిలో పెరిగే పంటలు, చెట్ల ద్వారా మనకు, జంతువులకు ఆహారం అందుతున్నది.

9.64 కోట్ల హెక్టార్లు నిస్సారం

మన దేశంలో 9.64 కోట్ల హెక్టార్ల భూమి నిస్సారమై ఎడారిగా మారిపోయింది. దేశ భౌగోళిక విస్తీర్ణం (32.87 కోట్ల హెక్టార్ల)లో ఇది 29.3%. అడవుల నరికివేత, రసాయనిక వ్యవసాయం, జనాభా పెరుగుదల, భూతాపోన్నతి వంటివి ఇందుకు దారితీసిన కారణాలు. గడ్డి కూడా మొలవనంత ఎడారిగా మారిపోయిన భూములను తాకిన సూర్యకిరణాలు పరావర్తనం చెందటం వల్ల ఏర్పడుతున్న రీరేడియేషన్‌తో భూతాపం మరింత పెరుగుతోంది. కాబట్టి, భూమి నిస్సారమైపోకుండా చెయ్యగలిగే పునరుజ్జీవన వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారానే ఈ బహుళ సమస్యలను పరిష్కరించుకోగలం. దేశంలో నిస్సారమై సాగుయోగ్యం కాకుండాపోయిన 2.6 కోట్ల హెక్టార్ల భూమిని మరో 8 ఏళ్లలో పునరుద్ధరిస్తానని భారత ప్రభుత్వం వాగ్దానం చేసింది. ఈ కృషిలో భాగంగానే ఆహారోత్పత్తిని పెంపొందించటంతోపాటు ప్రకృతి వనరులను పునరుజ్జీవింపజేసే ప్రకృతి వ్యవసాయాన్ని కేంద్రం, ఏపీ సహా అనేక రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి.

200 కోట్ల మందిలో సూక్ష్మపోషకాల లోపం

మన నేలల ఆరోగ్యం ఏమీ బాగోలేదు, మన ఆరోగ్యం లాగానే! కోట్లాది ఏళ్ల క్రితమే భూమిపై జీవం పుట్టి పరిఢవిల్లుతోంది. సుమారు పది వేల ఏళ్ల నుంచి వ్యవసాయం జరుగుతోంది. అయితే, గడచిన కొన్ని దశాబ్దాలుగా నేలలకు తీరని నష్టం జరుగుతోంది. గత 70 ఏళ్లలో, మన నేలల్లో 15-40% వరకు పోషకాల సాంద్రత తగ్గింది. అంటే, ఈ భూముల్లో పండే ఆహారంలో కూడా ఆ మేరకు పోషకాలు అప్పటికన్నా తక్కువగానే ఉంటున్నాయని అర్థం.

అదేమాదిరిగా.. మనం తినే ఆహారంలో విటమిన్లు, పోషకాల స్థాయి కూడా బాగా తగ్గింది. ప్రపంచవ్యాప్తంగా 200 కోట్ల మంది ప్రజలు సూక్ష్మ పోషకాల కొరతతో బాధపడుతున్నారని ఎఫ్.ఎ.ఓ. అంచనా. పైకి కొట్టొచ్చినట్లు కనిపించే సమస్య కాదిది.. అందుకే దీన్ని 'పరోక్ష ఆకలి' అని పిలుస్తున్నారు.

అంతెందుకు.. సాగులో ఉన్న భూమి క్రమంగా పూర్తిగా నిస్సారంగా మారిపోతోంది. సాంద్ర వ్యవసాయ పద్ధతుల వల్ల ఇప్పటికే 35% సాగు భూమి పంటల సాగుకు బొత్తిగా యోగ్యం కాకుండాపోయిందని ఆహార-వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఓ.) లెక్కగట్టింది. ఉండేకొద్దీ వేగంగా నేలలు ఉత్పాదక శక్తిని కోల్పోతున్నాయి. నేల సేంద్రియ కర్బనం, జీవవైవిధ్యాన్ని కోల్పోవడం, పోషకాల అసమతుల్యత, నేల కోత, కాలుష్యం, లవణీయత, పెరగటం, ఎరువులను విచక్షణారహితంగా ఉపయోగించడం వంటి అనేక అంశాలు దీనికి కారణమవుతున్నాయి. అదనంగా, ప్రతి సంవత్సరం కోత కారణంగా 2,400 కోట్ల టన్నుల సారవంతమైన మట్టి కొట్టుకుపోతోంది. నేల ఉత్పాదకశక్తి కోల్పోతున్న కొద్దీ పంటల దిగుబడి తగ్గుతుంది. పంటల వైఫల్యానికి దారితీస్తుంది. ప్రజలు ఆకలి, పోషకాహార లోపం బారినపడతారు. పేదరికం పెరుగుతుంది.

సాగు భూముల్లో పోషకాల అసమతుల్యత మొదటి పది ముప్పులలో ఒకటి. మనుషుల్లో సూక్ష్మపోషక లోపం.. వారు తినే ఆహారంలో లోపించిన పోషకాలతో, ఆ ఆహారం పండిన నేలల్లో పోషకాల లోపంతో ముడిపడి ఉంటుంది. అవసరమైన అనేక ఖనిజాల లేమితో ప్రపంచ జనాభాలో మూడింట రెండు వంతుల మంది బాధపడుతున్నారు.

44 లక్షల కోట్ల డాలర్ల నష్టం

ఐరాస ఆహార-వ్యవసాయ సంస్థ తాజా నివేదిక ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా 40% భూమి నిస్సారమై ఎడారిగా మారిపోయింది. వ్యవసాయం కోసం చెట్లను నరికివేస్తుండటం వల్ల అడవుల విస్తీర్ణం 80% తగ్గిపోతోంది. పశుపక్ష్యాదులు ఆవాసం కోల్పోతూ జీవజాతులే అంతరించిపోతున్నాయి. ఫలితంగా 50% ప్రపంచ జనాభా మనుగడ ప్రమాదంలో చిక్కుకుంది. నిస్సార భూముల నష్టం 44 లక్షల కోట్ల డాలర్లు. నిస్సారమైన 100 కోట్ల హెక్టార్ల భూమిని 2030 నాటికి పునరుజ్జీవింపజేస్తామని ఐక్యరాజ్యసమితి సభ్య దేశాలు ప్రతినబూనాయి. ఇందుకు 1.6 లక్షల కోట్ల డాలర్లు అవసరమని అంచనా.

'బీటీ' వల్ల తగ్గుతున్న రెండో పంట దిగుబడి



జన్యుమార్పిడి బీటీ పత్తి పంట వల్ల మన దేశంలో పంట భూములు నిస్సారంగా మారుతున్నాయి. మొక్కలు తయారు చేసుకున్న ఆహారంలో 30 శాతాన్ని పోషక ద్రవాల (రూట్ ఎక్సుడేట్స్) రూపంలో వేర్ల ద్వారా భూమిలోకి వదులుతూ ఉంటాయి. బీటీ జన్యువులోని విషం ఈ ద్రవాల ద్వారా భూమిలోని సూక్ష్మజీవులను నశింపజేస్తున్నాయి. బీటీ పత్తి పంట తీసి వేసిన తర్వాత కూడా ఈ దుష్ప్రభావం 45-90 రోజులకు వరకు ఉంటుంది. దీని వల్ల ఈ భూములు నిస్సారంగా మారుతున్నాయి. దీని వల్ల బీటీ పత్తి వేసిన భూముల్లో రబీలో వేసే రెండో పంట దిగుబడి 15-20% తగ్గినట్లు గుర్తించాం. ఈ విషయాన్ని జీఈఏసీకి కూడా నివేదించాం. ఇతర దేశాల్లో వాతావరణం అనుకూలించక రెండో పంట వేయరు. కాబట్టి వారికి ఆ సమస్య లేదు. పైగా వారు సాగు చేసే పంటల్లో సగం విస్తీర్ణం పప్పు ధాన్యాలు. మన దేశంలో పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం 10% మాత్రమే. తెలంగాణలో ఇది 5%. కలుపు మందును తట్టుకునే బీటీ పత్తి వల్ల భూములు మరింత ఎక్కువగా నాశనం అవుతున్నాయి. నేలపైన, లోపల కూడా జీవవైవిధ్యం తీవ్రంగా దెబ్బతింటున్నది. అయినా, ఎవరూ పట్టించుకోవటం లేదు.

– డా. జీవీ రామాంజనేయులు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సుస్థిర వ్యవసాయ కేంద్రం

9 ఖనిజాలు, పోషకాల్లేకుండా పోయాయి.. ప్రకృతి సేద్యంపై మరింత దృష్టి పెట్టాలి..

మన దేశం రసాయనిక సాంద్ర వ్యవసాయ పద్ధతులను అమలుపరిచిన ప్రాంతాల్లో పంట పొలాలు నిస్సారమై ఉత్పాదక శక్తిని కోల్పోయాయి. హరిత విప్లవం అమలైన రాష్ట్రాల్లో పొలాలు ఎడారిగా మారుతున్నాయి. మట్టిలో గతంలో ఉన్న తొమ్మిది ప్రధాన ఖనిజాలు, పోషకాలు ఇప్పుడు లేవని పరిశోధనలు చెబుతున్నాయి. నాలుగింట మూడొంతుల మట్టి పరీక్షల్లో సేంద్రియ కర్బనం అడుగంటినట్లు తేలింది. 1947లో 2.5% ఉన్న సేంద్రియ కర్బన శాతం 2020 నాటికి 0.4 శాతానికి తగ్గింది. అందువల్ల మన నేలలను కాపాడుకుంటే.. ఆహార, పోషకాహార భద్రత చేకూరటంతో పాటు మన మనుగడ కూడా మెరుగవుతుంది. పుష్కలంగా ఆహార నిల్వలు ఉన్నందున, మన దేశం మరింత వేగవంతంగా పర్యావరణ హితమైన ప్రకృతి వ్యవసాయ విస్తరణ వైపు చురుగ్గా దృష్టిని కేంద్రీకరించాలి.



– డా. నీలం పటేల్, వ్యవసాయ సలహాదారు, నీతి ఆయోగ్

ప్రకృతి దరి చేరితే 58% అధికోత్పత్తి

పంట భూముల్లో పోషకాల లభ్యతను పెంపొందించడానికి.. ఆహార, పౌష్టికాహార భద్రతనిచ్చే పంటల దిగుబడిని మెరుగుపరచడానికి ప్రకృతికి అనుగుణమైన నేల నిర్వహణ పద్ధతులే అత్యంత తక్కువ ఖర్చుతో కూడుకున్న పరిష్కారమని ఎఫ్.ఎ.ఓ. స్పష్టం చేస్తోంది. రసాయనిక ఎరువుల ధరలు ప్రస్తుతం 300 శాతం పెరిగిన నేపథ్యంలో ఎరువుల వినియోగ సామర్థ్యాన్ని పెంచడం, రసాయనిక ఎరువులకు బదులు ప్రకృతి/సేంద్రియ సాగు పద్ధతులను ప్రోత్సహించడం మేలన్న భావన బలపడుతోంది.




పెరిగే జనాభాకు అనుగుణంగా 2050 నాటికి ఆహారోత్పత్తి ప్రపంచవ్యాప్తంగా 60 శాతం పెరగాల్సి ఉంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో దాదాపు 100 శాతం పెరగాలి. ప్రకృతికి అనుగుణమైన పద్ధతుల్లో భూసారాన్ని పెంపొందించటం ద్వారా 58 శాతం వరకు ఎక్కువ ఆహారాన్ని ఉత్పత్తి చేయవచ్చని ఎఫ్.ఎ.ఓ. భరోసా ఇస్తోంది.

ప్రపంచవ్యాప్తంగా ప్రతి రోజూ వెలువడుతున్న సుమారు 35 లక్షల టన్నుల వ్యర్థాలు, పశువుల ఎరువు, పట్టణ వ్యర్థాలను కంపోస్టుగా మార్చి తిరిగి పంట భూముల్లోకి చేర్చటం ద్వారా సాగు భూముల ఉత్పాదక శక్తిని పెంపొందించవచ్చు. ఈ ఏడాది ప్రపంచ నేలల దినోత్సవం (డిసెంబర్ 5) సందర్భంగా ఎఫ్.ఎ.ఓ. ప్రభుత్వాలకు, రైతులకు, ప్రజలకు సూచిస్తున్న పరిష్కార మార్గాలు ఇవే!

– పంతంగి రాంబాబు, సాక్షి సాగుబడి డెస్క్

భోపాల్ శాస్త్రవేత్త డా. ఎ.కె. పాత్రకు వరల్డ్ సాయిల్ ప్రైజ్

ఐరాసకు చెందిన ఆహార-వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఓ.) ప్రతి ఏటా ప్రదానం చేసే గ్లింకా వరల్డ్ సాయిల్ ప్రైజ్ ఈ ఏడాది భోపాల్‌లోని భారతీయ నేలల పరిశోధనా సంస్థ అధిపతి డాక్టర్ అశోక్ కుమార్ పాత్రకు దక్కింది. ప్రపంచ నేలల దినోత్సవం సందర్భంగా రోమ్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఈ పురస్కారాన్ని ప్రకటించారు. డాక్టర్ పాత్ర వర్చువల్‌గా ఈ సమావేశంలో పాల్గొని కీలకోపన్యాసం చేశారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన డా. పాత్ర పంట భూముల్లో పోషకాల నిర్వహణను మెరుగుపరచడానికి శాస్త్రవేత్తగా 33 ఏళ్లుగా కృషి చేస్తున్నారు. భూసార పరీక్షల ద్వారా ఎరువులను సిఫార్సు చేయడానికి ఉపకరించే మృద పరీక్షక్ మినీ సాయిల్ లాబొరేటరీని అభివృద్ధి చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. పంట మోళ్లను తగులబెట్టకుండా త్వరగా కుళ్లబెట్టడానికి చల్లే ద్రావణం తయారీకి ఉపయోగించే గుళికలను డా. పాత్ర కనుగొన్నారు. అదేవిధంగా, కింగ్ భూమిబోల్ వరల్డ్ సాయిల్ డే అవార్డును ఈ ఏడాది మెక్సికో యూనివర్సిటీ దక్కించుకుంది.



డా. పాత్ర



పీలేకు ప్రాణాపాయం లేదు

బ్రెజిల్ ఫుట్‌బాల్ గ్రేట్ పీలే కోవిడ్ తదనంతర ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నారని ఆయన కుటుంబసభ్యులు వెల్లడించారు. శ్వాసకోశ సంబంధిత సమస్యతో పీలేను ఆస్పత్రిలో చేర్పించారు. ఆయన పరిస్థితి పూర్తిగా కుదుటపడితే డిశ్చార్జ్ చేస్తారని, అంతేతప్ప ఆయనకు ఎలాంటి ప్రాణాపాయం లేదని కుమార్తె కెలీ నసిమెంటో చెప్పారు. ఈ మాత్రం దానికే ఆయన జీవితం ముగుస్తోందని, చావుబ్రతుకుల మధ్య ఉన్నారని వార్తలు వ్యాప్తి చేయడం తగదని ఆమె అన్నారు.



భారత జట్టుకు జరిమానా

మిర్పూర్‌లో ఆదివారం జరిగిన తొలి వన్డేలో ఆతిథ్య బంగ్లాదేశ్ చేతిలో ఓడిన భారత జట్టుపై జరిమానా రూపంలో అదనపు భారం పడింది. ఈ మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా రోహిత్ శర్మ కెప్టెన్సీలోని టీమిండియా మ్యాచ్ ఫీజులో 80 శాతాన్ని జరిమానాగా విధించారు. నిర్దేశిత సమయంలో నాలుగు ఓవర్లు తక్కువగా వేసినందుకు నిబంధనల ప్రకారం ఈ జరిమానా వేస్తున్నట్లు మ్యాచ్ రిఫరీ రంజన్ మదుగలే ప్రకటించారు. ఒక ఓవర్ ఆలస్యంగా వేస్తే 20 శాతం ఫీజులో కోత పడుతుంది.

అండర్-19 ప్రపంచకప్ టోర్నీకి త్రిష, షబ్నమ్




న్యూఢిల్లీ: వచ్చే నెలలో దక్షిణాఫ్రికా వేదికగా జరిగే అండర్-19 మహిళల తొలి ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. 15 మంది సభ్యులతో కూడిన టీమిండియాకు సీనియర్ జట్టు ఓపెనర్, హరియాణాకు చెందిన 18 ఏళ్ల షఫాలీ వర్మను కెప్టెన్‌గా, ఢిల్లీ అమ్మాయి శ్వేత సెహ్రావత్‌ను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు. జనవరి 14 నుంచి 29 వరకు జరిగే ఈ మెగా ఈవెంట్‌లో పోటీపడే భారత జట్టులో తెలంగాణకు చెందిన గొంగడి త్రిష, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన షబ్నమ్‌లకు కూడా చోటు లభించింది. హైదరాబాద్‌కే చెందిన యషశ్రీ స్టాండ్‌బై ప్లేయర్‌గా ఎంపికైంది. ముంబైలో ప్రస్తుతం న్యూజిలాండ్ జట్టుతో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో త్రిష, షబ్నమ్ నిలకడగా రాణిస్తున్నారు. ప్రపంచకప్ టోర్నీకి సన్నాహకంగా ఈనెల 17 నుంచి దక్షిణాఫ్రికాతో జరిగే ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో బరిలోకి దిగే 18 సభ్యుల తో కూడిన భారత జట్టును ప్రకటించారు. ఇందులో త్రిష, షబ్నమ్, యషశ్రీ సభ్యులుగా ఉన్నారు.

భారత అండర్-19 జట్టు: షఫాలీ వర్మ (కెప్టెన్), శ్వేత సెహ్రావత్ (వైస్ కెప్టెన్), రిచా ఘోష్, గొంగడి త్రిష, సౌమ్య తివారి, సోనియా, హర్లీ గాలా, రిషిత బసు, సోనమ్ యాదవ్, మన్నత్ కశ్యప్, అర్చన దేవి, పార్శవి చోప్రా, టిటాస్ సాధు, ఫలక్ నాజ్, షబ్నమ్. **స్టాండ్‌బై:** శిఖా, నజ్లా, యషశ్రీ.

సెమీస్‌లో పుణేరి పల్టన్, జైపూర్ పింక్ పాంథర్స్

సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్‌లో పుణేరి పల్టన్, జైపూర్ పింక్ పాంథర్స్ జట్లు సెమీఫైనల్ బెర్త్‌లను ఖరారు చేసుకున్నాయి. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో సోమవారం జరిగిన లీగ్ మ్యాచ్‌ల్లో పుణేరి పల్టన్ 44-30తో పట్నా పైరేట్స్‌పై, జైపూర్ పింక్ పాంథర్స్ 44-30తో హరియాణా స్టీలర్స్‌పై గెలిచాయి. మరో లీగ్ మ్యాచ్ ఆడాల్సి ఉన్న పుణేరి, జైపూర్ జట్లు 79 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాయి. మిగతా జట్లు తమ తదుపరి రెండు మ్యాచ్‌ల్లో గెలిచినా పుణేరి, జైపూర్ జట్లను దాటే అవకాశం లేదు. టాప్-6లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు నేరుగా సెమీఫైనల్ చేరుకుంటాయి. మిగతా రెండు సెమీఫైనల్ బెర్త్‌ల కోసం నాలుగు జట్లు ఎలిమినేటర్-1, ఎలిమినేటర్-2 మ్యాచ్‌ల్లో తలపడతాయి.

క్రొయేషియా కేక

- 'షూటౌట్'లో జపాన్‌పై 3-1తో విజయం
- మూడోసారి క్వార్టర్ ఫైనల్లో చోటు
- మూడు షాట్‌లను నిలువరించిన గోల్‌కీపర్ లివాకోవిచ్
- జపాన్‌కు మళ్లీ నిరాశ



జపాన్ ఆటగాళ్ల మూడు పెనాల్టీ షాట్‌లను నిలువరించిన క్రొయేషియా గోల్‌కీపర్ లివాకోవిచ్

దోహా: లీగ్ దశలో రెండు ప్రపంచ మాజీ చాంపియన్ జట్లపై (జర్మనీ, స్పెయిన్) సంచలన విజయం సాధించిన జపాన్ జట్టు కీలకమైన నాకౌట్ మ్యాచ్‌లో మాత్రం తడబడింది. గత ప్రపంచకప్ రన్నరప్ క్రొయేషియా జట్టుతో సోమవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో జపాన్ 'షూటౌట్'లో ఓడిపోయింది. జపాన్‌ను ఏమాత్రం తక్కువ చేయకుండా నిర్ణీత సమయంలో... ఆ తర్వాత అదనపు సమయంలోనూ జాగ్రత్తగా ఆడిన క్రొయేషియా నిర్ణాయక 'షూటౌట్'లో మాత్రం పూర్తిగా పైచేయి సాధించింది. తుదకు 'షూటౌట్'లో 3-1తో జపాన్‌ను ఓడించి ఈ మెగా ఈవెంట్‌లో మూడోసారి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. 1998లో మూడో స్థానం పొందిన క్రొయేషియా, 2018లో రన్నరప్‌గా నిలిచింది. మరో వైపు జపాన్ ప్రస్థానం నాలుగోసారి ప్రిక్వార్టర్ ఫైనల్‌కే పరిమితమైంది. గతంలో మూడుసార్లు ప్రిక్వార్టర్ ఫైనల్ చేరి ఈ గండాన్ని అధిగమించలేకపోయిన



క్రొయేషియా సంబరం

'బ్లూ సమురాయ్' బృందానికి నాలుగోసారీ నిరాశే ఎదురైంది. ముందుగా ఆట 43వ నిమిషంలో డైజెన్ మేడా గోల్‌తో జపాన్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత 55వ నిమిషంలో లావ్రెన్ కుడి వైపు నుంచి కొట్టిన క్రాస్ షాట్‌ను 'డి' ఏరియాలో పెరిసిచ్ హెడర్ షాట్‌తో గోల్‌గా మలచడంతో క్రొయేషియా స్కోరును 1-1తో సమం చేసింది. అనంతరం రెండు జట్లు మరో గోల్ చేయకపోవడంతో నిర్ణీత సమయానికి రెండు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. ఫలితం తేలడానికి అదనపు సమయం (15 నిమిషాలు నిడివి గల రెండు భాగాలు) ఆడించారు. అదనపు సమయంలోనూ స్కోరు సమంగా ఉండటంతో విజేతను నిర్ణయించడానికి 'షూటౌట్' అనివార్యమైంది. 'షూటౌట్'లో క్రొయేషియా గోల్‌కీపర్ లివాకోవిచ్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. జపాన్ ఆటగాళ్లు కొట్టిన మూడు షాట్‌లను నేర్పుతో నిలువరించాడు. మరోవైపు క్రొయేషియా జట్టులో లివాజా కొట్టిన షాట్ గోల్‌పోస్ట్ బార్‌కు తగిలి పక్కకు వెళ్లగా, మిగతా ముగ్గురు ఆటగాళ్లు జపాన్ గోల్‌కీపర్‌ను బోల్తా కొట్టించి బంతిని లక్ష్యానికి చేర్చారు. బ్రెజిల్, దక్షిణ కొరియా మ్యాచ్ విజేతతో క్వార్టర్ ఫైనల్లో క్రొయేషియా ఆడుతుంది.



నిరాశలో జపాన్ అభిమాని

షూటౌట్ సాగిందిలా...

జపాన్		స్కోరు	క్రొయేషియా	
మినామినో	✘	0-1	వ్లాసిక్	✔
మిటోమా	✘	0-2	బ్రోజోవిచ్	✔
అసానో	✔	1-2	లివాజా	✘
యోషిదా	✘	1-3	పాసాలిచ్	✔

నోట్: ఫలితం తేలిపోవడంతో ఐదో షాట్‌ను తీసుకోలేదు

ఇంగ్లండ్... పదోసారి

- క్వార్టర్ ఫైనల్ చేరిన మాజీ విజేత
- సెనెగల్‌పై 3-0తో ఘనవిజయం



దోహా: అంచనాలకు అనుగుణంగా రాణిస్తూ ఇంగ్లండ్ జట్టు ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి తర్వాత జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ఇంగ్లండ్ 3-0 గోల్స్‌తో సెనెగల్‌ను ఇంటిదారి పట్టించింది. ఇంగ్లండ్ జట్టులో జోర్డాన్ హెండర్సన్ (38వ ని.లో), కెప్టెన్ హ్యారీ కేన్ (ఇంజ్యూరీ టైమ్ 45+3వ ని.లో), బుకాయో సాకా (57వ ని.లో) తలా ఒక గోల్ సాధించారు. డిఫెండర్ల వైఫల్యంతో సెనెగల్ తొలి అర్ధభాగంలోనే మూల్యం చెల్లించుకుంది. రెండో అర్ధభాగంలోనూ అదే కొనసాగడంతో పరాభవం తప్పలేదు. సెనెగల్‌కు ఒక్క గోల్ అవకాశం ఇవ్వకుండా మ్యాచ్‌ను ముగించిన ఇంగ్లండ్ ఆటతీరు అద్భుతం. మెగా ఈవెంట్ చరిత్రలో ఇంగ్లండ్ క్వార్టర్స్ చేరడం ఇది పదోసారి. ఈనెల 10న జరిగే క్వార్టర్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ ఫ్రాన్స్‌తో ఇంగ్లండ్ తలపడుతుంది.

ప్రపంచకప్‌లో నేడు (ప్రిక్వార్టర్ ఫైనల్స్)

స్పెయిన్ x మొరాకో
రాత్రి గం. 8:30 నుంచి

పోర్చుగల్ x స్విట్జర్లాండ్
అర్ధరాత్రి గం. 12:30 నుంచి

స్పోర్ట్స్ 18లో ప్రత్యక్ష ప్రసారం

ఇంగ్లండ్ అదరగొట్టింది

తొలి టెస్టులో 74 పరుగులతో పాక్‌పై విజయం



రావల్పిండి: బ్యాటింగ్‌కు పూర్తి అనుకూలంగా ఉండి పరుగుల వరద పారిన పిచ్‌పై ఇంగ్లండ్ టీమ్ చేసిన సాహసం ఆ జట్టుకు విజయాన్ని అందించింది. సోమవారం ముగిసిన తొలి టెస్టులో ఇంగ్లండ్ 74 పరుగుల ఆధిక్యంతో పాకిస్తాన్‌ను ఓడించింది. 343 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓవర్‌నైట్ స్కోరు 80/2తో ఆట కొనసాగించిన పాక్ చివరి రోజు రెండో ఇన్నింగ్స్‌లో 96.3 ఓవర్లలో 268 పరుగులకు ఆలౌటైంది. సౌద్ షకీల్ (159 బంతుల్లో 76; 12 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించగా, రిజ్వాన్ (92 బంతుల్లో 46; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. ఒకదశలో గెలుపు కోసం సానుకూల దృక్పథంతో బ్యాటింగ్ చేసిన పాక్ లంచ్ సమయానికి 169/3తో, టీ సమయానికి 257/5 స్కోరుతో నిలిచింది. క్రీజ్‌లో రెగ్యులర్ బ్యాటర్లు అజహర్ అలీ (81 బంతుల్లో 40; 4 ఫోర్లు), ఆగా సల్మాన్ (64 బంతుల్లో 30; 4 ఫోర్లు) ఉండగా చివరి సెషన్‌లో పాక్ మరో 86 పరుగులు చేయాల్సి ఉంది. అయితే 16.2 ఓవర్ల వ్యవధిలో 9 పరుగులు మాత్రమే చేసిన పాక్ ఆఖరి 5 వికెట్లు చేజార్చుకొని ఓటమి పాలైంది. వికెట్లు కోల్పోతున్న దశలో మ్యాచ్‌ను 'డ్రా' చేసేందుకు పాక్ తీవ్రంగా ప్రయత్నించింది. చివర్లో వెలుతురు తగ్గుతుండగా, 14 ఓవర్లపాటు అంపైర్లు కొత్త బంతికి అనుమతించకపోవడంతో ఇంగ్లండ్ శిబిరంలో కొంత ఉత్కంఠ పెరిగింది. పాక్ ఆఖరి జోడీ నసీమ్ షా (46 బంతుల్లో 6; 1 ఫోర్), మొహమ్మద్ అలీ (26 బంతుల్లో 0 నాటౌట్) అప్పటికే 52 బంతులు ఆడేశారు. అయితే చివరకు నసీమ్‌ను లీచ్ ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేయడంతో విజయం ఇంగ్లండ్ సొంతమైంది. పాకిస్తాన్ గడ్డపై ఇంగ్లండ్ జట్టుకిది మూడో టెస్టు విజయం (25 మ్యాచ్‌లలో) మాత్రమే. రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి ఐదు వికెట్లు తీసిన ఇంగ్లండ్ పేస్ బౌలర్ ఒలీ రాబిన్సన్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. రెండో టెస్టు శుక్రవారం నుంచి ముల్తాన్‌లో జరుగుతుంది.

1768 ఈ మ్యాచ్‌లో ఇరు జట్లు కలిపి చేసిన పరుగులు. 'డ్రా' కాకుండా ఫలితం వచ్చిన టెస్టు మ్యాచ్‌లో నమోదైన అత్యధిక పరుగులు ఇవే కావడం విశేషం.

సంక్షిప్త స్కోర్లు


ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 657 ఆలౌట్ (101 ఓవర్లలో); **పాకిస్తాన్ తొలి ఇన్నింగ్స్:** 579 ఆలౌట్ (155.3 ఓవర్లలో); **ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్:** 264/7 డిక్లేర్డ్ (35.5 ఓవర్లలో); **పాకిస్తాన్ రెండో ఇన్నింగ్స్:** 268 ఆలౌట్ (96.3 ఓవర్లలో).

'అర్జున' శ్రీజకు కేటీఆర్ అభినందన




ఈ ఏడాది జాతీయ క్రీడా పురస్కారాల్లో 'అర్జున అవార్డు' అందుకున్న తెలంగాణ టేబుల్ టెన్నిస్ స్టార్ క్రీడాకారిణి ఆకుల శ్రీజ సోమవారం తెలంగాణ మంత్రి కె.తారకరామారావును ప్రగతి భవన్‌లో కలిసింది. శ్రీజ సాధిస్తున్న విజయాలకు, ప్రతిష్టాత్మక అర్జున అవార్డు పొందినందుకు మంత్రి కేటీఆర్ ఆమెకు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. -సాక్షి, హైదరాబాద్

సినిమా



● సూర్య



● బాల

సూర్య.. బాల.. ఓ ట్విస్ట్!

హీరో సూర్య-దర్శకుడు బాలది హిట్ కాంబినేషన్. ఈ ఇద్దరి కలయికలో వచ్చిన 'నందా', 'పితామగన్' (శివపుత్రుడు) మంచి విజయాన్ని సొంతం చేసుకున్నాయి. అందుకే 19 ఏళ్ల తర్వాత మళ్లీ బాల దర్శకత్వంలో సూర్య హీరోగా సినిమా ఆరంభమైనందుకు అభిమానులు ఆనందపడ్డారు. 'వణంగాన్' టైటిల్‌తో ఈ చిత్రం ఆరంభమైంది. అయితే ఊహించని ట్విస్ట్ ఇచ్చారు సూర్య-బాల. ఈ చిత్రం నుంచి సూర్య తప్పుకున్నారు. ఈ విషయం గురించి బాల ఓ లేఖ విడుదల చేశారు. ''వణంగాన్' కథలో చేసిన మార్పుల వల్ల ఈ కథ సూర్యకి తగ్గట్టుగా ఉంటుందా? అనే ఫీలింగ్ కలిగింది. నా మీద, ఈ కథ మీద సూర్య పూర్తి నమ్మకంతో ఉన్నారు. అంత గౌరవం, ప్రేమ చూపించే నా తమ్ముడికి చేదు అనుభవం ఎదురు కాకుండా చూడటం ఒక అన్నయ్యగా నా బాధ్యత. అందుకే మేమిద్దరం (సూర్య-బాల) ఒక అవగాహనకు వచ్చాం. ఈ సినిమా నుంచి తను (సూర్య) తప్పుకోవడం కరెక్ట్ అని నాకు, సూర్యకి అనిపించింది. ఇందుకు సూర్య బాధపడ్డారు. భవిష్యత్తులో మేం కలిసి సినిమా చేస్తాం'' అని ఆ లేఖలో పేర్కొన్నారు బాల. కాగా 'వణంగాన్' పనులు కొనసాగుతాయని బాల స్పష్టం చేశారు. అయితే సూర్య స్థానంలో ఏ హీరోని తీసుకోవాలనుకుంటున్నారో బయటపెట్టలేదు.

మళ్లీ కలుద్దాం..

- నాని

''కష్టపడి ప్రిపేర్ అయ్యే బ్యాచ్‌లో శేష్ ఉంటాడు. నేను కాపీ కొట్టి పాస్ అయ్యే బ్యాచ్‌లో ఉంటాను. నేను మ్యాజిక్‌ని నమ్ముతాను. శేష్ లాజిక్‌ను నమ్ముతాడు. అందుకే ఇలా హిట్స్ సాధిస్తున్నాడు. మంచి చిత్రాలు తీస్తే చూస్తాం అని ప్రేక్షకులు మరోసారి నిరూపించినందుకు థ్యాంక్స్. అర్జున్ సర్కార్ సైనింగ్ ఆఫ్ (హిట్ 3ని ఉద్దేశించి).. మళ్లీ కలుద్దాం.. గట్టిగా కలుద్దాం'' అని హీరో నాని అన్నారు. అడివి శేష్, మీనాక్షి చౌదరి జంటగా శైలేష్ కొలను దర్శకత్వం వహించిన చిత్రం 'హిట్ 2'. హీరో నాని సమర్పణలో ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ సినిమా ఈ నెల 2న రిలీజైంది. ఈ సందర్భంగా విజయోత్సవంలో అడివి శేష్ మాట్లాడుతూ - ''హిట్ 2' రిలీజ్ తర్వాత మహేశ్‌బాబుగారు ఫోన్ చేసి, 'నిన్ను చూసి గర్వపడుతున్నాను.. అన్నలా అండగా ఉంటాను' అంటే కంట్లో నీళ్లు తిరిగాయి'' అన్నారు. ''మల్టీప్లెక్స్‌ల్లోనే కాదు.. సింగిల్ స్క్రీన్ థియేటర్స్‌లోనూ ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారు'' అన్నారు శైలేష్ కొలను. సంగీత దర్శకురాలు ఎంఎం శ్రీలేఖ, నటి కోమలీ ప్రసాద్ మాట్లాడారు.



● విజయోత్సాహంలో 'హిట్ 2' టీమ్

దుబాయ్‌లో సిట్టింగ్



● మహేశ్‌బాబు

మహేశ్‌బాబు-త్రివిక్రమ్-తమన్-నాగవంశీ... ఈ నలుగురూ దుబాయ్‌లో ల్యాండ్ అయ్యారు. ఎందుకంటే ఈ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం మ్యూజిక్ సిట్టింగ్స్ కోసం. మహేశ్‌బాబు, పూజా హెగ్డే జంటగా త్రివిక్రమ్ దర్శకత్వంలో నాగవంశీ నిర్మిస్తున్న తాజా చిత్రం షూటింగ్ ఒక షెడ్యూల్ పూర్తయింది. త్వరలో రెండో షెడ్యూల్ స్టార్ట్ కానుంది. ఈ గ్యాప్‌లో దుబాయ్‌లో మ్యూజిక్ సిట్టింగ్స్ ఆరంభించారు. ఓ వారం పది రోజుల పాటు పాటల పని జరుగుతుంది. అనంతరం హైదరాబాద్ చేరుకుని చిత్రీకరణ ఆరంభిస్తారు.

యాక్షన్ అహింస



● అభిరామ్

నిర్మాత సురేశ్‌బాబు తనయుడు, హీరో రానా సోదరుడు అభిరామ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'అహింస'. తేజ దర్శకత్వంలో పి. కిరణ్ నిర్మించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. త్వరలోనే ఈ సినిమాని విడుదల చేస్తున్నట్లు తెలుపుతూ, కొత్త పోస్టర్లను విడుదల చేసింది చిత్రయూనిట్. ''యూత్‌ఫుల్ లవ్, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'అహింస'. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. ఆర్పీ పట్నాయక్ సంగీతం అందించిన 'నీతోనే నీతోనే..', 'కమ్ముగుంటదే..' పాటలు చార్ట్ బస్టర్స్‌గా నిలిచాయి. త్వరలోనే సినిమాని థియేటర్లలో విడుదల చేస్తాం'' అని చిత్రవర్గాలు పేర్కొన్నాయి. ఈ చిత్రానికి కెమెరా: సమీర్ రెడ్డి.



● నయనతార

తెలుగుకి కనెక్ట్

తమిళంలో నయనతార కథానాయికగా నటించే సినిమాలన్నీ దాదాపు తెలుగులోనూ విడుదలవుతాయి. తాజాగా ఆమె నటించిన తమిళ చిత్రం 'కనెక్ట్' కూడా తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ ఈ నెల 22న తెలుగులో విడుదల చేయనుంది. నయనతార భర్త-దర్శకుడు విఘ్నేష్ శివన్ నిర్మించిన ఈ చిత్రానికి అశ్విన్ శరవణన్ దర్శకుడు. నయనతారతో అశ్విన్ గతంలో 'మాయ' (తెలుగులో 'మయూరి) చిత్రాన్ని తెరకెక్కించారు. ఆ చిత్రం లానే తాజా 'కనెక్ట్' కూడా హారర్ థ్రిల్లర్ జానర్‌లో ఉంటుంది.

అయిపోయాడన్నప్పుడు చాన్స్ ఇచ్చారు!



- భీమ్స్

''రవితేజగారితో 'బెంగాల్ టైగర్' చిత్రం చేశా. ఆయన 'ధమాకా' చిత్రానికి రెండోసారి అవకాశం ఇవ్వడం చాలా గౌరవంగా భావిస్తున్నాను. 'బెంగాల్ టైగర్'కి మించిన పాటలు 'ధమాకా'లో ఉన్నాయి. రవితేజగారు నాకు గొప్ప నమ్మకాన్ని ఇచ్చారు.. వందేళ్ల తర్వాత కూడా దీన్ని మర్చిపోను'' అని సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో అన్నారు. రవితేజ, శ్రీలీల జంటగా త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ధమాకా'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ-అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. వివేక్ కూచిభొట్ల సహనిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమా ఈ నెల 23న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా చిత్ర సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో మాట్లాడుతూ- ''రవితేజగారిని చూస్తే చాలు పాటలు, ప్రేమ, భక్తి పుడతాయి. భీమ్స్ పనైపోయిందనే కామెంట్లు విన్నప్పుడు అవకాశం ఇచ్చారు రవితేజగారు. 'ధమాకా'కి రవితేజగారికి పాటల పూజ చేశానేమో అనిపిస్తోంది. నా కెరీర్‌లో కొంత గ్యాప్ వచ్చింది.. ఈ గ్యాప్‌ని ఫుల్‌ఫిల్ చేసేలా పదిహేను సినిమాలు చేస్తున్నాను. వాటిల్లో వచ్చే ఏడాది ఏప్రిల్‌లోపు పది సినిమాలు రిలీజవుతాయి'' అన్నారు.

వైజాగ్‌ని వైవిధ్యంగా చూపించాను

- శ్రీపతి కర్రి



● శ్రీపతి, కిషోరీ దత్రక్, ఆనంద్ రవి, సమన్య రెడ్డి

''ఏ సినిమాకైనా కథే ముఖ్యం. 'కొరమీను'కి ఆనంద్ రవిగారు మంచి కథ ఇచ్చారు. నేను పుట్టి పెరిగిన వైజాగ్‌ని ఈ చిత్రంలో వైవిధ్యంగా చూపించాను. సమన్య రెడ్డిలాంటి నిర్మాత దొరకడం నా అదృష్టం'' అన్నారు శ్రీపతి కర్రి. ఆనంద్ రవి, కిషోరీ దత్రక్ జంటగా శ్రీపతి కర్రి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కొరమీను'. ఓ డ్రైవర్, అహంకారంతో కూడిన, బాగా డబ్బున్న అతని యజమాని, వైజాగ్‌లో ఓ పవర్‌ఫుల్ పోలీస్... ప్రధానంగా ఈ మూడు క్యారెక్టర్స్ మధ్య ఈ చిత్రం సాగుతుంది. మ్యాంగో మాస్ మీడియా సమర్పణలో పెళ్లకూరు సమన్య రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలోని 'తెలిసిందే లే..' అనే పాటను 'బింబిసార' దర్శకుడు వశిష్ఠ, సింగర్ సునీత విడుదల చేశారు. సమన్య రెడ్డి మాట్లాడుతూ- ''ఆనంద్ రవిగారు కథ చెప్పినప్పుడు బావుందనిపించింది. సినిమా కూడా చాలా బాగా వచ్చింది'' అన్నారు. ''మీసాల రాజుకి మీసాలు ఎవరు తీసేసుంటారనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా రూపొందింది'' అన్నారు ఆనంద్ రవి. సౌండ్ డిజైనర్ సాయివర్మ, లిరిసిస్ట్ లక్ష్మీ ప్రియాంక తదితరులు మాట్లాడారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: పవన్ కుమార్ జనస్వామి.

స్వార్థం ఆరంభం



● ఆశిష్

'రౌడీ బాయ్స్' చిత్రంతో హీరోగా పరిచయం అయిన ఆశిష్ నటిస్తున్న రెండో చిత్రం 'సెల్ఫిష్' (స్వార్థం). విశాల్ కాశీని దర్శకుడిగా పరిచయం చేస్తూ సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై 'దిల్' రాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ సోమవారం హైదరాబాద్‌లో ఆరంభమైంది. ''ఇందులో ఆశిష్ మాస్ లుక్‌లో స్టైలిష్‌గా కనిపిస్తారు. వైవిధ్యమైన కథతో తెరకెక్కుతున్న యూత్‌ఫుల్ లవ్‌స్టోరీ'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: ఎస్. మణికందన్, సహనిర్మాతలు: హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి, అశోక్ బండ్రెడ్డి.

వాస్తవ ఘటనలతో...

'బాహుబలి' ప్రభాకర్, అక్షిత్ అంగీరస, రమ్య రాజ్, రమ్య నాని ప్రధాన పాత్రల్లో అమరేందర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'వీకెండ్ పార్టీ'. 'అడ్డదారులు' నవలను రాసిన డా. బోయ జంగయ్య కుమారుడు బోయ చేతన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మించారు. సదాచంద్ర సంగీతం అందించిన ఈ చిత్రం ఆడియో విడుదల వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ''90వ దశకంలో నాగార్జున సాగర్ ప్రాంతంలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా 'వీకెండ్ పార్టీ' రూపొందింది'' అన్నారు అమరేందర్. ''1992లో ఎస్వీ కృష్ణారెడ్డి గారి సినిమాతో నృత్య దర్శకురాలిగా ప్రయాణం మొదలుపెట్టాను. ఈ సినిమాతో మళ్లీ నాకు చాన్స్ ఇచ్చిన దర్శక-నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు డ్యాన్స్ మాస్టర్ సుచిత్రా చంద్రబోస్. మ్యూజిక్ డైరెక్టర్ సదా చంద్ర మాట్లాడారు.



● రమ్య రాజ్, రమ్య నాని

బార్బీ బొమ్మ.. ఆర్డీఎక్స్ బాంబ్



● నేహా శెట్టి

బార్బీ బొమ్మలా అందంగా కనబడుతుంది చిత్ర. కానీ ఆర్డీఎక్స్ బాంబ్ లాంటి మనస్తత్వం ఆమెది. 'బెదురులంక 2012'లో 'డీజె టిల్లు' ఫేమ్ నేహా శెట్టి చేస్తున్న పాత్ర పేరు చిత్ర. సోమవారం (డిసెంబర్ 5) నేహా శెట్టి పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రంలోని ఆమె ఫస్ట్ లుక్ విడుదల చేశారు. కార్తికేయ గుమ్మకొండ, నేహా శెట్టి జంటగా క్లాక్స్ దర్శకత్వంలో రవీంద్ర బెనర్జీ (బెన్నీ) ముప్పానేని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ''సంప్రదాయబద్ధంగా కనిపించే మోడ్రన్ అమ్మాయి చిత్రగా నటనకు అవకాశం ఉన్న పాత్రలో నేహా శెట్టి కనిపిస్తారు. కార్తికేయ, నేహా కాంబినేషన్ సీన్స్ అందర్నీ ఆకట్టుకుంటాయి'' అన్నారు క్లాక్స్. ''త్వరలో సినిమా పూర్తవుతుంది. కొత్త ఏడాదిలో చిత్రాన్ని విడుదల చేస్తాం'' అని బెన్నీ ముప్పానేని అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, సహ నిర్మాతలు: అవనీంద్ర ఉపద్రష్ట, వికాస్ గున్నల, సమర్పణ: సి. యువరాజ్.

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽ 34	నిఫ్టీ △ 5
62,835	18,701

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ఫ్లష్‌' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్‌	11,289	▽	172
డోజోన్స్‌	34,082	▽	348
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,568	△	11
డాక్స్‌	14,448	▽	82
షాంఘై	3,212	△	56
నికాయ్‌	27,820	△	43

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	53,854
బంగారం (99.5 స్వచ్ఛత)	53,638
వెండి (కిలో)	65,764

ఫారెక్స్‌ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్	ఒకటి	80.75	82.43
€	యూరో	ఒకటి	84.82	87.83
£	బ్రిటన్‌ పౌండ్‌	ఒకటి	99.03	102.34
¥	జపాన్‌ ఎన్‌ (100)	ఒకటి	59.75	61.70
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.70	57.04
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.67	61.63
SAR	సౌదీ రియాల్	పదింటికి	20.82	22.49
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	21.37	23.17
¥	చైనా యువాన్	పదింటికి	10.65	12.67

35 బేసిస్‌ పాయింట్ల వరకూ పెంపు!

ఆర్‌బీఐ ఎంపీసీ 3 రోజుల భేటీ షురూ



ముంబై: రిజర్వ్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) మూడు రోజుల సమావేశం సోమవారం ప్రారంభమైంది. ద్రవ్య పరపతి విధానానికి సంబంధించి కీలక నిర్ణయాలను ఆరుగురు సభ్యుల ఎంపీసీకి నేతృత్వం వహిస్తున్న గవర్నర్‌ శక్తికాంతదాస్‌ బుధవారం తెలియజేయనున్నారు. ఈ సమావేశంలో బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీ రేటు రెపోను 25 బేసిస్‌ పాయింట్ల నుంచి 35 బేసిస్‌ పాయింట్ల మేర పెంచే అవకాశం ఉందన్న అంచనాలు వెలువడుతున్నాయి. ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశిస్తున్న 6 శాతం రిటైల్‌ ద్రవ్యోల్బణం ఆ స్థాయిపైన పది నెలలుగా కొనసాగుతున్న నేపథ్యంలో సెంట్రల్‌ బ్యాంక్‌ రెపో రేటు పెంపునకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. సెంట్రల్‌ బ్యాంక్‌ మేలో 40 బేసిస్‌ పాయింట్లు, జూన్‌, ఆగస్టు, సెప్టెంబర్‌లలో 50 బేసిస్‌ పాయింట్ల చొప్పున రెపో రేటును పెంచింది. దీనితో ఈ రేటు 4 నుంచి 5.9 శాతానికి చేరింది. ద్రవ్యోల్బణం దిగివస్తున్న సంకేతాల నేపథ్యంలో రేటు పెంపుపై స్పీడ్‌ వద్దని, తద్వారా వృద్ధికి తగిన ప్రోత్సాహకం ఇవ్వాలని పలు పారిశ్రామిక వర్గాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్‌ / 100కు రూ.లలో)

6-12-2022	
విశాఖ	545-00
చిత్తూరు	568-00
ఈస్ట్‌, వెస్ట్‌ గోదావరి	544-00
విజయవాడ	544-00
రిటైల్‌ ధర (డజను)	78.00
5-12-2022 ఫామ్‌ ధర...	
హైదరాబాద్‌	541-00
వరంగల్‌	543-00
రిటైల్‌ ధర	6.00

నవంబర్‌లో సేవలకు పటిష్ట డిమాండ్‌

ఎస్‌అండ్‌పీ బిజినెస్‌ యాక్టివిటీ ఇండెక్స్‌ 56.4కు అప్‌



న్యూఢిల్లీ: భారత్‌ సేవల రంగం నవంబర్‌లో మూడు నెలల గరిష్ట స్థాయికి ఎగసింది. ఎస్‌అండ్‌పీ గ్లోబల్‌ ఇండియా సర్వీసెస్‌ పీఎంఐ బిజినెస్‌ యాక్టివిటీ ఇండెక్స్‌ 56.4గా నమోదయ్యింది. అక్టోబర్‌లో ఇది 55.1 వద్ద ఉంది. పీఎంఐ 50 శాతంలోపు ఉంటే క్షీణతగా, ఆపైన ఉంటే వృద్ధి ధోరణిగా పరిగణించడం జరుగుతుంది. ఈ ప్రాతిపదికన దేశ ఎకానమీలో మెజారిటీ పాత్ర పోషిస్తున్న సేవల రంగం వరుసగా 20 నెలల నుంచి వృద్ధి ధోరణిలోనే కొనసాగుతోంది. ఎస్‌అండ్‌పీ గ్లోబల్‌ మార్కెట్‌ ఇంటెలిజెన్స్‌లో ఎకనామిక్స్‌ అసోసియేట్‌ డైరెక్టర్‌ పోలియానా డీ లిమా తెలిపిన సమాచారం ప్రకారం, నవంబర్‌లో సేవల రంగానికి పటిష్ట డిమాండ్‌ నెలకొంది. మార్కెటింగ్‌, అమ్మకాలు బాగున్నాయి. సేవల రంగం నవంబర్‌లో చక్కటి ఉపాధి అవకాశాలనూ కల్పించింది. అయితే కంపెనీలు అత్యధిక నిర్వహణా వ్యయాలను ఎదుర్కొన్నాయి.

సేవలు–తయారీ కలిపినా.. స్పీడే!

ఇక తయారీ, సేవల రంగం కలిపిన ఎస్‌అండ్‌పీ గ్లోబల్‌ ఇండియా కాంపోజిట్‌ పీఎంఐ అవుట్‌పుట్‌ ఇండెక్స్‌ అక్టోబర్‌లో 55.5గా ఉంటే, నవంబర్‌లో 57.7కు ఎగసింది. ఈ రెండు విభాగాల్లో ప్రైవేటు రంగ క్రియాశీలత పెరిగినట్లు తమ సర్వేలో వెల్లడైనట్లు డీ లిమా తెలిపారు. ఒక్క తయారీ రంగానికి సంబంధించి ఎస్‌అండ్‌పీ గ్లోబల్‌ ఇండియా మాన్యుఫ్యాక్చరింగ్‌ పర్చేజింగ్‌ మేనేజర్స్‌ ఇండెక్స్‌ (పీఎంఐ) చూస్తే, నవంబర్‌లో 55.7గా నమోదయ్యింది. అక్టోబర్‌లో ఈ సూచీ 55.3 వద్ద ఉంది. గడచిన మూడు నెలల్లో సూచీ ఈ గరిష్ట స్థాయిల్లో నమోదుకావడం ఇదే తొలిసారి. సూచీ 50పైన ఉంటే వృద్ధిగా, ఆ లోపునకు పడిపోతే క్షీణతగా భావిస్తారు. ఈ ప్రాతిపదికన పీఎంఐ వరుసగా 17 నెలల నుంచి వృద్ధి బాటనే పయనిస్తోంది.

ధరలు పెంచనున్న టాటా మోటార్స్‌



న్యూఢిల్లీ: వాహన తయారీ దిగ్గజం టాటా మోటార్స్‌ ప్యాసింజర్‌ వెహికిల్స్‌ ధరలను వచ్చే నెల నుంచి పెంచాలని భావిస్తోంది. ముడి సరుకు వ్యయాలు భారం కావడంతోపాటు 2023 ఏప్రిల్‌ 1 నుండి అమలులోకి వచ్చే కఠినమైన ఉద్గార నిబంధనల నేపథ్యంలో కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది. బ్యాటరీ ధరలూ ప్రియం అవుతున్నాయని, వీటి భారం కస్టమర్లపై ఇంకా వేయలేదని కంపెనీ ప్యాసింజర్‌, ఎలక్ట్రిక్‌ వెహికిల్స్‌ ఎండీ శైలేశ్‌ చంద్ర వెల్లడించారు. బ్యాటరీ ధరలు, నూతన నిబంధనలు ఎలక్ట్రిక్‌ వాహన విభాగంపై ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. వాహనం నుంచి వెలువడే కాలుష్య స్థాయిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక పరికరం ఏర్పాటు చేయాలన్న నిబంధన ఏప్రిల్‌ 1 నుంచి అమలులోకి రానుంది. పరిమిత స్థాయి మించి కాలుష్యం వెదజల్లితే ఈ పరికరం హెచ్చరిస్తుంది.

మళ్లీ రూపాయి పతనం

- దాలరుతో 52 పైసలు డౌన్‌
- 2 వారాల కనిష్టం.. 81.85కు



ముంబై: ఆర్‌బీఐ పాలసీ సమీక్ష నేపథ్యంలో దేశీ కరెన్సీ డీలా పడింది. ఇంటర్‌బ్యాంక్‌ ఫారెక్స్‌ మార్కెట్లో డాలరుతో మారకంలో రూపాయి 52 పైసలు కోల్పోయింది. ఇది గత ఆరు వారాల్లో అత్యధిక నష్టంకాగా.. రెండు వారాల కనిష్టం 81.85 వద్ద ముగిసింది. ఆరు ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు బలహీనపడటంతో తొలుత హుషారుగా ప్రారంభమైన రూపాయి తదుపరి పతన బాట పట్టింది. చమురు ధరలు బలపడటం, దేశీ స్టాక్‌ మార్కెట్లు క్షీణించడం వంటి అంశాలు ప్రభావం చూపాయి. దీంతో 81.26 వద్ద ప్రారంభమైన రూపాయి 81.25 వరకూ పుంజుకుంది. అయితే చివర్లో 81.87 వరకూ క్షీణించింది. వారాంతాన సైతం రూపాయి 7 పైసలు నీరసించి 81.33 వద్ద నిలిచింది. తాజాగా దాలరు ఇండెక్స్‌ 0.1 శాతం తక్కువగా 104.44కు చేరింది. బ్రెంట్‌ చమురు బ్యారల్‌ ధర(ఫ్యూచర్స్‌) 1.8 శాతం ఎగసి 87.13 డాలర్లను తాకింది. ఏడాది ప్రారంభం నుంచి డాలర్‌ మారకంలో రూపాయి విలువ దాదాపు 10 శాతం క్షీణించింది. అక్టోబర్‌ 19న అమెరికా కరెన్సీలో రూపాయి విలువ 60 పైసలు పతనమై, చరిత్రాత్మక కనిష్టం 83 వద్ద ముగిసింది. అదే రోజు ఇంట్రాడేలో 83.01 స్థాయిని కూడా తాకింది.

లెజెండరీ బ్రాండ్‌గా జీఆర్‌టీ

వరుసగా 8 సార్లు ప్రతిష్టాత్మక అవార్డు



హైదరాబాద్‌: జీఆర్‌టీ జ్యువెలర్స్‌ వరుసగా ఎనిమిదవసారి ప్రతిష్టాత్మక 'లెజెండరీ బ్రాండ్‌' అవార్డును దక్కించుకున్నట్లు ఈ మేరకు వెలువడిన ఒక ప్రకటన పేర్కొంది. వినియోగదారులు సంస్థ పట్ల చూపెడుతున్న విశ్వాసమే తమకు ఈ అవార్డును తెచ్చిపెట్టిందని ప్రకటన వివరించింది. జీఎస్‌టీ తమిళనాడులో వరుసగా ఎనిమిదవసారి, కర్ణాటకసహా తెలుగు రాష్ట్రాల్లో వరుసగా 4వ సారి టైమ్స్‌ ఆఫ్‌ ఇండియా– బిజినెస్‌ ద్వారా ఈ ప్రతిష్టాత్మక అవార్డు లభించినట్లు పేర్కొంది. ఐదు దశాబ్దాలపాటు వినియోగదారులకు విశ్వసనీయ, అత్యుత్తమ సేవలు అందించడం సంస్థ పురోగతికి దోహదపడుతున్న అంశమని జీఆర్‌టీ జ్యువెలర్స్‌ ఎండీ అనంత పద్మనాభన్‌ పేర్కొన్నారు. తాము సరైన మార్గంలో పయనిస్తున్నామన్న అంశాన్ని 'వరుస లెజెండరీ అవార్డు' నిరూపిస్తోందని మరో ఎండీ జీఆర్‌ రాధాకృష్ణన్‌ అన్నారు.

మార్కెట్ల రోలర్‌కోస్టర్‌ రైడ్‌

- రోజంతా ఇండెక్సులకు ఆటుపోట్లు
- చివరికి స్వల్ప లాభంతో సెన్సెక్స్‌
- నామమాత్ర నష్టంతో నిలిచిన నిఫ్టీ



ముంబై: ఆర్‌బీఐ పాలసీ సమీక్ష నేపథ్యంలో సోమవారం ట్రేడింగ్‌ ప్రారంభంలోనే డీలా పడ్డ దేశీ స్టాక్‌ మార్కెట్లు మిడ్‌సెషన్‌కల్లా కోలుకుని లాభాల్లోకి ప్రవేశించాయి. అంతలోనే తిరిగి అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొని చివరికి అటూఇటుగా ముగిశాయి. వెరసి ఆటుపోట్ల మధ్య వరుసగా రెండో రోజు సెన్సెక్స్‌ నష్టపోయింది. 34 పాయింట్లతో సరిపెట్టుకుని 62,835 వద్ద స్థిరపడింది. ఎన్‌ఎస్‌ఈ ఇండెక్స్‌ నిఫ్టీ మాత్రం 5 పాయింట్ల నామమాత్ర లాభంతో 18,701 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో సెన్సెక్స్‌ 361 పాయింట్లు కోల్పోయి 62,508 దిగువకు చేరగా.. నిఫ్టీ సైతం 18,591 పాయింట్లకు నీరసించింది. అయితే చివర్లో 18,728 స్థాయిని అధిగమించడం గమనార్హం!

ప్రభుత్వ బ్యాంకుల జోరు

ఎన్‌ఎస్‌ఈలో ప్రధానంగా మెటల్‌(1.9 శాతం), పీఎస్‌యూ బ్యాంక్స్‌(1.2 శాతం), రియల్టీ, ప్రయివేట్‌ బ్యాంక్స్‌(0.6 శాతం) బలపడగా.. ఐటీ, హెల్త్‌కేర్‌, ఆయిల్‌, ఆటో(0.5-0.3 శాతం) డీలా పడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో హిందాల్కో, టాటా స్టీల్‌, యూపీఎల్‌, కోల్‌ ఇండియా, ఓఎన్‌జీసీ, ఎన్‌టీపీసీ, ఎస్‌బీఐ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్‌, ఇండస్‌ఇండ్‌ 4.5-1.3 శాతం మధ్య ఎగశాయి. అయితే మరోపక్క అపోలో హాస్పిటల్స్‌, ఆర్‌ఐఎల్‌, టాటా మోటార్స్‌, టెక్‌ మహీంద్రా, బ్రిటానియా, ఎస్‌బీఐ లైఫ్‌, బీపీసీఎల్‌, డాక్టర్‌ రెడ్డీస్‌, యాక్సిస్‌ 2-0.7 శాతం మధ్య క్షీణించాయి.

చిన్న షేర్లు ఓకే

మిడ్‌, స్మాల్‌ క్యాప్‌ షేర్లు బలపడ్డాయి. బీఎస్‌ఈలో స్మాల్‌ క్యాప్‌ 0.25 శాతం పుంజుకుంది. ట్రేడైన షేర్లలో 2,043 లాభపడగా.. 1,567 నష్టపోయాయి. నగదు విభాగంలో విదేశీ ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) రూ. 1,139 కోట్ల విలువైన స్టాక్స్‌ విక్రయించగా.. దేశీ ఫండ్స్‌ రూ. 2,608 కోట్లను ఇన్వెస్ట్‌ చేశాయి.

స్టాక్‌ హైలైట్స్‌

- ఇటీవల ర్యాలీ చేస్తున్న జేకే లక్ష్మీ సిమెంట్స్‌ షేరు తాజాగా 10 శాతం జంప్‌చేసి రూ. 823 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూ. 835 వద్ద 52 వారాల గరిష్టాన్ని అందుకుంది. గత 7 నెలల్లో ఈ షేరు రెట్టింపునకుపైగా దూసుకెళ్లింది.
- నవంబర్‌లో మహీంద్రా ఫైనాన్స్‌ 75 శాతం వృద్ధితో రూ. 4,500 కోట్ల రుణాలను విడుదల చేసింది. దీంతో షేరు 5.3 శాతం ఎగసి రూ. 241 వద్ద నిలిచింది.
- పండుగలు, పెళ్లిళ్ల సీజన్‌తో కల్యాణ్‌ జ్యువెలర్స్‌ క్యూ3పై అంచనాలు పెరిగాయి. గత 4 రోజుల్లో 18% బలపడిన షేరు 5% జంప్‌చేసి రూ. 115 వద్ద స్థిరపడింది.

స్టార్టప్స్‌కు ద్వారక కో–వర్కింగ్‌ స్పేస్‌

- 13 ప్రాజెక్టులు, 6,500 సీట్లు
- 2024 మార్చికి 11,000 సీట్లు



మీడియాతో మాట్లాడుతున్న ప్రదీప్‌ రెడ్డి, దీప్నా రెడ్డి

హైదరాబాద్‌, బిజినెస్‌ బ్యూరో: ఆఫీస్‌ స్పేస్‌ కంపెనీ ద్వారక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌.. స్టార్టప్స్‌ కోసం ప్రత్యేకంగా 620 సీట్లతో మాదాపూర్‌లో ద్వారక ప్రైడ్‌ను ప్రారంభించింది. దీంతో సంస్థ ఖాతాలో 13 కేంద్రాలకుగాను 3.2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం అందుబాటులోకి వచ్చింది. మొత్తం 6,500 సీట్ల సామర్థ్యానికి చేరుకున్నామని ద్వారక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ ఎండీ ఆర్‌.ఎస్‌.ప్రదీప్‌ రెడ్డి సోమవారమిక్కడ మీడియాకు తెలిపారు. 100కుపైగా కంపెనీల కార్యాలయాలు ద్వారక ప్రాజెక్టుల్లో కొలువుదీరాయని చెప్పారు. కొత్తగా 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆరు ప్రాజెక్టులను 2024 మార్చి నాటికి జోడిస్తున్నట్టు వెల్లడించారు. తద్వారా మరో 4,500 సీట్లు అందుబాటులోకి రానున్నాయని కంపెనీ డైరెక్టర్‌ దీప్నా రెడ్డి వివరించారు.

అనువైన విధానం..: ఆఫీస్‌ స్పేస్‌ పరిశ్రమలో ప్లగ్‌ అండ్‌ ప్లే, కో–వర్కింగ్‌, సర్వీస్డ్‌ ఆఫీస్‌ స్పేస్‌ విభాగాల్లో పోటీ పడుతున్నామని దీప్నా రెడ్డి తెలిపారు. 'ఐటీ రంగంలో ఒడిదుడుకులు సహజం. అందుకే కంపెనీలకు దీర్ఘకాలిక ఒప్పందం భారం కాకుండా అనువైన విధానాన్ని అమలు చేస్తున్నాం. అంటే ఒప్పందం కుదుర్చుకుని సీట్లను తగ్గించుకున్నా వారిపై భారం ఉండదు. మహిళా వ్యాపారవేత్తలకు చార్జీల్లో డిస్కౌంట్‌ ఇస్తున్నాం. మహమ్మారి కాలంలో ఆఫీస్‌ స్పేస్‌ పరిశ్రమ తిరోగమించింది. ఇదే కాలంలో ద్వారక ఇన్‌ఫ్రా భారీ ప్రాజెక్టులకు తోడు రెండింతల సామర్థ్యాన్ని అందుకుంది. సాధారణ చార్జీలతోనే ప్రీమియం ఇంటీరియర్స్‌తో ఖరీదైన అనుభూతి కల్పిస్తున్నాం' అని వివరించారు.

భవిత

- గ్రూప్‌1, గ్రూప్‌2 ప్రత్యేకం- ఇండియన్‌ పాలిటీ కోసం

ఈ క్యూఆర్‌ కోడ్‌ స్కాన్‌ చేయండి

కెరీర్‌ కౌన్సెలింగ్‌
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్‌ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

కేంద్రీయ విద్యాలయాల్లో 6,990 పీజీటీ, టీజీటీ పోస్టులు

దేశవ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విద్యాలయాల్లో (కేవీ) డైరెక్ట్‌ రిక్రూట్‌మెంట్‌ ప్రాతిపదికన బోధన, బోధనేతర పోస్టుల భర్తీకి న్యూఢిల్లీలోని కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌(కేవీఎస్‌) ఆన్‌లైన్‌ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 6990
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఇంటర్‌, డిగ్రీ, పీజీ, బీఈడీ, బీపీఈడీ, డిప్లొమా, పీజీ డిప్లొమా, సీఏ/ఐసీడబ్ల్యూఏ ఉత్తీర్ణత ఉండాలి. దీంతోపాటు సెంట్రల్‌ టీచర్‌ ఎలిజిబిలిటీ టెస్ట్‌(సిటెట్‌) అర్హత సాధించాలి.
» **వయసు:** పోస్టును అనుసరించి గరిష్ట వయోపరిమితి 27 ఏళ్ల నుంచి 50 ఏళ్ల వరకూ ఉంది.
» **ఎంపిక విధానం:** రాత పరీక్ష, క్లాస్‌ డెమో, ఇంటర్వ్యూ, స్కిల్‌ టెస్ట్‌, డాక్యుమెంట్‌ వెరిఫికేషన్‌ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** కేవీఎస్‌ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులు ప్రారంభం:** 05.12.2022
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరి తేదీ:** 26.12.2022
» **వెబ్‌సైట్‌:** www.kvsangathan.nic.in

కేంద్రీయ విద్యాలయాల్లో 6,414 ప్రైమరీ టీచర్‌ పోస్టులు

దేశవ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విద్యాలయాల్లో (కేవీ) డైరెక్ట్‌ రిక్రూట్‌మెంట్‌ ప్రాతిపదికన ప్రైమరీ టీచర్‌ పోస్టుల భర్తీకి న్యూఢిల్లీలోని కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌ (కేవీఎస్‌) ఆన్‌లైన్‌ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 6414
» **అర్హత:** సీనియర్‌ సెకండరీ, డీఈఎల్‌ఈడీ, డీఈఎల్‌ఈడీ(స్పెషల్‌ ఎడ్యుకేషన్‌), లేదా సీనియర్‌ సెకండరీ, బీఈఎల్‌ఈడీ లేదా డిగ్రీ, బీఈడీ ఉత్తీర్ణతతోపాటు సెంట్రల్‌ టీచర్‌ ఎలిజిబిలిటీ టెస్ట్‌(సీటెట్‌) పేపర్‌–1లో అర్హత సాధించి ఉండాలి.
» **వయసు:** 30ఏళ్లు మించకూడదు.
» **వేతనాలు:** రూ.35400 నుంచి రూ.1,12,400 మధ్య లభిస్తుంది.
» **ఎంపిక విధానం:** రాత పరీక్ష, క్లాస్‌ డెమో, ఇంటర్వ్యూ, స్కిల్‌ టెస్ట్‌, డాక్యుమెంట్‌ వెరిఫికేషన్‌ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** కేవీఎస్‌ వెబ్‌సైట్‌ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తుల ప్రారంభం:** 05.12.2022
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరి తేదీ:** 26.12.2022
» **వెబ్‌సైట్‌:** www.kvsangathan.nic.in

పవర్‌ గ్రిడ్‌లో ఫీల్డ్‌ ఇంజనీర్‌

» 800 ఉద్యోగాలకు ప్రకటన విడుదల
» ఒప్పంద ప్రాతిపదికన పోస్టుల భర్తీ

భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన 'మహారత్న'.. పవర్‌ గ్రిడ్‌ కార్పొరేషన్‌ ఆఫ్‌ ఇండియా లిమిటెడ్‌ పలు ఉద్యోగాలకు ప్రకటన విడుదల చేసింది. ఇందులో భాగంగా 800 ఫీల్డ్‌ ఇంజనీర్‌, సూపర్‌వైజర్‌ పోస్టులను భర్తీ చేయనుంది. ఒప్పంద ప్రాతిపదికన భర్తీచేసే ఈ ఉద్యోగాలకు డిప్లొమా/ఇంజనీరింగ్‌ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. స్క్రీనింగ్‌ టెస్ట్‌, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తులను సమర్పించాలి.

విభాగాల వారీగా పోస్టులు

- ఫీల్డ్‌ ఇంజనీర్‌ (ఎలక్ట్రికల్‌): 50 పోస్టులు
- ఫీల్డ్‌ ఇంజనీర్‌ (ఎలక్ట్రానిక్స్‌ అండ్‌ కమ్యూనికేషన్స్‌): 15 పోస్టులు
- ఫీల్డ్‌ ఇంజనీర్‌(ఐటీ): 15 పోస్టులు
- ఫీల్డ్‌ సూపర్‌వైజర్‌(ఎలక్ట్రికల్‌): 480 పోస్టులు
- ఫీల్డ్‌ సూపర్‌వైజర్‌(ఎలక్ట్రానిక్స్‌ అండ్‌ కమ్యూనికేషన్స్‌): 240 పోస్టులు

అర్హతలు

- ఫీల్డ్‌ ఇంజనీర్‌(ఎలక్ట్రికల్‌) పోస్టులకు ఎలక్ట్రికల్‌ విభాగంలో బీఈ/బీటెక్‌/బీఎస్సీ (ఇంజనీరింగ్‌) ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్‌/ఓబీసీ(ఎన్‌సీఎల్‌)/ఈడబ్ల్యూఎస్‌ అభ్యర్థులు 55శాతం మార్కులతో ఇంజనీరింగ్‌ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ఎస్సీ /ఎస్టీ/ దివ్యాంగులు ఉత్తీర్ణులైతే సరిపోతుంది. –డిజైన్‌/ఇంజనీరింగ్‌/కన్‌స్ట్రక్షన్‌/టెస్టింగ్‌ అండ్‌ కమిషనింగ్‌/ఓఅండ్‌ఎం ఇన్‌ రూరల్‌ ఎలక్ట్రిఫికేషన్‌(ఆర్‌ఈ)/డిస్ట్రిబ్యూషన్‌ మేనేజ్‌మెంట్‌ సిస్టమ్‌(డీఎంఎస్‌), సబ్‌ట్రాన్స్‌మిషన్‌(ఎస్‌టీ/ట్రాన్స్‌మిషన్‌ లైన్స్‌(టీఎల్‌ఎస్‌/సబ్‌స్టేషన్స్‌(ఎస్‌/ఎస్‌)లో ఏడాది పాటు పనిచేసిన అనుభవం ఉండాలి.

ఫీల్డ్‌ ఇంజనీర్‌(ఎలక్ట్రానిక్స్‌ అండ్‌ కమ్యూనికేషన్స్‌)

ఎలక్ట్రానిక్స్‌ అండ్‌ కమ్యూనికేషన్‌ విభాగంలో.. బీఈ/బీటెక్‌/బీఎస్సీ(ఇంజనీరింగ్‌) 55శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ కేటగిరీ అభ్యర్థులు పాస్‌ మార్కులు సాధిస్తే సరిపోతుంది. డిజైన్‌/ఇంజనీరింగ్‌/కన్‌స్ట్రక్షన్‌/టెస్టింగ్‌ అండ్‌ కమిషనింగ్‌/ఆపరేషన్‌ అండ్‌ మెయింటెనెన్స్‌ ఆఫ్‌ ఐటీ సిస్టమ్స్‌/నెట్‌వర్కింగ్‌లో కనీసం ఏడాదిపాటు పనిచేసిన అనుభవం ఉండాలి.

ఫీల్డ్‌ ఇంజనీర్‌(ఐటీ)

ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీ విభాగంలో.. బీఈ/బీటెక్‌/బీఎస్సీ(ఇంజనీరింగ్‌) 55శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ కేటగిరీ అభ్యర్థులు పాస్‌ మార్కులు సాధిస్తే సరిపోతుంది. డిజైన్‌/ఇంజనీరింగ్‌/కన్‌స్ట్రక్షన్‌/టెస్టింగ్‌ అండ్‌ కమిషనింగ్‌/ఆపరేషన్‌ అండ్‌ మెయింటెనెన్స్‌ ఆఫ్‌ ఐటీ సిస్టమ్స్‌/నెట్‌వర్కింగ్‌లో కనీసం ఏడాదిపాటు పని చేసిన అనుభవం ఉండాలి.

ఫీల్డ్‌ సూపర్‌వైజర్‌(ఎలక్ట్రికల్‌)

ఈ పోస్టులకు ఎలక్ట్రికల్‌ లేదా తత్సమాన విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్‌ అభ్యర్థులు 55శాతం మార్కులతో పాసవ్వాలి. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ అభ్యర్థులు ఉత్తీర్ణులైతే సరిపోతుంది. కన్‌స్ట్రక్షన్‌/టెస్టింగ్‌ అండ్‌ కమిషనింగ్‌/ఓ అండ్‌ ఎం ఆఫ్‌ ఎలక్ట్రికల్‌ వర్క్స్‌ ఇన్‌ రూరల్‌ ట్రాన్స్‌మిషన్‌ లైన్స్‌(టీఎల్‌ఎస్‌)/ట్రాన్స్‌మిషన్‌ సబ్‌–స్టేషన్స్‌(ఎస్‌/ఎస్‌)లో ఏడాది పనిచేసిన అనుభవం ఉండాలి. బీఈ/బీటెక్‌/ఎంటెక్‌/ఎంఈ వంటి ఉన్నత సాంకేతిక విద్యార్హతలున్న అభ్యర్థులు డిప్లొమా చేసినా చేయకపోయినా ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకునేందుకు అనర్హులు.

ఫీల్డ్‌ సూపర్‌వైజర్‌(ఎలక్ట్రానిక్స్‌ అండ్‌ కమ్యూనికేషన్స్‌)

ఈ పోస్టుకు ఎలక్ట్రానిక్స్‌ అండ్‌ కమ్యూనికేషన్‌/తత్సమాన విభాగంలో.. డిప్లొమా కోర్సు ఉత్తీర్ణులైన వారు దరఖాస్తుకు అర్హులు. జనరల్‌ కేటగిరీకి చెందిన అభ్యర్థులు 55 శాతం మార్కులతో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు పాస్‌ మార్కులు పొందితే సరిపోతుంది. బీఈ/బీటెక్‌/ఎంటెక్‌/ఎంఈ వంటి ఉన్నత సాంకేతిక విద్యార్హతలున్న అభ్యర్థులు ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకునేందుకు అనర్హులు.

ఎంపిక ఇలా

ఫీల్డ్‌ ఇంజనీర్‌ పోస్టులకు సంబంధించి అభ్యర్థులను ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు. అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉంటే మాత్రం స్క్రీనింగ్‌ టెస్టును నిర్వహించి, మెరిట్‌ సాధించిన వారిని ఇంటర్వ్యూలకు పిలుస్తారు. స్క్రీనింగ్‌ టెస్ట్‌ కాలవ్యవధి ఒక గంట. స్క్రీనింగ్‌ టెస్ట్‌లో భాగంగా టెక్నికల్‌ నాలెడ్జ్‌, ఆప్టిట్యూడ్‌ టెస్టులు నిర్వహిస్తారు. టెక్నికల్‌ నాలెడ్జ్‌ టెస్ట్‌లో ఇంజనీరింగ్‌ సిలబస్‌ నుంచి 50 ప్రశ్నలు ఇస్తారు. ఆప్టిట్యూడ్‌ టెస్ట్‌లో 25 ప్రశ్నలుంటాయి. ఇందులో లాజికల్‌ రీజినంగ్‌, డేటా ఇంటర్‌ప్రిటేషన్‌, కాంప్రహెన్షన్‌, వొకాబ్యులరీ, డేటా సఫిషియెన్సీ, నంబర్‌ ఎబిలిటీకి సంబంధించిన ప్రశ్నలుంటాయి. ప్రశ్నలు ఎంసీక్యూ విధానంలో ఇస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కును కేటాయిస్తారు. రుణాత్మక మార్కులు లేవు.

కనీస మార్కులు

అన్‌రిజర్వ్‌డ్‌ అభ్యర్థులు స్క్రీనింగ్‌ టెస్ట్‌లో కనీసం 40 శాతం అర్హత మార్కులుగా సాధించాలి. రిజర్వ్‌డ్‌ కేటగిరీల వారు 30శాతం మార్కులు సాధిస్తే సరిపోతుంది. స్క్రీనింగ్‌ టెస్ట్‌లో అర్హత సాధించిన వారితో ఫైనల్‌ లిస్ట్‌ రూపొందించి, ఇంటర్వ్యూలకు పిలుస్తారు. ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ఆధారంగానే అభ్యర్థులను తుది ఎంపిక చేస్తారు.



ఇంటర్వ్యూలో కటాఫ్‌

ఇంటర్వ్యూలో కూడా అన్‌రిజర్వ్‌డ్‌ అభ్యర్థులు కనీసం 40శాతం అర్హత మార్కులుగా సాధించాలి. రిజర్వ్‌డ్‌ కేటగిరీల వారు కనీసం 30శాతం మార్కులు సాధించాలి. స్కిల్‌ టెస్ట్‌, పర్సనల్‌ ఇంటర్వ్యూలకు అభ్యర్థులు ఇంగ్లిష్‌ లేదా హిందీ భాషలను ఎంపిక చేసుకునే వెసులుబాటు ఉంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌ ద్వారా.
- దరఖాస్తులకు చివరి తేదీ: 11.12.2022
- వెబ్‌సైట్‌: http://www.powergrid.in



నౌకాదళంలో 1500 అగ్నివీర్‌ కొలువులు

ఇంటర్‌, టెన్త్‌ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు

భారత రక్షణ రంగంలో పనిచేయాలనుకునే యువతకు ఇండియన్‌ నేవీ ఆహ్వానం పలుకుతోంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన అగ్నిపథ్‌ స్కీమ్‌లో భాగంగా 1400 అగ్నివీర్‌(ఎస్‌ఎస్‌ఆర్‌) ఖాళీల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. ఇంటర్మీడియెట్‌ అర్హతతో ఈ 1400 పోస్టులకు పోటీ పడొచ్చు. అదేవిధంగా అగ్నివీర్‌(ఎంఆర్‌)100 పోస్టులకు మరో ప్రకటన విడుదల చేసింది. పదో తరగతి ఉత్తీర్ణతతో వీటికి పోటీ పడొచ్చు. ఈ రెండు పోస్టులకు అవివాహిత పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎస్‌ఎస్‌ఆర్‌(సీనియర్‌ సెకండరీ రిక్రూట్‌), ఎంఆర్‌(మెట్రిక్‌ రిక్రూట్‌) పోస్టులకు రెండు దశల్లో నిర్వహించే రాత పరీక్షలు, ఫిజికల్‌, మెడికల్‌ టెస్టుల ఆధారంగా ఎంపిక చేస్తారు. ఎంపికైన వారు శిక్షణ కాలంతో కలుపుకొని నావికాదళంలో నాలుగేళ్లపాటు సేవలు అందించొచ్చు. అనంతరం వీరిలో 25 శాతం మందిని శ్వాశత ఉద్యోగంలోకి తీసుకుంటారు. మిగతావారు ఆర్థిక ప్రోత్సాహకాలతో వైదొలగాల్సి ఉంటుంది.

అగ్నివీర్‌ ఎస్‌ఎస్‌ఆర్‌

- అగ్నివీర్‌(ఎస్‌ఎస్‌ఆర్‌) మొత్తం 1400 పోస్టుల్లో మహిళలకు 280 పోస్టులు లభిస్తాయి.
- **అర్హత:** మ్యాథ్స్‌, ఫిజిక్స్‌ ప్రధాన సబ్జెక్టులుగా.. కెమిస్ట్రీ/బయాలజీ/కంప్యూటర్‌ సైన్స్‌లో ఏదో ఒక సబ్జెక్టుతో ఇంటర్మీడియట్‌ లేదా తత్సమాన కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించి ఉండాలి.
- **వయసు:** 01.05.2022–31.10.2005 మధ్య జన్మించి ఉండాలి. అవివాహిత మహిళలు, పురుష అభ్యర్థులు మాత్రమే ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి.
- **శారీరక ప్రమాణాలు: ఎత్తు:** పురుషులు 157 సెం.మీ, మహిళలు 152 సెం.మీ ఎత్తు ఉండాలి. ఎత్తుకు తగిన బరువు ఉండాలి.

ఎంపిక విధానం

షార్ట్‌లిస్టింగ్‌, కంప్యూటర్‌ ఆధారిత ఆన్‌లైన్‌ పరీక్ష(సీబీఈ), రాత పరీక్ష, ఫిజికల్‌ ఎఫిషియన్సీ టెస్ట్‌(పీఎఫ్‌టీ), మెడికల్‌ టెస్టుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

పరీక్ష ఇలా

- కంప్యూటర్‌ ఆధారిత రాత పరీక్ష హిందీ/ఇంగ్లిష్‌ భాషల్లో ఉంటుంది. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 100 ప్రశ్నలు–100 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. ఇంగ్లిష్‌, సైన్స్‌, మ్యాథమేటిక్స్‌, జనరల్‌ అవేర్‌నెస్‌.. నాలుగు విభాగాల్లో ఇంటర్మీడియట్‌ స్థాయిలో ప్రశ్నలుంటాయి. పరీక్ష సమయం 60 నిమిషాలు. నాలుగు తప్పు సమాధానాలకు ఒక మార్కును తగ్గిస్తారు.
- కంప్యూటర్‌ ఆధారిత రాత పరీక్షలో అర్హత సాధించిన వారికి స్టేజ్‌ 2 రాత పరీక్ష నిర్వహిస్తారు. వీరికి ఫిజికల్‌ టెస్టులూ ఉంటాయి. వీటన్నింటిలో విజయం సాధిస్తే.. చివరగా మెడికల్‌ టెస్టులు నిర్వహిస్తారు. ఈ దశనూ దాటిన వారికి స్టేజ్‌–2లో చూపిన ప్రతిభ ఆధారంగా తుది ఎంపిక చేస్తారు. ఇలా ఎంపికైన వారికి ఒడిశాలోని ఐఎన్‌ఎస్‌, చిలకలో 2023 మే నుంచి శిక్షణ ప్రారంభమవుతుంది. శిక్షణ విజయవంతంగా పూర్తిచేసుకున్న తర్వాత ఆయా విభాగాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

అగ్నివీర్‌ (ఎంఆర్‌)

అగ్నివీర్‌ ఎంఆర్‌కు సంబంధించి వంద ఖాళీలను ప్రకటించారు. ఇందులో మహిళలకు 20 పోస్టులు లభిస్తాయి.పదో తరగతి ఉత్తీర్ణతతో వీటికి పోటీ పడొచ్చు. మే1, 2002 నుంచి అక్టోబర్‌ 31, 2005 మధ్య జన్మించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **ఎంపిక విధానం:** రాత పరీక్ష, ఫిజికల్‌, మెడికల్‌ టెస్టుల ఆధారంగా ఎంపిక చేస్తారు.

పరీక్ష ఇలా

అగ్నివీర్‌(ఎంఆర్‌) రాత పరీక్ష ఆన్‌లైన్‌ విధానంలో 50 మార్కులు–50 ప్రశ్నలకు ఉంటుంది. పరీక్ష వ్యవధి 30 నిమిషాలు. ప్రశ్న పత్రం ఇంగ్లిష్‌/హిందీ మాధ్యమాల్లో ఉంటుంది. ఇందులో రెండు సెక్షన్ల నుంచి ప్రశ్నలు వస్తాయి. సైన్స్‌ అండ్‌ మ్యాథమెటిక్స్‌, జనరల్‌ అవేర్‌నెస్‌ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు లభిస్తుంది. ప్రతి పొరపాటు సమాధానానికి పావు మార్కు తగ్గిస్తారు. రాత పరీక్షలో అర్హత సాధించిన వారికి స్టేజ్‌ 2 పరీక్ష ఉంటుంది. వీరికి ఫిజికల్‌ స్టాండర్ట్‌ టెస్టులు, మెడికల్‌ టెస్టులు ఉంటాయి.

అగ్నివీర్‌తో ప్రయోజనాలు ఇవే..

- **వేతనాలు:** అగ్నివీర్‌లుగా ఎంపికైన వారికి మొదటి ఏడాది రూ.30,000, రెండో ఏడాది రూ.33,000, మూడో ఏడాది రూ.36,500, నాలుగో ఏడాది రూ.40,000 వేతనంగా చెల్లిస్తారు.

సేవానిధి ప్యాకేజీ

అగ్నివీరులకు నాలుగేళ్ల సేవలకుగాను సేవానిధి ప్యాకేజీ అందిస్తారు.ప్రతినెలా వచ్చే వేతనం నుంచి 30శాతం కార్పస్‌ ఫండ్‌కు జమచేస్తారు. ఇలా మొత్తం నాలుగేళ్లకు రూ.5.02 లక్షలు జమ అవుతాయి. అంతే మొత్తాన్ని ప్రభుత్వం జమ చేస్తుంది. ఇలా మొత్తం రూ.10.04 లక్షలు, దానిపై వడ్డీ కలిపి నాలుగేళ్ల అనంతరం ప్యాకేజీగా అందిస్తారు. దీంతోపాటు అగ్నివీర్‌ స్కిల్‌ సర్టిఫికెట్‌ కూడా ఇస్తారు.

- 30 వార్షిక సెలవులు ఉంటాయి. నాలుగేళ్ల సర్వీసులో ఉన్నప్పుడు రిస్క్‌ అండ్‌ హార్డ్‌షిప్‌,రేషన్‌,డ్రెస్‌,ట్రావెల్‌ అలవెన్సులు అందిస్తారు. నాలుగేళ్లపాటు రూ.48 లక్షల జీవిత బీమా కవరేజ్‌ లభిస్తుంది.

ముఖ్యమైన సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌ ద్వారా.
- ఎస్‌ఎస్‌ఆర్‌, ఎంఆర్‌ దరఖాస్తుల స్వీకరణ: డిసెంబర్‌ 8 నుంచి 17 వరకు;
- శిక్షణ ప్రారంభం: 2023 మే నెలలో
- వెబ్‌సైట్‌: https://joinindiannavy.gov.in

క్లుప్తంగా

ప్రభుత్వమే ధాన్యాన్ని తరలిస్తుంది

- పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్

సాక్షి, అమరావతి: ధాన్యం సేకరణలో భాగంగా ప్రభుత్వమే కల్లాల నుంచి ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తుందని పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ధాన్యం నింపేందుకు అవసరమైన గోనె సంచులు, బస్తాలను వాహనంలోకి లోడింగ్ చేసేందుకు హమాలీలను కూడా సమకూరుస్తుందని పేర్కొన్నారు. ఒక వేళ రైతులే వాటిని ఏర్పాటు చేసుకుంటే రవాణా, హమాలీ, గోతాల యూసేజ్ ఖర్చులను రైతుకు లభించే మద్దతు ధరతో కలిపి ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. ఈ విషయాన్ని రైతులందరూ గమనించాలని కోరారు.

24 గంటల్లో ఎఫ్ఐఆర్‌లను అప్‌లోడ్ చేయండి

- సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించండి
- హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, సీఐడీకి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: కేసు నమోదుచేసిన 24 గంటల్లో ఎఫ్ఐఆర్ కాపీలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని హైకోర్టు సోమవారం హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, సీఐడీ అధికారులను ఆదేశించింది. నిందితులు కోరిన పక్షంలో ఎఫ్ఐఆర్ కాపీలను వారికి అందచేయాలని స్పష్టం చేసింది. ఎఫ్ఐఆర్‌ల విషయంలో అధికారులు సుప్రీంకోర్టు నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం నడుచుకోవాల్సిందేనని తేల్చి చెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్ రావు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. తనపై పలు కేసులు నమోదు చేస్తున్న సీఐడీ అధికారులు ఆ కేసుల వివరాలను వెల్లడించడం లేదంటూ మాజీమంత్రి అయ్యన్నపాత్రుడు కుమారుడు చింతకాయల విజయ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం సోమవారం మరోసారి విచారణకు వచ్చింది. పిటిషనర్ న్యాయవాది వి.వి.సతీష్ వాదనలు వినిపిస్తూ.. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఎఫ్ఐఆర్ కాపీలను కేసు నమోదుచేసిన 24 గంటల్లో అప్‌లోడ్ చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ వాదనను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. 24 గంటల్లో ఎఫ్ఐఆర్‌లను అప్‌లోడ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, సీఐడీ అధికారులను ఆదేశించారు.

కమ్యూనిస్టుల పునరేకీకరణ జరగాలి

- సీపీఐ కార్యదర్శి నారాయణ



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో కమ్యూనిస్టుల పునరేకీకరణ జరగాల్సిన అవసరం ఉందని సీపీఐ కార్యదర్శి నారాయణ అన్నారు. సోమవారం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో నారాయణ మీడియాతో మాట్లాడారు. ఒకప్పుడు 60కు పైగా పార్లమెంట్ స్థానాల్లో ఉన్న కమ్యూనిస్టులు.. ప్రస్తుతం తమ ప్రభావం తగ్గడానికి రాజకీయాల్లో ప్రాంతీయవాదం, మతతత్వం, డబ్బు ప్రభావం పెరగడమేనని, ఈ మూడింటికి కమ్యూనిస్టులు దూరంగా ఉండడమే కారణమని వ్యాఖ్యానించారు. వీటికి తోడు కమ్యూనిస్టు పార్టీ చీలిక కూడా దేశంలో ప్రాంతీయ పార్టీలకు ఊతమిచ్చిందని నారాయణ పేర్కొన్నారు. కమ్యూనిస్టుల బలహీనత కారణంగానే ప్రాంతీయ పార్టీలు పుట్టుకొచ్చి బలోపేతమయ్యాయని... లేదంటే కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా కమ్యూనిస్టు పార్టీయే నిలబడేదన్నారు. కాగా జీ-20 సమావేశానికి నాయకత్వం వహించే అవకాశం రొటేషన్‌లో భాగంగా వచ్చిందని.. కానీ ప్రధానిగా మోదీ ఉండడం వల్లే వచ్చిందన్నట్టుగా ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. జీ-20 సదస్సులో మహిళా సాధికారతపై ఒక అంశం ఉన్న పరిస్థితుల్లో.. దేశంలో మహిళా రిజర్వేషన్ల బిల్లును ఆమోదించకుండా ఈ అంశంపై మాట్లాడే నైతిక అర్హత భారత్‌కు ఉండబోదన్నారు. పార్లమెంటులో పూర్తి మెజారిటీతో అధికారంలో ఉన్న బీజేపీ ఈ బిల్లును పాస్ చేయాలని నారాయణ కోరారు.

ఏబీఎన్ వెంకటకృష్ణను విచారించిన సీఐడీ

సాక్షి, అమరావతి: సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేందుకు మీడియాలో దుష్ప్రచారం చేసిన కేసులో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి చానల్ పాత్రికేయుడు పర్వతనేని వెంకటకృష్ణను సీఐడీ అధికారులు సోమవారం విచారించారు. వివిధ వర్గాల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టి సమాజంలో శాంతిభద్రతల సమస్యను సృష్టించేందుకు కుట్రపన్నారనే అభియోగాలపై కొన్ని నెలల కిందట నరసాపురం ఎంపీ కె.రఘురామకృష్ణరాజుతోపాటు ఏబీఎన్-ఆంధ్రజ్యోతి, టీవీ 5 చానళ్లపై సీఐడీ అధికారులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణలో భాగంగా ఇటీవల టీవీ 5 మూర్తిని సీఐడీ అధికారులు విచారించారు. అదే కేసులో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి చానల్ పాత్రికేయుడు వెంకటకృష్ణను సీఐడీ అధికారులు గుంటూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో సోమవారం దాదాపు 8 గంటలపాటు విచారించారు. ఆయన్ని సీఐడీ అధికారులు మంగళవారం కూడా విచారించనున్నారు.

ఏపీలో మహిళా సాధికారత భేష్

- స్వయం సహాయక సంఘాల మహిళల ఎదుగుదల అద్భుతం
- మీ విజయగాథలు విని పులకించిపోయా
- మహిళలు అబలలు కాదు సబలలు అని నిరూపిస్తున్నారు
- మనస్సు పెట్టి పనిచేస్తే మరిన్ని విజయాలు మీ వెంటే..
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో మహిళలతో ముఖాముఖి



మహిళా యూనివర్సిటీలో పుష్పప్రసాదం స్టాల్‌ను పరిశీలిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదిముర్ము



సప్తగో ప్రదక్షిణ మందిరంలో రాష్ట్రపతి

సాక్షి ప్రతినిధి, తిరుపతి/తిరుపతి రూరల్/తిరుమల/రేణిగుంట: 'మీ విజయగాథలు వింటుంటే మనస్సు ఆనందంతో పులకించిపోతోంది. స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించడమే కాకుండా పురుషులతో సమానంగా పది మందికి ఉపాధి కల్పించేలా ఎదిగిన వైనం అద్భుతం. ఆంధ్రప్రదేశ్‌లో మహిళా సాధికారత భేషుగ్గా ఉంది' అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభినందించారు. సోమవారం తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో స్వయం సహాయ సంఘాల సభ్యులు, వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలు, విద్యార్థినులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో రాష్ట్రపతి పాల్గొన్నారు. మహిళలు ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి యూనిట్లను పరిశీలించి.. ఎంత మందికి ఉపాధి కల్పిస్తున్నారంటూ ఆరా తీశారు. అనంతరం పలువురు మహిళలు తమ విజయగాథలను తెలియజేయగా.. రాష్ట్రపతి సావధానంగా ఆలకించారు. చప్పట్లు కొడుతూ వారిని అభినందించారు. అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడారు. ప్రసంగం ఆమె మాటల్లోనే..

మహిళలు ఎవ్వరికీ తక్కువ కాదు..

'మిమ్మల్ని కలవడం చాలా సంతోషంగా, ఎంతో గర్వకారణంగా ఉంది. మీతో మాట్లాడిన తర్వాత నాకు చాలా విషయాలు తెలిశాయి. మహిళలు ఎవ్వరికీ తక్కువ కాదని నమ్ముతున్నాను. నిన్న విశాఖలో నిర్వహించిన నేవీడే వేడుకల్లో మహిళా నౌకాదళ అధికారులు చేసిన విన్యాసాలు చూసి ఆశ్చర్యపోయా. మహిళలు అబల కాదు సబలలు అని నిరూపిస్తున్నారు. రిజర్వేషన్లను అందిపుచ్చుకుంటూ రాజకీయ సాధికార దిశగా అడుగులు వేసి దేశాభివృద్ధిలో మహిళలు మరింతగా భాగస్వాములు కావాలి. మనస్సు పెట్టి పని చేస్తే మరిన్ని విజయాలను అందుకోవచ్చు.

కూచిపూడి ప్రపంచవ్యాప్తం కావాలి

ఆంధ్రప్రదేశ్‌కు కూచిపూడి నృత్యం ఒక వరం. ఇది ఒక రాష్ట్రానికే పరిమితం కాకూడదు. ప్రపంచవ్యాప్తంగా వెలుగొందాలి. చదువు లేకున్నా కూడా అభివృద్ధిలో మహిళలు భాగస్వాములవుతున్నారు. నేటి సమాజంలోని మహిళ శక్తిపై ఎలాంటి సందేహాలు లేవు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను మరింతగా సద్వినియోగం చేసుకొని.. మహిళలు ముందుకెళ్లాలి. శక్తి స్వరూపిణిగా రాణించాలి' అని రాష్ట్రపతి ముర్ము సూచించారు. అంతకుముందు రాష్ట్రపతికి కలంకారీ కళాకారులు రాష్ట్రపతికి సంబంధించిన వివరాలతో తయారుచేసిన కంచిపట్టు చీర, జాకెట్‌ను, పలువురు మహిళలు తాము రూపొందించిన పుష్ప ప్రసాదం ఫొటో ఫ్రేమ్‌ను బహూకరించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, డిప్యూటీ సీఎంలు నారాయణస్వామి, కొట్టు సత్యనారాయణ, మంత్రి రోజా, మేయర్ శిరీష, అధికారులు అనిల్ సింఘాల్, కె.వెంకటరమణారెడ్డి, బాలాజీ, అనుపమ అంజలి, మహిళా వర్సిటీ వీసీ డా.జమున, ఎస్వీయూ వీసీ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాధాదేవి పోరాటం స్ఫూర్తిదాయకం

శ్రీవారి చెంత తమ కులవృత్తి చేసుకునేందుకు మహిళలకు కూడా అవకాశం కల్పించాలని నారీశక్తి అవార్డు గ్రహీత రాధాదేవి చేసిన పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకం. ఆమె పోరాటంతో తిరుమలతో పాటు దేశంలోని ప్రముఖ ఆలయాల్లో కూడా మహిళలను క్షురకులుగా నియమించేందుకు మార్గం ఏర్పడింది. మనం చేసే పని గొప్పది అనుకుంటే అదే గౌరవాన్ని కూడా తీసుకువస్తుంది. గతంలో నేను వైస్ చైర్మన్‌గా ఉన్నప్పుడు స్వీపర్లతో కలిసి పని చేయడానికి నామోషీ పడలేదు. దేశాన్ని ఉన్నత స్థితిలో నిలిపే క్రీడల్లో అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలు ముందంజలో ఉండటం సంతోషకరం.

సప్త గో మందిరం అద్భుతం

గోవుల కోసం శ్రీవారి పాదాల చెంత టీటీడీ తీర్చిదిద్దిన సప్త గో ప్రదక్షిణ మందిరం అద్భుతంగా ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసించారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆమె అలిపిరి పాదాల వద్ద ఉన్న సప్త గో ప్రదక్షిణ మందిరాన్ని సందర్శించారు. రాష్ట్రపతికి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి, సప్త గో ప్రదక్షిణ మందిరం నిర్మాణ దాత శేఖర్‌రెడ్డి, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్రపతి వేణుగోపాలస్వామిని దర్శించుకొని.. గో ప్రదక్షిణ చేశారు. గోవులకు అరటిపళ్లు, మేత తినిపించి.. వాటికి వస్త్రాలు సమర్పించారు. గో తులాభారం ద్వారా మొక్కులు చెల్లించారు. గోవు బరువుకు సరిపడా 435 కిలోల దాణాను విరాళంగా అందించారు. ఇందుకు సంబంధించిన రూ.6 వేల నగదును అధికారులకు అందజేశారు.

నేను సందర్శించిన మొదటి వర్సిటీ ఇదే..

శ్రీవారి పాదాలచెంత ఉన్న శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఒక శక్తి స్థలం. రాష్ట్రపతిగా మొట్టమొదట నేను సందర్శించిన విశ్వవిద్యాలయం ఇదే. వర్సిటీ విద్యార్థినులు గ్రామాలకు వెళ్లి మహిళల స్థితిగతులపై అధ్యయనం చేసి కలెక్టర్లకు నివేదికలు పంపించాలి. మహిళలతో మాట్లాడి వారి అభివృద్ధికి పాటు పడేలా సేవా కార్యక్రమాలు నిర్వహించాలి.



పద్మావతి మహిళా యూనివర్సిటీలో రాష్ట్రపతిని సత్కరిస్తున్న వీసీ దువ్వూరి జమున. చిత్రంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీవారి సేవలో రాష్ట్రపతి


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం ఉదయం తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఉదయం 9.30 గంటలకు పద్మావతి విశ్రాంతి భవనం నుంచి ఆమె శ్రీవారి పుష్కరిణికి చేరుకున్నారు. అక్కడ నీటితో సంప్రోక్షణ చేసుకున్నారు. అనంతరం భూ వరాహస్వామిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి శ్రీవారి ఆలయానికి చేరుకున్న రాష్ట్రపతిని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. ఆలయంలో ధ్వజస్తంభానికి మొక్కుకున్న అనంతరం రాష్ట్రపతి.. శ్రీవారిని దర్శించుకున్నారు. ప్రధాన అర్చకులలో ఒకరైన వేణుగోపాల్ దీక్షితులు శ్రీవారి ఆలయ ప్రాశస్త్యాన్ని వివరించారు. అనంతరం రంగనాయకుల మండపంలో రాష్ట్రపతికి వేదాశీర్వచనం, శ్రీవారి శేష వస్త్రాన్ని, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో పెద్దజీయంగార్‌స్వామి, చిన్నజీయంగార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

సాదర వీడ్కోలు..

తిరుపతి, తిరుమల పర్యటన అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు డిప్యూటీ సీఎంలు నారాయణస్వామి, కొట్టు సత్యనారాయణ తదితరులు సాదర వీడ్కోలు పలికారు.

అడ్డం తిరిగిన తెలంగాణ

- శ్రీశైలం రూల్‌కర్వ్స్‌పై శనివారం అంగీకారం.. సోమవారం యూటర్న్
- తుది నివేదికపై సంతకాలు చేసే సమావేశానికి గైర్హాజరు
- నివేదికపై సంతకం చేసిన ఆర్ఎంసీ కన్వీనర్, బోర్డు సభ్యుడు, ఏపీ అధికారులు
- మార్పులను వ్యతిరేకించామంటూ కృష్ణా బోర్డుకు తెలంగాణ లేఖ
- కృష్ణా బోర్డు చైర్మన్‌కు తుది నివేదిక ఇచ్చిన ఆర్ఎంసీ కన్వీనర్
- ఈ నివేదికపై బోర్డు సర్వ సభ్య సమావేశంలో నిర్ణయం



సాక్షి, అమరావతి: శ్రీశైలం జలాశయం నిర్వహణ విధానాల్లో (రూల్ కర్వ్స్) స్వల్ప మార్పులకు ఆంధ్రప్రదేశ్‌తో పాటు అంగీకరించిన తెలంగాణ.. తుది నివేదికపై సంతకం పెట్టే సమయంలో అడ్డం తిరిగింది. హైదరాబాద్‌లో కృష్ణా బోర్డు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన జలాశయాల నిర్వహణ కమిటీ (ఆర్ఎంసీ) సమావేశానికి ఆంధ్రప్రదేశ్ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి, జెన్‌కో సీఈ సుజయ్‌కుమార్ హాజరైనా.. తెలంగాణ ఈఎన్‌సీ మురళీధర్, జెన్‌కో డైరెక్టర్ వెంకటరాజం గైర్హాజరయ్యారు. దాంతో తుది నివేదికపై ఆర్ఎంసీ కన్వీనర్ ఆర్కే పిళ్లై, బోర్డు సభ్యుడు (విద్యుత్) మౌతాంగ్, ఏపీ ఈఎన్‌సీ, జెన్‌కో సీఈ సంతకాలు చేశారు. తొలుత అంగీకారం తెలిపిన తెలంగాణ అధికారులు.. ఆ తర్వాత సంతకాలు చేయడానికి గైర్హాజరైనట్లు పేర్కొంటూ ఆర్ఎంసీ కన్వీనర్ పిళ్లై కృష్ణా బోర్డు చైర్మన్ ఎంపీ సింగ్‌కు తుది నివేదికను అందజేశారు. ఈ నివేదికపై కృష్ణా బోర్డు సర్వ సభ్య సమావేశంలో చర్చించి, తుది నిర్ణయం తీ. ఇదిలా ఉండగా శనివారం జరిగిన ఆర్ఎంసీ సమావేశంలో శ్రీశైలం జలాశయం రూల్‌కర్వ్స్‌లో స్వల్ప మార్పులకు తాము సమ్మతించకపోయినా, అంగీకరించినట్లుగా కన్వీనర్ పిళ్లై తప్పుగా చిత్రీకరించారంటూ కృష్ణా బోర్డు చైర్మన్ ఎంపీ సింగ్‌కు తెలంగాణ నీటి పారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమవారం సాయంత్రం లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. కృష్ణా జలాలను 66 : 34 నిష్పత్తిలో పంపిణీకి తాము అంగీకరించబోమని, 50 : 50 నిష్పత్తిలో పంపిణీ చేయాలంటూ ఆ లేఖలో పాత పల్లవి అందుకున్నారు. బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపుల ఆధారంగా శ్రీశైలం, సాగర్‌ల రూల్‌కర్వ్స్ ముసాయిదా, విద్యుత్ ఉత్పత్తి, మళ్లించిన వరద జలాలను కోటాలో కలపాలా వద్దా అనే అంశాలపై చర్చించడానికి నాలుగుసార్లు ఆర్ఎంసీ సమావేశాలు నిర్వహించారు. ఒకట్రెండు సమావేశాలకు మాత్రమే తెలంగాణ అధికారులు హాజరయ్యారు. శనివారం జరిగిన ఐదో సమావేశానికి ఏపీ, తెలంగాణ అధికారులు హాజరయ్యారు. శ్రీశైలం రూల్‌కర్వ్స్‌లో స్వల్ప మార్పులకు ఇరు రాష్ట్రాల అధికారులు ఆమోదించారు. సాగర్ రూల్‌కర్వ్స్‌పై సీడబ్ల్యూసీ సూచనల మేరకు తుది నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. శ్రీశైలంలో కనీస నీటిమట్టం 854 అడుగులుగా ఉంచాలన్న సీడబ్ల్యూసీ ప్రతిపాదనకు అంగీకరించారు. శ్రీశైలంలో 50 : 50 నిష్పత్తిలో విద్యుదుత్పత్తి చేయాలని, సాగు, తాగునీటికి బోర్డు కేటాయించిన నీటితోనే విద్యుదుత్పత్తి చేయడానికి సమ్మతించారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి కడలిలో వరద జలాలు కలుస్తున్నప్పుడు రెండు రాష్ట్రాలు మళ్లించిన వరద జలాలను కోటాలో కలపకూడదన్న ఏపీ ప్రతిపాదనకు అంగీకరించారు. అయితే, ఇదే అంశాలతో కూడిన తుది నివేదికపై సంతకం చేయడానికి సోమవారం ఏర్పాటు చేసిన సమావేశానికి తెలంగాణ అధికారులు గైర్హాజరయ్యారు.

ఇదీ నివేదిక

శ్రీశైలం రూల్ కర్వ్స్‌లో స్వల్ప మార్పులు, 50:50 నిష్పత్తిలో విద్యుదుత్పత్తి, మళ్లించిన వరద జలాలను లెక్కించినా కోటాలో కలపకూడదంటూ పేర్కొన్న తుది నివేదికపై తెలంగాణ మినహా ఆర్ఎంసీ సభ్యులు సంతకాలు చేశారు. శ్రీశైలం, సాగర్‌ల నిర్వహణకు శాశ్వత జలాశయాల నిర్వహణ కమిటీ (పీఆర్ఎంసీ)ని ఏర్పాటు చేయాలని నివేదికలో పేర్కొన్నారు. కృష్ణా బోర్డు కేటాయించిన నీటి వినియోగంపై ప్రతి పది రోజులకు ఒక సారి పీఆర్ఎంసీ సమావేశమై, లోటుపాట్లు ఏవైనా ఉంటే వాటిని సరిదిద్దడానికి బోర్డుకు సూచనలు చేయాలని నివేదికలో పేర్కొన్నారు.

రోడ్డుప్రమాదంలో నలుగురు అయ్యప్పభక్తుల దుర్మరణం

శబరిమల వెళ్లి వస్తున్న మాలధారుల వాహనం బోల్తా

డ్రైవర్ సహా 20 మందికి గాయాలు

వీరిలో నలుగురు చిన్నారులు

- బాపట్ల జిల్లా జంపని వద్ద ప్రమాదం
- మృతులు కృష్ణాజిల్లా కృత్తివెన్ను మండలం నీలిపూడి వాసులు
- ప్రమాదంపై సీఎం జగన్ దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా
- గాయపడిన వారికి రూ.50 వేలు
- బాధితుల్ని పరామర్శించిన మంత్రి జోగి రమేష్

తెనాలిరూరల్/తెనాలి/సాక్షి, అమరావతి: బాపట్ల జిల్లా వేమూరు మండలం జంపని గ్రామ సమీపంలో సోమవారం జరిగిన ఘోరప్రమాదంలో నలుగురు అయ్యప్ప మాలధారులు దుర్మరణం పాలయ్యారు. వాహనం బోల్తాపడిన ఈ ప్రమాదంలో డ్రైవర్ సహా 20 మంది గాయపడ్డారు. గాయపడినవారు తెనాలి, గుంటూరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కృష్ణాజిల్లా కృత్తివెన్ను మండలం నీలిపూడి గ్రామానికి చెందిన భక్తులు శబరిమల వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పెడన నియోజకవర్గంలోని నీలిపూడి గ్రామానికి చెందిన నలుగురు చిన్నారులు సహా 23 మంది అయ్యప్పదీక్ష చేపట్టారు. వీరంతా వ్యవసాయ కూలీలే. 41 రోజుల దీక్ష అనంతరం నాలుగురోజుల కిందట శబరిమల వెళ్లారు. తిరుగు ప్రయాణంలో తెనాలి వరకే రిజర్వేషను ఉండటంతో వాహనం డ్రైవర్‌ను సోమవారం వేకువజామునకు తెనాలి రైల్వేస్టేషన్‌కు రమ్మన్నారు. సోమవారం ఉదయం ఆరున్నర గంటలకు శబరి ఎక్స్‌ప్రెస్ నుంచి తెనాలిలో దిగిన 23 మంది అప్పటికే వచ్చి ఉన్న బొలెరో ట్రక్కు వాహనంలో రేపల్లె నుంచి పెనుమూడి వారధి మీదుగా స్వగ్రామానికి వెళ్లేందుకు పయనమయ్యారు. తెనాలి రైల్వేస్టేషన్ నుంచి ఏడుకిలోమీటర్ల దూరంలో జంపని గ్రామ సమీపాన చెరువు అంచున రోడ్డు మలుపు తిరుగుతుంది. దట్టంగా పట్టిన పొగమంచు అప్పటికీ వీడకపోవటంతో డ్రైవరు నాగబాబుకు రోడ్డు మలుపు కనిపించక నేరుగా ముందుకెళ్లాడు. దీంతో వాహనం రోడ్డు అంచున పల్లపు ప్రదేశంలోకి బోల్తా కొట్టింది. వాహనం ట్రక్కులో నిలబడి ఉన్న 23 మంది విసిరేసినట్టు చెల్లాచెదురుగా పడిపోయారు. బొలిశెట్టి పాండురంగారావు (40), పాశం రమేష్ (55), బాడిత రమేష్(42) అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడినవారిని 108 అంబులెన్స్, ఆటోల్లో తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ బుద్దన పవన్ కుమార్ (22) మరణించారు. గాయపడిన వారిలో కుప్పాల భరత్‌కుమార్, కుప్పాల శ్రీనివాసరావు, చందాల వెంకన్న, పోలిశెట్టి నాగరాజులకు ప్రాథమిక వైద్యంచేసి మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించారు. మిగిలిన 16 మందికి తెనాలిలోనే చికిత్స చేస్తున్నారు. మృతదేహాలను తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తెనాలి ప్రభుత్వ ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న మంత్రి జోగి రమేష్

బాధితుల్ని ఓదార్చిన మంత్రి జోగి రమేష్

తెనాలి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోడ్డుప్రమాద బాధితులను పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ పరామర్శించారు. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌తో కలిసి బాధితులను పేరుపేరునా పలకరించి ఓదార్చారు. శవాగారానికి వెళ్లి మృతదేహాలను పరిశీలించారు. శవపరీక్షల అనంతరం మృతదేహాల తరలింపునకు అంబులెన్సును సిద్ధం చేశామన్నారు. ఈ సందర్భంగాను, తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద మంత్రి మీడియాతో మాట్లాడారు. ఈ ప్రమాదంపై సీఎం వైఎస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారని చెప్పారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున, గాయపడినవారికి రూ.50 వేల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారని తెలిపారు. చికిత్స అనంతరం కూడా వారికి ఏ అవసరమెచ్చినా రాష్ట్రప్రభుత్వం అండగా ఉంటుందని తన తరఫున చెప్పాలని ముఖ్యమంత్రి ఆదేశించారని చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన ప్రభుత్వం సహాయ కార్యక్రమాలు చేపట్టిందని ఆయన తెలిపారు. తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ, బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణ ఉన్నారు.

పర్యాటక కేంద్రాలుగా పక్షుల విడిది క్షేత్రాలు

- తేలుకుంచి, తేలినీలాపురం పక్షుల కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు
- వలస పక్షుల సంరక్షణకు చర్యలు
- స్థానికులు, సంస్థలు, ఎన్జీవోల భాగస్వామ్యం తీసుకుంటాం
- చెట్ల పెంపకానికి చర్యలు చేపడతాం
- రాష్ట్ర అటవీ జంతు సంరక్షణాధికారి శాంతిప్రియ పాండే

ఇచ్ఛాపురం రూరల్: శ్రీకాకుళం జిల్లాలో వలస పక్షుల విడిది ప్రాంతాలుగా ప్రసిద్ధి చెందిన ఇచ్ఛాపురం మండలం తేలుకుంచి, టెక్కలి మండలం తేలినీలాపురం ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర అటవీ జంతు సంరక్షణాధికారి శాంతిప్రియ పాండే చెప్పారు. సోమవారం తేలుకుంచి గ్రామంలో పర్యటించిన ఆమె సైబీరియా నుంచి వలస వచ్చిన పక్షులను పరిశీలించారు. ఏటా జూన్ నెలలో సుమారు 3,500 నుంచి 4 వేల వరకు ఓపెన్ బిల్ స్టార్క్ పక్షులు తేలుకుంచి గ్రామానికి వచ్చి సందడి చేస్తుంటాయని చెప్పారు. అక్టోబర్ నెలలో సుమారు 2 వేల పెలిస్టార్, పెలికాన్ పక్షులు తేలినీలాపురం వచ్చి గుడ్లు పెట్టి పొదుగుతుంటాయని వివరించారు. విదేశీ పక్షులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అధికారులతోపాటు స్థానికులకు ఉందన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ఒడిశా సరిహద్దు ప్రాంతంతో పాటు జాతీయ రహదారి, రైల్వే స్టేషన్లు తేలుకుంచి, తేలినీలాపురం పక్షుల క్షేత్రాలకు సమీపంలో ఉన్న నేపథ్యంలో పర్యాటకులు విడిది చేసేందుకు వీలుగా ఆ రెండు చోట్లా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని శాంతిప్రియ పాండే చెప్పారు. ముఖ్యంగా స్థానికులు, ఎన్జీవోలు, వివిధ సంస్థలు, యువజన సంఘాలు, పక్షి ప్రేమికులను భాగస్వాములుగా చేసి వారి నుంచి నిధులు సేకరించి ఈ రెండుచోట్లా చెట్లు నాటడం, పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. పక్షులకు బర్డ్ ఫ్లూ, ఇతరత్రా వ్యాధులు సోకకుండా పశుసంవర్ధక శాఖ సిబ్బంది సాయంతో సంరక్షించుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖాధికారి నిషాకుమారి, టెక్కలి సహాయ అటవీ జంతు సంరక్షణాధికారి వి.హారిక, కాశీబుగ్గ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎ.మురళీకృష్ణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నూతన టెక్నాలజీతో రోడ్లకు మహర్దశ

సాక్షి ప్రతినిధి, విజయవాడ: రాష్ట్రంలో రోడ్లకు మహర్దశ పట్టబోతోంది. ఎఫ్‌డీఆర్ (ఫుల్ డెప్త్ రెక్లమేషన్) టెక్నాలజీతో రాష్ట్రంలో 1000 కిలోమీటర్ల మేర రోడ్లు వేయాలని ఇప్పటికే సీఎం జగన్ సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా తొలిదశలో 100 కిలోమీటర్ల రోడ్లను నిర్మించనున్నారు. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు కృష్ణా జిల్లాలోనూ ఎఫ్‌డీఆర్ నూతన టెక్నాలజీలతో రోడ్లు వేయనున్నారు. వీటి నిర్మాణంలో నాణ్యతను పెంచే ప్రక్రియలో భాగంగా సోమవారం సెంట్రల్ రోడ్డు రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఆర్ఆర్ఐ) న్యూఢిల్లీ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ భరత్ ఆధ్వర్యంలో ఏపీఆర్‌డీసీ చైర్మన్ కనుమూరి సుబ్బరాజు, డైరెక్టర్ మర్రెడ్డి శిల్పారెడ్డి, ఆర్ అండ్ బీ ఎస్ఈ మోషే తదితరులతో కలిసి గుడివాడ నుంచి కంకిపాడు వెళ్లే ప్రధాన రహదారిని పరిశీలించారు. ఉభయగోదావరి జిల్లాల్లో ఇప్పటికే బాగా ధ్వంసమైన రోడ్లను దీని కోసం గుర్తించబోతున్నారు. ఎఫ్‌డీఆర్ టెక్నాలజీతో రోడ్లు నిర్మిస్తే వాటి జీవితకాలం 15 ఏళ్లు ఉంటుందని ఏపీఆర్‌డీసీ చైర్మన్ కనుమూరి సుబ్బరాజు తెలిపారు.



రోడ్లను పరిశీలిస్తున్న సీఆర్ఆర్ఐ బృందం

మెడికో గొంతు కోసి చంపిన టెకీ

పెదకాకాని: ప్రేమను కాదని చెప్పిందన్న అక్కసుతో బీడీఎస్ విద్యార్థిని గొంతుకోసి చంపేశాడు ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. గుంటూరు జిల్లా తక్కెళ్లపాడు గ్రామంలో సోమవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. పెదకాకాని సీఐ సురేష్‌బాబు కథనం ప్రకారం.. కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన తపస్వి (21) విజయవాడ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ డెంటల్ సర్జరీ (బీడీఎస్) తృతీయ సంవత్సరం చదువుతోంది. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం మానికొండకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ జ్ఞానేశ్వర్‌తో రెండేళ్ల క్రితం ఇన్‌స్టాగామ్‌లో పరిచయం ఏర్పడింది. కొంతకాలంగా జ్ఞానేశ్వర్ ప్రేమిస్తున్నానంటూ ఆ యువతిని వేధిస్తుండటంతో ఇటీవల విజయవాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు అతడిని స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి.. మరోసారి ఇలా చేయవద్దని హెచ్చరించి పంపించారు. అయినప్పటికీ జ్ఞానేశ్వర్ వేధింపుల్ని ఆపలేదు. దీంతో తపస్విని 10 రోజుల క్రితం తక్కెళ్లపాడు డెంటల్ కాలేజీ విద్యార్థిని అయిన తన స్నేహితురాలి రూమ్‌కు వెళ్లి అక్కడే ఉంటోంది. ఈ విషయం తెలుసుకున్న జ్ఞానేశ్వర్ సోమవారం రాత్రి సర్జికల్ బ్లేడు, కత్తి వెంట తీసుకుని తపస్వి ఉంటున్న ప్రాంతానికి చేరుకుని.. సర్జికల్ బ్లేడుతో ఆమె గొంతు కోశాడు. అనంతరం తన చేతిని కూడా కోసుకున్నాడు. ఆమె స్నేహితురాలు కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకుని జ్ఞానేశ్వర్‌కు దేహశుద్ధి చేసి తాడుతో కట్టేసి పోలీసులకు సమాచారం అందించారు. తపస్విని చికిత్స నిమిత్తం మొదట ప్రైవేట్ ఆస్పత్రికి, ఆ తరువాత ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి తపస్వి (21) మరణించింది. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న జ్ఞానేశ్వర్ ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.



కత్తితో గొంతు కోయడంతో మృతి చెందిన తపస్వి

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.